
'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 358

సోమవారం 20-3-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆసీస్ పేస్‌కు భారత్ బోల్తా

రెండో వన్డేలో ఆసీస్ చేతిలో 10 వికెట్ల తేడాతో ఓడిన టీమిండియా.. - 12లో



అమ్మ ఆకాంక్షలకు చట్టరూపం

ఎస్టేట్ ప్లానింగ్‌తో కుటుంబానికి పూర్తి రక్షణ..విల్లు కంటే విస్తృతం - 13లో



పరారీలో అమృత్‌పాల్ సింగ్

వివాదాస్పద ఖలిస్తానీ నేత అమృత్‌పాల్‌సింగ్ ఇప్పటికీ పరారీలోనే ఉన్నాడని పంజాబ్ పోలీసులు ఆదివారం వెల్లడించారు.

- వివరాలు 6లో



రాహుల్ ఇంటికి ఢిల్లీ పోలీసులు

లైంగిక వేధింపులకు గురయ్యామని చెప్పిన మహిళల వివరాలు తెలియజేయాలని కోరుతూ పోలీసులు రాహుల్ ఇంటికి వెళ్లారు.

- వివరాలు 6లో



ఆక్రమిత మేరియుపోల్‌లో పుతిన్

ఉక్రెయిన్‌లోని ఆక్రమిత తీర ప్రాంత నగరం మేరియుపోల్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆదివారం ఆకస్మికంగా పర్యటించారు.

- వివరాలు 6లో



ఈక్వెడార్, పెరూల్లో భూకంపం

ఈక్వెడార్–పెరూ సరిహద్దుల్లో సంభవించిన భారీ భూకంపంలో 14 మంది మృతిచెందగా, పలు భవనాలు నేలమట్టమయ్యాయి.

- వివరాలు 6లో

హాజరుపై ఉత్కంఠ!

ఎమ్మెల్సీ కవితను నేడు విచారణకు రావాలన్న ఈడీ అధికారులు

స్వయంగా హాజరవుతారా?.. న్యాయవాదిని ప్రతినిధిగా పంపుతారా?

హాజరుకాకుంటే ఈడీ ఎలా స్పందిస్తుందనే దానిపై చర్చలు

ఎలాంటి పరిణామాలు జరగొచ్చన్న దానిపై బీఆర్ఎస్ శ్రేణుల్లో టెన్షన్

24న సుప్రీంకోర్టులో విచారణ వరకు ఆగాలని కవిత యోచన!

కోర్టు ఏం చెప్తుందనే దాన్ని బట్టి ఈడీ ఎదుట హాజరవడంపై నిర్ణయం?

న్యాయ నిపుణుల సూచనలకు అనుగుణంగా వ్యవహరించే అవకాశం

మంత్రి కేటీఆర్, భర్త అనిల్‌తో ప్రత్యేక విమానంలో ఢిల్లీకి చేరుకున్న కవిత

సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్ అంశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరుపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ నెల 16న జరగాల్సిన ఈడీ విచారణకు కవిత వెళ్లకపోవడం.. తన న్యాయవాది ద్వారా సమాచారం, డాక్యుమెంట్లు పంపడం.. సుప్రీంకోర్టులో తాను వేసిన పిటిషన్‌పై 24న విచారణ జరిగేదాకా ఈడీ విచారణ ఆపాలని అధికారులకు లేఖ రాయడం.. అయినా కూడా 20న విచారణకు హాజరుకావాలంటూ ఈడీ సమన్లు ఇవ్వడం నేపథ్యంలో అన్నివర్గాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. అంతేగాకుండా ఈడీ విచారణపై సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలన్న కవిత విజ్ఞప్తిని.. చీఫ్ జస్టిస్ ధర్మాసనం తిరస్కరించడం హాట్ టాపిక్‌గా మారింది. కవిత ఈడీ విచారణకు హాజరైతే ఏం జరుగుతుంది? ఒకవేళ హాజరుకాకపోతే ఈడీ ఎలా స్పందిస్తుంది? ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయన్నది బీఆర్ఎస్ శ్రేణుల్లో మరింత టెన్షన్ రేపుతోంది. ఈ క్రమంలో సోమవారం కవిత ఈడీ విచారణకు హాజరవుతారా? లేక మొన్నటిలా న్యాయవాదిని తన ప్రతినిధిగా పంపుతారా? అన్నది చర్చనీయాంశంగా మారింది.



ఢిల్లీకి చేరుకున్న కవిత

సోమవారం (20న) విచారణకు హాజరుకావాలన్న ఈడీ నోటీసుల నేపథ్యంలో ఎమ్మెల్సీ కవిత ఆదివారం సాయంత్రమే బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. కవిత వెంట ఆమె భర్త అనిల్‌తోపాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్, కొందరు సన్నిహిత అనుచరులు ఉన్నట్టు సమాచారం. అధికారులకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఒకరోజు ముందే కవిత ఢిల్లీకి చేరుకున్నా.. విచారణకు హాజరయ్యే విషయంలో మాత్రం ఆచితూచి వ్యవహరించాలని భావిస్తున్నట్టు తెలిసింది. న్యాయ నిపుణుల

మిగతా 3వ పేజీలో ▶

'సుప్రీం' నిర్ణయం తేలిన తర్వాతే..?

ఈ నెల 24న సుప్రీంకోర్టులో తన పిటిషన్ విచారణకు రానున్న నేపథ్యంలో.. సోమవారం కూడా కవిత తన న్యాయవాది లేదా ప్రతినిధి ద్వారా ఈడీకి సమాచారం పంపే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. ఈడీ విచారణకు హాజరుకాని పక్షంలో ఎదురయ్యే పరిణామాలపై కవిత ఇప్పటికే ఓ అంచనాకు వచ్చారని.. నిబంధనల మేరకు విచారణ జరగడం లేదంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో అదే వాదనకు కట్టుబడి ఉండాలని భావిస్తున్నారని తెలిసింది. సుప్రీం ఏం చెప్తుందనే అంశాన్ని చూశాకే ఈడీ ఎదుట హాజరవడంపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలో న్యాయ నిపుణులతో జరిగే సంప్రదింపుల్లో సహకరించేందుకే కవితతోపాటు మంత్రి కేటీఆర్ ఢిల్లీకి వెళ్లినట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.



ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండలంలో నీటిలో కొట్టుకుపోతున్న మిరపకాయలను ఏరుతున్న రైతులు

5 లక్షల ఎకరాల్లో పంట నష్టం

రాష్ట్రవ్యాప్తంగా అకాల వర్షాలు, వడగళ్ల ప్రభావం

విరిగిపోయిన మొక్కజొన్న.. నేల రాలిన మామిడి

- కోత దశకు వచ్చిన వరి పంటకు దెబ్బ
- కూరగాయల పంటలకూ నష్టం
- ప్రాథమిక అంచనాలు రూపొందిస్తున్న వ్యవసాయశాఖ.. నష్టంపై కేంద్రానికి లేఖ రాయాలని నిర్ణయం!

సాక్షి, హైదరాబాద్/ సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురుగాలులు, వడగళ్ల వానలతో యాసంగి పంటలకు భారీ నష్టం వాటిల్లింది. దాదాపు 5 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా మొక్కజొన్న, వరి, శనగ పంటలతోపాటు మామిడిపై ప్రభావం ఉన్నట్టు చెప్తున్నారు. ప్రస్తుతం జిల్లాల వారీగా పంట నష్టంపై ప్రాథమిక అంచనాలను సిద్ధం చేస్తున్నామని.. మొత్తం నష్టంపై త్వరలో స్పష్టత వస్తుందని వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ అకాల వర్షాల ప్రభావం ఉందన్నారు. కాగా పంట నష్టంపై కేంద్రానికి లేఖ రాయాలని వ్యవసాయశాఖ సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఇప్పటికే వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు హెలికాప్టర్ ద్వారా పంట నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించారు. బాధితులతోనూ మాట్లాడారు.

మొక్కజొన్న, మామిడి, వరిలపై ప్రభావం

యాసంగి తాజా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 72.61 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. అందులో వరి 56.44 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 6.48 లక్షల ఎకరాలు, శనగ 3.64 లక్షల ఎకరాలు, వేరుశనగ 2.42 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఇక రాష్ట్రంలో 3.50 లక్షల ఎకరాల్లో

మిగతా 5వ పేజీలో ▶

నేటి నుంచి నిందితుల ఉమ్మడి విచారణ

టీఎస్‌పీఎస్సీ కేసులో సిట్ దర్యాప్తు ముమ్మరం

- మొత్తం 30 ప్రశ్నలతో ప్రత్యేక ప్రశ్నావళి రూపకల్పన
- ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పెన్‌డ్రైవ్‌లు, సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు
- ఎఫ్ఎస్ఎల్ నివేదిక వస్తే మరింత స్పష్టత!



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ల లీకేజీ స్కామ్‌లో సిట్ దర్యాప్తు ముమ్మరం చేసింది. ప్రవీణ్, రాజశేఖర్, రేణుకలతో సహా తొమ్మిది మంది నిందితులను ప్రత్యేక దర్యాప్తు బృందం శనివారం తమ కస్టడీలోకి తీసుకున్న విషయం విదితమే. వీరిని శని, ఆదివారాల్లో విడివిడిగా ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో నమోదు చేసిన వాంగ్మూలాలను సరిపోల్చుతూ మొత్తం 30 ప్రశ్నలతో కూడిన ప్రత్యేక ప్రశ్నావళిని సిద్ధం చేసింది. దీని ఆధారంగా సోమవారం నుంచి నిందితులను ఉమ్మడిగా ప్రశ్నించాలని నిర్ణయించింది. ప్రవీణ్–రాజశేఖర్, ప్రవీణ్–రేణుక, రాజశేఖర్–రేణుక.. ఇలా ఇద్దరిద్దరు చొప్పున, ఆ తర్వాత అందరినీ కలిపి ప్రశ్నించడానికి సిద్ధమైంది. మరోవైపు ఇప్పటికే నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న పెన్‌డ్రైవ్‌లు, సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లతో పాటు టీఎస్‌పీఎస్సీ నుంచి సీజ్ చేసిన కంప్యూటర్ తదితరాలను ఫోరెన్సిక్ పరీక్షలకు (ఎఫ్ఎస్ఎల్‌కు) పంపింది. ఎఫ్ఎస్ఎల్ నుంచి నివేదిక

మిగతా 2వ పేజీలో ▶

మరింత మందికి పేపర్లు!

రెండోరోజు నిందితులను 7 గంటలకు పైగా సిట్ విచారించింది. ప్రవీణ్, రాజశేఖర్, రేణుకలకు చెందిన వాట్సాప్ చాట్లను సైబర్ నిపుణులు రిట్రీవ్ చేశారు. వాటిని నిందితుల ముందుంచి ప్రశ్నించారు. వాట్సాప్‌లు పరిశీలించిన నేపథ్యంలో కొత్త అంశాలు వెలుగులోకి వచ్చాయి. ప్రవీణ్, రాజశేఖర్, రేణుకలు చాలామందికి ప్రశ్నపత్రాలు పంపినట్లుగా ఆధారాలు లభించాయి. గ్రూప్–1 పేపర్‌ను కూడా చాలామందికి సర్క్యులేట్ చేసినట్లుగా ఆధారాలు సేకరించారు. ఈ నేపథ్యంలో కమిషన్ కార్యాలయంలో రాజశేఖర్, ప్రవీణ్ వినియోగించిన కంప్యూటర్ల నుంచి డేటాను రిట్రీవ్ చేసేందుకు ఫోరెన్సిక్ ల్యాబ్‌కి పంపించారు. పేపర్లు అందుకున్న వారిని నిందితుల జాబితాలో చేర్చి ప్రశ్నించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

లీకేజీలో 'ఎన్ఆర్ఐ' లింకులు?

ఎన్ఆర్ఐ లీడర్ సిఫారసుతోనే రాజశేఖర్‌కు ఉద్యోగం? 2లో

మళ్లీ జీవీకే చేతికి '108'

102, 104 సేవలు కూడా ఆ సంస్థకే అప్పగింత

- ప్రభుత్వ ఆసుపత్రులనుంచి పేదల మృతదేహాల తరలింపు కూడా..
- ఒకే గొడుగు కిందికి ఈ నాలుగు సేవలు
- మండలానికో అంబులెన్స్ ఇవ్వాలని కీలక నిర్ణయం

10లో



మంత్రి పీఏనే లీకేజీ సూత్రధారి



నిరుద్యోగ దీక్ష అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న రేవంత్

- 2లో

కేటీఆర్ పేషీ నుంచే వ్యవహారం..

పెద్ద తలల పేర్లు బయటకు రాకుండా చర్యలు

జైలులో ప్రవీణ్, రాజశేఖర్ రెడ్డిలకు బెదిరింపులు

- జైలులో వారిని కలసినవారి వివరాలు బయటపెట్టాలి
- నిరుద్యోగ నిరసనలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

లీకేజీలో నమ్మలేని నిజాలు

గ్రూప్–1 పరీక్షలో బీఆర్ఎస్ నేతల పిల్లలు, బంధువులు క్వాలిఫై అయ్యారు

ఒకే మండలం నుంచి 50 మందికిపైగా అర్హత సాధించారు



- లీకేజీకి కేటీఆరే బాధ్యుడు ఆయన్ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి
- అతిత్వరలో వాస్తవాలు బయటపెడతాం.. అసలైన దోషులను సమాజం ముందుంచుతాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సంచలన ఆరోపణలు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 పరీక్షలో నమ్మలేని నిజాలు బయటకొస్తున్నాయని... బీఆర్ఎస్ నేతల పిల్లలు, బంధువులు, వారి వద్ద పనిచేసే వాళ్లు గ్రూప్–1 పరీక్షలో క్వాలిఫై అయినట్లు తమకు సమాచారం అందిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'లక్షలాది మంది నిరుద్యోగులను వంచించిన కేసీఆర్ ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో ▶



రిజర్వాయర్ కట్ట వద్ద మోహరించిన పోలీస్ బలగాలు

దిన్నోనిపల్లి అష్టదిగ్బంధం

'నెట్టెంపాడు' రిజర్వాయర్ భూనిర్వాసితుల గ్రామంలో 144 సెక్షన్

- నిరసన దీక్షలు చేస్తున్న నిర్వాసితులను అర్ధరాత్రి అరెస్టు చేసిన పోలీసులు
- గ్రామంలోని పురుషులందరినీ అదుపులోకి తీసుకున్న వైనం
- పనులను అడ్డుకొనేందుకు మహిళల విఫలయత్నం

10లో

న్యూస్‌రీల్

ట్రాక్‌లో పడేదెప్పుడు?



మహిళలు, చిన్నారుల భద్రతకోసం గ్రేటర్ హైదరాబాద్‌లో తిరిగే క్యాబ్‌లు, ఆటోలు, ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు తదితర అన్ని రకాల ప్రజా రవాణా వాహనాల్లో జీపీఎస్ ట్రాకింగ్ పరికరాలను ఏర్పాటు చేయాలని అప్పట్లో రాష్ట్ర రవాణా శాఖ ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే ఆ ప్రతిపాదన ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు.

- వివరాలు 5లో

మిల్లెట్ మ్యాన్ పీవీ సతీశ్ కన్నుమూత



డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీని స్థాపించి, పాత పంటలు, సంప్రదాయ పంటలు, చిరుధాన్యాల సంరక్షణను ఉద్యమంలా చేపట్టి తెలంగాణ మిల్లెట్ మ్యాన్ గా పేరుగాంచిన పీవీ సతీశ్ (77) ఆదివారం మృతిచెందారు. అనారోగ్య సమస్యలతో హైదరాబాద్ లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ లో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

- వివరాలు 5లో

బీఆర్ఎస్‌ను తెలంగాణ ప్రజలే టార్గెట్ చేశారు: కిషన్‌రెడ్డి



అవినీతి, అక్రమాలలో కూరుకుపోయిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తెలంగాణ సమాజమే టార్గెట్ చేసిందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజల నాడి స్పష్టమైందన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, బీజేపీతోనే ఆ మార్పు సాధ్యమవుతుందని తెలిపారు.

- వివరాలు 3లో

ఇదండీ జగత్



ఎందుకు కష్టపడి చదువుకోవడం.. ఎలాగూ పేపర్ లీకవుతుందిగా అంటున్నాడండీ..!



సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్

కేసీఆర్ పాలనలో దళితులకు అవమానం

ఎస్సీ మోర్చా కార్యవర్గ సమావేశంలో బండి

నాంపల్లి: 'ప్రత్యేక తెలంగాణ కోసం 1,400 మంది బలిదానాలు చేసుకుంటే రాష్ట్రం వచ్చింది. అలాంటి తెలంగాణలో దళితుల పరిస్థితి అధ్వానంగా మారింది. కేసీఆర్ పాలనలో దళితులను అడుగడుగునా అవమానిస్తున్నారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కేసీఆర్ మార్చాలన్నారు. దళితులకు సీఎం పదవి ఇస్తానని చెప్పి మాటతప్పారు. దళితులకు భూపంపిణీ చేస్తామని మోసం చేశారు' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మండిపడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. దళితుల బాధలను పట్టించుకోని కేసీఆర్... దొంగ సారా దందా చేసిన తన బిడ్డను కాపాడుకోవడానికి ఢిల్లీకి మంత్రులను పంపడం సిగ్గుచేటని విమర్శించారు. కేంద్ర పథకాల లబ్ధిదారుల్లో 60 శాతం మంది దళితులేనన్నారు. మోదీని అభినవ అంబేడ్కర్‌గా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లాల్‌సింగ్ ఆర్య, పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాష, ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి శంభునాథ్ తుండియా, జాతీయ కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వివేక్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

దేశానికి ప్రమాదకరంగా మారిన బీజేపీ: రాఘవులు



సూర్యాపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశానికి ప్రమాదకారిగా మారిందని, దాని నియంత్రణ కు ప్రతిపక్షాలు ఏకం కావాల్సిన అవసరం ఉందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం సూర్యాపేట జిల్లాలోని రాయినిగూడెం గ్రామంలో సభను నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థతోపాటు ఫెడరలిజాన్ని పూర్తిగా నాశనం చేయడానికి పూనుకుందని విమర్శించారు. ప్రతిపక్షాలను అణచివేయాలనే ఉద్దేశంతో వారిపై అవినీతి ఆరోపణలు రుద్దుతూ ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో కేసులు పెడుతూ బెదిరింపులకు పాల్పడుతోందన్నారు. తెలంగాణ వ్యవహారాల్లో జోక్యానికి కేంద్రం ప్రయత్నం చేస్తోందని, ఇందులో భాగంగానే అనేక సంస్కరణలు అమలు చేయాలని రాష్ట్రంపై ఒత్తిడి చేస్తోందని విమర్శించారు.

లీకేజీలో 'ఎన్‌ఆర్‌ఐ' లింకులు?

- ఎన్‌ఆర్‌ఐ లీడర్ సిఫారసుతోనే రాజశేఖర్‌కు ఉద్యోగం?
- విదేశాల నుంచి వచ్చిన ఇద్దరికి పేపర్ లీక్‌తో ప్రభుత్వ ఉద్యోగాలు
- గ్రూప్–1 పరీక్ష కోసమే విదేశాల నుంచి వచ్చిన మరో ఇద్దరు?
- ఈ నలుగురూ రాజశేఖర్ సన్నిహితులు కావడంపై అనుమానాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగిస్తున్న టీఎస్‌పీఎస్సీ లీకేజీలో ఎన్‌ఆర్‌ఐల పాత్ర ఉందా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. కమిషన్‌లో అవుట్ సోర్సింగ్ కింద పని చేసిన రాజశేఖర్‌రెడ్డి మొదలుకుని ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్నవారంతా ఎన్‌ఆర్‌ఐలు కావడంపై సిట్ దృష్టి సారించినట్లు స్థానిక పోలీసు వర్గాల సమాచారం. జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపల్లికి చెందిన రాజశేఖర్‌రెడ్డిది సాధారణ కుటుంబం. అతని అత్తింటివారిదీ అదే పరిస్థితి. అయితే రాజశేఖర్‌రెడ్డి ఎదగడానికి రాజకీయ పరిచయాలే కారణమని, విదేశాల్లో ఉండి రావడంతో హైదరాబాద్ ఎన్‌ఆర్‌ఐ సర్కిల్స్‌తో మంచి సంబంధాలు ఉన్నాయని చెబుతున్నారు. విదేశాల నుంచి వచ్చిన ఓ నాయకుడి పైరవీతో రాజశేఖర్‌రెడ్డికి టీఎస్‌పీఎస్సీలో కొలువు దక్కిందని స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

గ్రూప్–1లో 'విదేశీ' కోణం పరిశీలించాలి..

రాజశేఖర్‌రెడ్డి ఎన్‌ఆర్‌ఐ మిత్రుల్లో ఇద్దరికి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయనే ప్రచారం జరుగుతోంది. 2018లో విదేశాల నుంచి వచ్చిన ఆ ఇద్దరికీ పేపర్ లీక్‌ల ద్వారా రాజశేఖర్‌రెడ్డే కొలువులు దక్కేలా చేశాడని సిట్ వర్గాలు అనుమానిస్తున్నాయి. అదే సమయంలో రాజశేఖర్‌రెడ్డి మరో ఇద్దరు సన్నిహితులు గతేడాది అక్టోబర్ 16న గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష కోసం విదేశాల నుంచి హైదరాబాద్‌కు వచ్చారని స్థానికులు చెబుతున్నారు. రాజశేఖర్‌రెడ్డి బంధువులు మాత్రం వారు దసరా కోసం వచ్చారని అంటున్నారు. ఈ వ్యవహారం తేలాలంటే.. ఇలా ఎందరు విదేశాల నుంచి వచ్చి గ్రూప్–1 రాశారో సిట్ పరిశీలించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

ఆస్తులపై ఆరా..

కంప్యూటర్, డిజిటల్ పరిజ్ఞానం మీద పూర్తిస్థాయి పట్టు ఉన్న వ్యక్తి కావడంతో రాజశేఖర్‌రెడ్డి పకడ్బందీగా లీకేజీ కథ నడిపాడని సిట్ అధికారులు గుర్తించినట్లు సమాచారం. మరోవైపు రాజశేఖర్‌రెడ్డితోపాటు అతని సమీప బంధువుల ఆస్తులు, బ్యాంకు లావాదేవీలను పరిశీలిస్తున్న సిట్.. కరీంనగర్ జిల్లా బొమ్మకల్‌కు చెందిన ఇద్దరి వివరాలు సేకరించారని తెలిసింది.

లీకేజీలో నమ్మలేని నిజాలు

▶ మొదటి పేజీ తరువాయి

దీనిపై 4 కోట్ల మంది ప్రజలకు సమాధానం చెప్పాలి. గ్రూప్–1 పరీక్షల్లో అక్రమాలు, కేసీఆర్ కొడుకు నిర్వాకంపై అతిత్వరలో వాస్తవాలు బయటపెడతాం. అసలైన దోషులను తెలంగాణ సమాజం ముందుంచుతాం'అని సంజయ్ పేర్కొన్నారు.

జెడ్పీటీసీ, సర్పంచ్, సింగిల్‌విండో చైర్మన్ పిల్లలు క్వాలిఫై...

'జగిత్యాల జిల్లాలోని ఓ మండలంలో 50 మందికిపైగా క్వాలిఫై అయ్యారు. ఒక చిన్న గ్రామంలో ఆరుగురు అర్హత సాధించారు. వారంతా బీఆర్‌ఎస్ నేతల కొడుకులు, బంధువులు, వాళ్ల వద్ద పనిచేసే వాళ్లే. నలుగురు సర్పంచుల కొడుకులు, సింగిల్ విండో చైర్మన్ కొడుకుతోపాటు ఒక జెడ్పీటీసీ వద్ద బాడీగార్డ్‌గా పనిచేసే వ్యక్తి కొడుకు, ఓ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి కుమారుడు క్వాలిఫై అయ్యాడు. ఒక సర్పంచ్ కొడుక్కిఅర్హత అయ్యే అవకాశమే లేనప్పటికీ క్వాలిఫై చేశారు' అని బండి సంజయ్ ఆరోపించారు.

కేటీఆర్ సహకారంతోనే లీకేజీ...

'కేసీఆర్ కొడుకు మంత్రి కేటీఆర్ సహకారంతోనే పేపర్ లీకేజీ జరిగింది. ఆయన సన్నిహిత వ్యక్తే ఇదంతా చేశాడు. ఒక్కొక్కరి నుంచి రూ. 3 నుంచి రూ. 5 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం ఉంది. తక్షణమే కేసీఆర్ కొడుకును కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి'అని సంజయ్ డిమాండ్ చేశారు. సీఎం కొడుకు ప్రమేయం ఉన్న నేపథ్యంలో కేసీఆర్ నియమించిన సిట్‌తో విచారణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తేనే వాస్తవాలన్నీ వెలుగులోకి వస్తాయని పునరుద్ఘాటించారు. నయీం డైరీ, సినీ తారల డ్రగ్స్ కేసుల తరహాలోనే పేపర్ లీకేజీ కేసును సైతం సిట్‌కు అప్పగించి పక్కదారి పట్టించే కుట్ర జరుగుతోందని సంజయ్ ఆరోపించారు.

వీఆర్‌ఏలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చండి

వీఆర్‌ఏ హక్కుల సాధన సమితి డిమాండ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ)కు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ వీఆర్‌ఏ హక్కుల సాధన సమితి డిమాండ్ చేసింది. వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు, అర్హులకు పదోన్నతులు, 55 ఏళ్లు నిండిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాల వంటి హామీలకు కార్యరూపం ఇవ్వాలని సమితి నేతలు ప్రభుత్వాన్ని కోరారు. నిర్మల్ జిల్లాకు చెందిన వీఆర్‌ఏ సిద్ధ శ్రీనివాస్ మృతి దారుణమని, జాబ్ చార్టులో లేని పని చేసేందుకు వెళ్లి మృత్యువాత పడిన శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలోని కొందరు కలెక్టర్లు, తహసీల్దార్లు వీఆర్‌ఏల జీవితాలతో ఆటలాడుతున్నారని, జాబ్‌చార్టులో లేని పనులను కూడా అప్పగిస్తున్నారని ఆరోపించారు.

నేటి నుంచి నిందితుల ఉమ్మడి విచారణ

▶ మొదటి పేజీ తరువాయి

అందిన తర్వాత కేసులో మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు.

గ్రూప్–1 డిస్ క్వాలిఫై వెనుక కుట్ర!

కమిషన్ కార్యదర్శి వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పని చేసిన ప్రవీణ్ కుమార్ గ్రూప్–1 పరీక్షలో డిస్ క్వాలిఫై కావడం వెనుకా కుట్ర ఉందని సిట్ అనుమానిస్తోంది. ప్రవీణ్ ఆ పేపర్ కూడా చేజిక్కించుకున్నాడని, దాని ఆధారంగా పరీక్ష రాసి 150కి 103 మార్కులు సాధించాడని భావిస్తోంది. ఈ లీకేజ్ విషయం వెలుగులోకి రాకుండా ఉండటానికే ఓఎంఆర్ షీట్‌ను తప్పుగా నింపి డిస్ క్వాలిఫై అయ్యాడా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తోంది. అలా చేస్తే ఎవరి దృష్టిలోనూ పడమని, తనకు ఎలాగూ ఎక్కువ మార్కుల రావడంతో ఆ తర్వాత అదును చూసుకుని మెయిన్స్ పరీక్షలోగా న్యాయస్థానాన్ని ఆశ్రయించడం ద్వారా ఆ పరీక్ష రాయడానికి అనుమతి పొందాలనే పథకం వేశాడని ప్రాథమికంగా భావిస్తున్నారు. మెయిన్స్ పేపర్‌ను సైతం చేజిక్కించుకొనేందుకు ప్రవీణ్ పథకం వేశాడని అనుమానిస్తున్నారు. తనతో సన్నిహితంగా ఉన్న రేణుకతో ప్రవీణ్ ఈ వ్యవహారం చెప్పి ఉంటాడని, ఈ నేపథ్యంలోనే ఆమె మిగిలిన ప్రశ్నపత్రాల లీక్ ఆలోచన చేసి ఉంటుందని ఓ అధికారి అనుమానం వ్యక్తం చేశారు. సోమవారం నుంచి జరిగే విచారణలో దీనిపై దృష్టి పెడతామన్నారు.

మంచి మార్కులు వచ్చిన వారిపై నజర్

గతేడాది అక్టోబర్‌లో జరిగిన గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో మంచి మార్కులు సాధించిన వారినీ సిట్ అనుమానితులుగా చేర్చింది. ప్రాథమికంగా 100 కంటే ఎక్కువ మార్కులు సాధించిన 28 మందితో జాబితా రూపొందించారు. వారి ఫోన్‌కాల్స్, వాట్సాప్ వివరాల్లో.. నిందితులతో లింకుల కోసం సాంకేతికంగా ఆరా తీస్తున్నారు. గ్రూప్–1 పేపర్ ప్రవీణ్ లేదా మరెవరి ద్వారా అయినా వారికి అందిందా? అనే అంశంపై దృష్టి పెట్టారు. ఇప్పటికే వారిలో కొందరిని సిట్‌కు పిలిచి విచారించారు. కొందరు యూపీఎస్సీతోపాటు ఇతర పరీక్షలు రాసి మంచి మార్కులు పొందినట్లు గుర్తించారు. ఇద్దరి వ్యవహారశైలిపై అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారిని మరిన్ని కోణాల్లో ప్రశ్నిస్తామని ఓ అధికారి తెలిపారు. ఆదివారం అదనపు సీపీ ఏఆర్ శ్రీనివాస్‌తో కలిసి సిట్ కార్యాలయానికి వెళ్లిన సైబర్ క్రైమ్ ఏసీపీ కేవీఎం ప్రసాద్ వివిధ సాంకేతిక అంశాలను పరిశీలించారు.

గుడ్ మార్నింగ్..

ఇదొక్క అందమైన మార్నింగ్!

ఈ శుభోదయపు పలకరింపుతోనే సరిగ్గా పదిహేనేళ్ల క్రితం.. రంగుల హరివిల్లులా.. 'సాక్షి' దిన పత్రిక ఆవిర్భవించింది. 'సత్యమేవ జయతే..' అంటూ నిఖార్సైన జర్నలిజానికి శంఖం పూరించింది. నాటి నుంచీ అంచెలంచెలుగా ఎదుగుతూ విలువలకు కట్టుబడిన పాత్రికేయ ధర్మాన్ని నిబద్ధతతో కొనసాగిస్తూ వస్తోంది. ఈ మహాయజ్ఞం ఇప్పుడు పదహారవ యేటలోకి ప్రవేశిస్తున్న సందర్భంలో 'సాక్షి' తన పాఠకులకు చిన్న క్విజ్ పెట్టి, కానుకలను ఇవ్వదలచింది. వివరాల కోసం ఇప్పుడే sakshi.com ఓపెన్ చేయండి, జవాబు చెప్పండి.. బహుమతి గెలుచుకోండి అన్న లింకును క్లిక్ చేయండి.

ఈరోజు ప్రశ్న	సాక్షి ఆదివారం అనుబంధం పుస్తకం పేరు?	ఎ) ఫ్యామిలీ డే	బి) ఫన్‌డే
		సి) సన్‌డే	డి) వీకెండ్ డే

మంత్రి పీఏనే లీకేజీ సూత్రధారి

- కేటీఆర్ పేషీ నుంచే వ్యవహారం..
- పెద్ద తలల పేర్లు బయటకు రాకుండా జైలులో ప్రవీణ్, రాజశేఖర్‌లకు బెదిరింపులు
- నిరుద్యోగ నిరసనలో రేవంత్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి: టీఎస్‌పీఎస్సీ ద్వారా ఉద్యోగ నియామకాల కోసం నిర్వహించిన పరీక్షల పత్రాల లీకేజీ వ్యవహారం మొత్తం మంత్రి కేటీఆర్ పేషీ నుంచే జరిగిందని, మంత్రి పీఏ తిరుపతే దీనికి ప్రధాన సూత్రధారి అని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో నిరుద్యోగ నిరసన దీక్ష చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన దీక్ష సాయంత్రం 6 గంటలకు ముగిసింది. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ లీకేజీ కేసులో అరెస్టు చేసిన వారిని కస్టడీలోకి తీసుకుని విచారించకుండానే ఇద్దరి వల్లే పేపర్ లీక్ అయ్యిందంటూ మంత్రి కేటీఆర్ ఎలా నిర్ధారిస్తారని ప్రశ్నించారు. కేటీఆర్ పీఏ తిరుపతి షాడో మంత్రి అని, ఆయన ద్వారానే అన్నీ జరుగుతున్నాయని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి కీలక బాధ్యతలు అప్పగించడంలోనే అసలు రహస్యం దాగి ఉందన్నారు. చంచల్‌గూడ జైలులో ఉన్న ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డిలు నోరు విప్పితే పెద్ద తలకాయల పేర్లు బయటకు వస్తాయన్న ఉద్దేశంతో వాళ్లను ఎన్‌కౌంటర్ చేస్తామని జైలులో బెదిరించారని రేవంత్ ఆరోపించారు. ఈనెల 13 నుంచి 18 వరకు చంచల్‌గూడ జైలు సందర్శకుల వివరాలు, సీసీ ఫుటేజీని బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

ఎన్‌వోసీ ఎలా ఇచ్చారు..

టీఎస్‌పీఎస్సీలో ఉద్యోగం చేస్తున్న వారు పోటీ పరీక్షలు రాయడానికి అనర్హులని నిబంధనలు చెబుతున్నాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కానీ ప్రభుత్వం అందులో పనిచేస్తున్న 20 మందికి పరీక్షలు రాయడానికి ఎన్‌వోసీ ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. అమెరికానుంచి వచ్చిన మాధురికి గ్రూప్–1 మొదటి ర్యాంకు, జూనియర్ అసిస్టెంట్ రజనీకాంత్‌రెడ్డికి నాలుగో ర్యాంకు ఎలా వచ్చాయన్నారు. శ్రీలక్ష్మి, ప్రవీణ్, వెంకటాద్రి, శ్రీదేవి, రమేశ్, వాసు, మధులతలతో పాటు మరికొందరికి పరీక్షలకు అనుమతి ఇచ్చారా? లేదా? అనేది ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2016లో ఒకే సెంటర్‌లో పరీక్ష రాసిన 25 మందికి గ్రూప్–1 ఉద్యోగాలు వచ్చాయని, దీనిపైనా విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏ2 రాజశేఖర్‌రెడ్డికి ఉద్యోగం ఇప్పించింది మంత్రి పీఏనే..

లీకేజీ వ్యవహారంలో ఏ2గా ఉన్న రాజశేఖర్‌రెడ్డికి మంత్రి కేటీఆర్ పీఏ తిరుపతి దగ్గరి స్నేహితుడని, ఇద్దరిదీ ఒకే ప్రాంతమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ పరిచయంతోనే రాజశేఖర్‌రెడ్డికి 2017లో ఉద్యోగం ఇప్పించాడని, వెనువెంటనే ప్రమోషన్ వచ్చిందని, తర్వాత టీఎస్‌పీఎస్సీలోకి బదిలీ అయ్యాడని ఆయన వెల్లడించారు. వీటన్నింటికీ కేటీఆర్ పీఏ తిరుపతే కారణమని ఆరోపించారు. అలాగే లీకేజీ వ్యవహారంలో కాన్ఫిడెన్షియల్ సెక్షన్ ఆఫీసర్ శంకర్‌లక్ష్మి పాత్రపై విచారణ జరపాలన్నారు. తాజా గ్రూప్ వన్ ప్రిలిమ్స్‌లో మల్యాల ప్రాంతానికి చెందిన వంద మందికిపైగా అభ్యర్థులకు 103 కన్నా ఎక్కువ మార్కులు వచ్చాయని, వారి వివరాలను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి అనితా రామచంద్రన్‌లకు అన్ని వివరాలు తెలిసి ఉంటాయన్నారు.

సిట్ అధికారి కేటీఆర్ బావమరిదికి దోస్త్..

పేపర్ లీకేజీ కేసు బాధ్యతలు అప్పగించిన సిట్ అధికారి ఏఆర్ శ్రీనివాస్.. మంత్రి కేటీఆర్ బావమరిదికి దగ్గరి స్నేహితుడని, ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించడంలో ఉద్దేశం ఏమిటో అర్థమవుతోందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కేసును సీబీఐకి అప్పగించాలని, లేదంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగుల తరఫున పోరాటం చేస్తుందని భరోసా ఇచ్చారు. లీకేజీ వ్యవహారంపై తాము కోర్టులో వేసిన కేసుపై సోమవారం విచారణ జరగనుందని తెలిపారు. 21న గవర్నర్‌ను కూడా కలుస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు షబ్బీర్ అలీ, మహేశ్‌కుమార్ గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, సీతక్క, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్, ఎస్ఐ ప్రశ్నపత్రాలపై అనుమానాలు

పరీక్ష రద్దుకు అభ్యర్థుల డిమాండ్



పంజగుట్ట (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్పీఆర్బీ) నిర్వహించిన కానిస్టేబుల్, ఎస్ఐ ప్రాథమిక రాత పరీక్ష పత్రాలు సైతం లీకైనట్టు అనుమానాలుండటంతో సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో విచారణ చేపట్టాలని కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు పోటీపడి అనర్హులుగా మిగిలిన అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అభ్యర్థులు రాము, గిరి, రామ్‌ప్రసాద్, విజయ, శ్రావణి విలేకరులతో మాట్లాడుతూ.. ప్రశ్నపత్రంలో వచ్చిన తప్పుడు ప్రశ్నలపై, షాట్‌పుట్, లాంగ్‌జంప్‌లో ఎంపికైనా డిస్‌క్వాలిఫై చేయడంపై ఇప్పటికే అభ్యర్థులందరం కోర్టును ఆశ్రయించామని తెలిపారు. కేసు కోర్టులో ఉండగానే పరీక్షలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఫిజికల్ టెస్టులు మొత్తం సీసీ కెమెరాల మధ్య జరిగిందని చెబుతున్న అధికారులు.. తాము షాట్‌పుట్, లాంగ్‌జంప్ ఎంపికయ్యామని.. సీసీ ఫుటేజీలు చూపించమని కోరితే నిరాకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రిలిమ్స్ మార్కులు ఎవరికెన్ని వచ్చాయో ఆన్‌లైన్‌లో పొందుపరిచారని, తెలంగాణలో ఎవరికీ తెలియజేయలేదని పేర్కొన్నారు. కానీ అత్యధికంగా కానిస్టేబుల్ పోస్టుకు 141 మార్కులు, ఎస్ఐ పోస్టుకు 133 మార్కులు వచ్చాయని ప్రకటించారని.. ఇన్ని మార్కులు రావడం అసాధ్యమని స్పష్టం చేశారు. దీన్నిబట్టే ప్రశ్నపత్రం లీకైనట్టు అర్థమవుతోందన్నారు. ప్రభుత్వం 48 గంటల్లోపు చర్యలు తీసుకోకపోతే అభ్యర్థులు కుటుంబ సభ్యులతో కలిసి ఎవరిళ్లల్లో వారు ఆమరణ నిరాహారదీక్షకు దిగుతారని హెచ్చరించారు.

దేశంలోనే రాష్ట్ర ఉద్యోగులకు అత్యధిక వేతనం

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అత్యధిక జీతాలను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అందుకుంటున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించి వారి జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. సెర్ప్ ఉద్యోగులకు కొత్త పే–స్కేల్ అమలు ఉత్తర్వులు జారీ చేసినందుకు సెర్ప్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆదివారం ఆమెను హైదరాబాద్‌లో కలిసి రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ తాజా ఉత్తర్వుల తో 3,978 మంది సెర్ప్ ఉద్యోగులకు లబ్ధి చేకూరనుందన్నారు. ఏప్రిల్ 1నుంచి కొత్త పేస్కేల్ ప్రకా రం జీతాలు చెల్లిస్తారని తెలిపారు. కవితను కలిసిన వారిలో సెర్ప్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుంట గంగాధర్ రెడ్డి, ప్రతినిధులు ఉన్నారు.

స్కాంలకు పెట్టింది పేరు కాంగ్రెస్: గంగుల



సాక్షి, హైదరాబాద్: దేశంలో కుంభకోణాలకు పెట్టింది పేరు కాంగ్రెస్ పార్టీయేనని, అది కాంగ్రెస్ కాదని, స్కాంగ్రెస్ అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ దుయ్యబట్టారు. బీజేపీ, కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీకేజీలు, ఉద్యోగాల అమ్మకాలు కోకొల్లలుగా జరుగుతున్నాయని ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీఆర్ఎస్ ఎమ్మెల్సీలు భానుప్రసాద్, ఎల్.రమణలతో కలసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియ చేపట్టే పబ్లిక్ సర్వీస్ కమిషన్లు రాజ్యాంగబద్ధ సంస్థలని, అందులో ప్రభుత్వ ప్రమేయం ఉండదన్న సోయి కూడా ప్రతిపక్షాలకు లేదన్నారు. 2017లో యూపీఎస్సీ కేసులో జాయ్స్‌జాయ్ అనే మహిళను హైదరాబాద్‌లోనే అరెస్టు చేశారని, అప్పుడు ప్రధాని మోదీ ఎందుకు బాధ్యత తీసుకోలేదని ప్రశ్నించారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో ఒకరిపై ఒకరు పోటీగా పాదయాత్రలు చేస్తున్నారని, తన పాదయాత్రను హైలైట్ చేసుకునేందుకే టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అసంబద్ధ ఆరోపణలు చేస్తున్నారని గంగుల మండిపడ్డారు.

లీకేజీకి ప్రభుత్వానిదే నైతిక బాధ్యత: భట్టి



నిరసనదీక్షలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

సాక్షి, ఆదిలాబాద్/ఉట్నూర్: టీఎస్‌పీఎస్సీ బోర్డును ఏర్పాటు చేసిన వారే నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని సీఎల్పీ నేత మల్లుభట్టి విక్రమార్క అన్నారు. హాథ్‌సే హాథ్ జోడో అభియాన్‌లో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో భట్టి మొదలుపెట్టిన పాదయాత్ర నాలుగో రోజు ఆదివారం కొనసాగింది. మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు అధ్యక్షతన కొనసాగిన ఈ యాత్ర ఉట్నూర్ క్రాస్ రోడ్డు వద్దకు చేరుకున్న తర్వాత కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ పేపర్ లీకేజీ వ్యవహారంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండు తోడు దొంగలేనని ఆరోపించారు. ధరణితో బలహీన వర్గాల ప్రజలు లక్షల ఎకరాల భూమిని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ధరణిని ప్రక్షాళన చేస్తానని హామీ ఇచ్చారు. లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్ నుంచి కవిత వరకు అందరిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ పథకాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం కోత పెట్టిందని ధ్వజమెత్తారు. మిషన్ భగీరథ పథకానికి రూ.42వేల కోట్లు ఖర్చు పెట్టామని చెప్పినప్పటికీ ఇప్పటికి ప్రతి ఇంటికి నీరు రావడం లేదని తెలిపారు. భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగానే హాత్‌సే హాత్ జోడో పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు స్పష్టం చేశారు. పాదయాత్రలో ప్రజాయుద్ధ నౌక గద్దర్ తదితరులు పాల్గొన్నారు.

భట్టి నిరసన దీక్ష: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీకి నిరసనగా ఉట్నూర్ మండలం ఎందా సమీపంలో ఎన్ఎస్‌యూఐ నాయకులతో కలిసి సీఎల్పీ నేత భట్టి విక్రమార్క నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల భర్తీలో జాప్యం చేసేందుకే ప్రశ్నపత్రాలను లీక్ చేసిందని ఆరోపించారు.

లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్



ముషీరాబాద్ (హైదరాబాద్): 25 లక్షల మంది నిరుద్యోగ యువత భవిష్యత్‌కు విఘాతం కలుగుతున్నందున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజ్ వ్యవహారంపై రాష్ట్ర హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ నిరుద్యోగ సంఘాల చైర్మన్ నీల వెంకటేశ్ అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన గ్రూప్–1, గ్రూప్–2 తదితర పోటీ పరీక్షల్లో పేపర్ లీకేజీ అయి పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని ఆరోపించారు.

అంగట్లో సరుకుల్లా ప్రశ్నపత్రాలు: వైఎస్ షర్మిల



సిరిసిల్లటౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అంగట్లో సరుకుల్లా ఉద్యోగ నియామకాల ప్రశ్నపత్రాలను అమ్ముతున్నారని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. ఉద్యోగం రాలేదని మనస్తాపంతో చనిపోయిన సిరిసిల్లకు చెందిన చిటికెన నవీన్ కుటుంబ సభ్యులను ఆదివారం ఆమె పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీలో పేపర్ లీక్ అయితే తనకు బాధ్యత లేదని ఐటీ మంత్రి కేటీఆర్ కొట్టిపారేయడాన్ని తప్పుబట్టారు. రాష్ట్రంలో 1.91 లక్షల ఉద్యోగాల ఖాళీలున్నాయని బిస్వాల్ కమిటీ నివేదించిందని, అయితే సర్కారు మాత్రం 81 వేలు మాత్రమే అంటోందని షర్మిల విమర్శించారు. వారు చెప్పినట్లుగా ఉద్యోగాలు భర్తీ చేయకుండా 9 ఏళ్ల నుంచి కేవలం 26 వేల ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్లు ఇచ్చారని, అందులో కేవలం 8 వేల ఉద్యోగాలకు మాత్రమే పరీక్షలు నిర్వహించారని తెలిపారు. నవీన్ ఉద్యోగం రాలేదనే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సూసైడ్‌నోట్ రాశాడని, ఇలాంటి నిరుద్యోగుల చావులన్నీ ప్రభుత్వ హత్యలు కాదా? అని షర్మిల ప్రశ్నించారు.

హాజరుపై ఉత్కంఠ

▶ మొదటి పేజీ తరువాయి

సలహాలకు అనుగుణంగానే నడుచుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం.

ప్రతీసారి ఊహాగానాలతో..

ఈడీ నోటీసుల నేపథ్యంలో కవిత మూడో పర్యాయం ఢిల్లీకి చేరుకోగా.. ప్రతీసారి ఆమెను అరెస్టు చేయవచ్చనే ఊహాగానాలు, కేటీఆర్ సహా మంత్రులు, సన్నిహితులు వెంట రావడం వంటి పరిణామాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి.

బీఆర్ఎస్‌ను తెలంగాణ ప్రజలే టార్గెట్ చేశారు

- అందుకే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కల్వకుంట్ల ఫ్యామిలీకి షాక్ ఇచ్చారు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- ఇన్నాళ్లూ కేసీఆర్ కుటుంబసభ్యులు అక్రమార్కులకు సహకరించారనే అనుకున్నాం
- కానీ వాళ్లే అక్రమ వ్యాపారం చేసినట్లు ఇప్పుడు మద్యం కుంభకోణంతో బయటపడింది



సాక్షి, హైదరాబాద్: అవినీతి, అక్రమాలతో కూరుకుపోయిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తెలంగాణ సమాజమే టార్గెట్ చేసిందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజల నాడి స్పష్టమైందన్నారు. బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డిని గెలిపించినందుకు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, బీజేపీతోనే ఆ మార్పు సాధ్యమవుతుందన్నారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రజలు ఇదే తరహా తీర్పు ఇస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం పీఎం మిత్ర మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్కును తెలంగాణకు కేటాయించడం జరిగిందన్నారు. ఈ పార్కు ద్వారా లక్ష మందికి నేరుగా ఉద్యోగాలు, 2 లక్షల మందికి పరోక్షంగా ఉద్యోగాలు రానున్నాయని వివరించారు. దారం తయారీ ప్రక్రియ నుంచి వస్త్రాలు కూడా ఇక్కడే సిద్ధమవుతాయని, విదేశాలకు ఎగుమతులు కూడా చేపట్టేలా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ పార్కు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా సహకారం అందించాలని ఆయన కోరారు.

రైల్వే స్టేషన్ పునః ప్రారంభానికి మోదీని ఆహ్వానించాం

రూ.720 కోట్లతో చేపట్టిన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనుల ప్రారంభానికి ప్రధాని మోదీని ఆహ్వానించినట్లు కిషన్‌రెడ్డి వివరించారు. వచ్చే నెలలో ఈ కార్యక్రమానికి మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందన్నారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి మరో వందేభారత్ రైలు మంజూరు చేశారని, దీన్ని కూడా పీఎం మోదీ ప్రారంభిస్తారని చెప్పారు. రాష్ట్రంలో అధికారం బీఆర్ఎస్ చేతిలో ఉండగా టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం బీజేపీ కుట్ర అనడం హాస్యాస్పదమన్నారు.

బీఆర్ఎస్ స్టీరింగ్ ఎంఐఎం చేతిలో

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌పై అవకతవకలపై వచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదుపై సీబీఐ కేసు ఫైలు చేసి దర్యాప్తు చేస్తుంటే, తీగలాగితే డొంక కదిలినట్లు కవిత చేసిన అక్రమాలు వెలుగు చూస్తున్నాయని కిషన్‌రెడ్డి ఆరోపించారు. కల్వకుంట్ల కుటుంబం ఇన్నాళ్లూ అక్రమార్కులకు సహకరించినట్లుగానే భావించామని, కానీ వాళ్లే అక్రమ వ్యాపారం చేసినట్లు మద్యం కుంభకోణం స్పష్టం చేస్తోందన్నారు. బీఆర్ఎస్ పార్టీ స్టీరింగ్ ఎంఐఎం చేతిలో ఉందని, మద్యం కుంభకోణం, టీఎస్‌పీఎస్సీ అవకతవకలపై ఆ పార్టీ అందుకే స్పందించడం లేదన్నారు.

ఓబీసీల జనగణనపై అఖిలపక్షం నిర్వహించండి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం వినతి

సాక్షి, హైదరాబాద్: దేశ వ్యాప్తంగా ఓబీసీల జనగణనను వెంటనే చేపట్టాలని, ఇందుకోసం జాతీయ స్థాయిలో అన్ని పార్టీలతో కలిసి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కోరింది. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలోని బృందం ఆదివారం హైదరాబాద్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి ఈ వినతిపత్రంలో పలు డిమాండ్లు ఉంచింది. కిషన్‌రెడ్డిని కలిసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, మహిళా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మణిమంజం తదితరులు పాల్గొన్నారు.

‘ఆర్టీసీ బస్సుల్లో వృద్ధులకు రాయితీ కల్పించాలి’

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్సుల్లో వృద్ధులకు టికెట్ ధరల్లో 50 శాతం రాయితీ కల్పించాలని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు సూచించారు. దీని వల్ల వారికి ఆర్థికంగా బాసట ఉంటుందన్నారు. అంతేకాకుండా క్రమంగా వారు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి మొగ్గు చూపి ఆక్యుపెన్సీ రేషియో పెంచటం ద్వారా ఆర్టీసీకి కూడా లాభం చేకూరుస్తారని నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, కొన్ని చోట్ల సగం రాయితీ వసతి కల్పిస్తున్నారని, తాజాగా మహారాష్ట్రలో వృద్ధులకు 74 ఏళ్ల వరకు సగం రాయితీ, ఆ పైబడ్డ వయసు వారికి పూర్తి రాయితీ వసతి అందుబాటులోకి తెచ్చినందున తెలంగాణ ఆర్టీసీలో కూడా రాయితీని అమల్లోకి తెస్తే బాగుంటుందని నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు.

రాహుల్ గాంధీపై కేంద్రం కక్ష గట్టింది: నిరంజన్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై కేంద్రం కక్ష గట్టిందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ వ్యాఖ్యానించారు. అదానీ కుంభకోణంపై పోరాటం చేస్తున్న రాహుల్‌పై కక్షపూరితంగా వ్యవహరిస్తున్న బీజేపీని దేశ ప్రజలు క్షమించబోరని ఆదివారం విలేకరులతో సమావేశంలో అన్నారు. ‘భారత్ జోడో యాత్రలో భాగంగా రాహుల్‌గాంధీ శ్రీనగర్‌కు వెళ్లినప్పుడు అక్కడ కొందరు మహిళలు ఆయన్ను కలిసి తమ బాధ చెప్పుకున్నారు. తాము బలాత్కారానికి గురవుతున్నామని వాపోయారు. అదే విషయాన్ని ఈ ఏడాది జనవరి 30న రాహుల్‌గాంధీ కశ్మీర్‌లో ప్రపంచానికి చెప్తే 50 రోజుల తర్వాత ఆదివారం ఉదయం ఢిల్లీ పోలీసులు రాహుల్‌గాంధీ ఇంటికి వెళ్లడం ఆక్షేపణీయం. మహిళల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించేలా వారి వివరాలు చెప్పాలని ఢిల్లీ పోలీసులు రాహుల్‌గాంధీని ప్రశ్నించడమేంటి?’అని నిరంజన్ నిలదీశారు.



కొంతైనా పిచ్చితనం లేని ఏ గొప్ప మెదడూ ఇప్పటి దాకా భూమ్మీద లేదు.
– అరిస్టాటిల్

సాక్షి
సోమవారం, మార్చి, 20

శుభాది కావాల్సిన ఉగాది

వసంతమాసంలో వచ్చే ఉగాది మన తెలుగువాళ్ల కొత్త సంవత్సరం. ఆకులే కాదు, ఆశలూ చిగురించే కాలంలో వచ్చే పండుగ ఇది. వసంతానికీ కవిత్వానికీ అనాదిగా అవినాభావ బంధం ఉంది. ఉగాది అంటే ఆరు రుచుల ఉగాది పచ్చడిని ఆరగించడం; పంచాంగ శ్రవణం మాత్రమే కాదు, ఊరూరా కవిసమ్మేళనాల కోలాహలం కూడా! తెలుగు నేల మీదనే కాదు, తెలుగువాళ్లు ఎక్కడ ఉంటే అక్కడ ఉగాది పండుగ రోజున కవిసమ్మేళనాలు తప్పనిసరిగా జరుగుతాయి.

ప్రాచీన కావ్యాలలో రుతువర్ణన తప్పనిసరి అంశం. కవులు ఆరు రుతువులనూ వర్ణించినా, వాటిలో వసంత వర్ణనకే అమిత ప్రాధాన్యమిచ్చారు. 'ఋతూనాం కుసుమాకరః'– అంటే, 'రుతువులలో వసంతాన్ని నేనే' అని సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్ముడే భగవద్గీతలో చెప్పుకొన్నాడు మరి! అలాంటప్పుడు భాగవతోత్తములైన ప్రాచీన కవివరేణ్యులు వసంత వర్ణనకు రవంత అమిత ప్రాధాన్యమివ్వడంలో వింతేముంటుంది?

'కమ్మని లతాంతముల కుమ్మొనసి వచ్చు మధుపమ్ముల సుగీత నినదమ్ము లెసగం మా/తమ్ముల లసత్కిసలయమ్ముల సుగంధి ముకుళమ్ములను నానుచును ముదమ్మొనర వాచా/లమ్ములగు కోకిల కులమ్ముల రవమ్ము మధురమ్మగుచు విన్పెననిశమ్ము సుమనోభా/రమ్ముల నశోక నికరమ్ములను చంపక చయమ్ములును కింశుక వనమ్ములున్ నొప్పెన్' అంటూ 'ఆంధ్ర మహాభారతము' ఆదిపర్వంలో నన్నయ పుష్పవిలసిత వసంత శోభను వర్ణించాడు. 'కీర ముహ సచ్ఛేహిం/ రేహఇ వసుహా పలాస కుసుమేహిం/ బుద్ధస్స చలణ వందణ/ పడి విహిం వ భిక్షు సంఘేహిం' – అంటే, 'భూమి మీద తిరుగాడే రామచిలుకల ముక్కుల్లాంటి మోదుగ పూలు బుద్ధుని పాదాలను తాకి ప్రణమిల్లే బౌద్ధభిక్షువుల సంఘమా?' అని హాలుడు తన 'గాథా సప్తశతి'లో అబ్బురపడ్డాడు.

రుతువర్ణనలో అష్టదిగ్గజాలను తలదన్నే కవిదిగ్గజం ఆంధ్రభోజుడు కృష్ణదేవరాయలు. ఆయన తన 'ఆముక్త మాల్యద'లో చేసిన వసంత వర్ణనలో మీన మేషాలను లెక్కించాడు. 'కినిసి వలతేడు దండెత్త గేతు వగుట/ మీన మిల దోచుటుచితంబ మేష మేమి/పని యనగ నేల? విరహాఖ్య పాంథ యువతి/ దాహమున కగ్గి రాగ దత్తడియు రాదె?' అని చమత్కరించాడు. ఇందులోని చమత్కారమేమిటంటే, కోపంతో మన్మథుడు దండెత్తగా చేప కనిపించడం సమంజసమే! ఎందుకంటే, మన్మథుడు మీనకేతనుడు. అలాంటప్పుడు అక్కడ మేకకు పనేమిటంటారా? విరహతాపంతో యువతులు దహించుకు పోతున్నప్పుడు అగ్ని వాహనమైన మేషం అక్కడ ఉండటమూ సమంజసమే కదా! సౌరమానంలో మీన, మేష మాసాలు వసంత రుతువు. వసంతాగమనాన్ని ఇంత నర్మగర్భంగా వర్ణించడం రాయలవారికే చెల్లింది!

'క్షితిపయి వట్టి మ్రాకులు జిగిర్ప వసంతుడు దా రసోపగుం/భిత పద వాసనల్ నెఱప, మెచ్చక చంద్రుడు మిన్నునం బ్రస/న్నతయును సౌకుమార్యము గనంబడ జాల్ గరగంగజేసె; ఏ గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే కదా' అని చేమకూర వేంకటకవి వాపోయాడు. వసంతుడు వచ్చి, చెట్లను చిగురింపజేసి, వాటిని ఫలపుష్పభరితం చేసి, ప్రకృతిని పులకింపజేశాడట. అప్పుడు వసంతుడు చేసిన ఘనకార్యాన్ని పైనుంచి చూస్తున్న చంద్రుడు మెచ్చకపోగా, కినుక బూనాడు. వసంతుడిని మించి తన ఘనత చాటుకోవడానికి సుకుమారమైన వెన్నెల కురిపించి, రాళ్లను కరిగించేశాడట. అలాగే, ఎంత బాగా రాసినా సమకాలికులు మెచ్చరట! చేమకూర కవికే కాదు, ఈ బాధ ఇప్పటి కవులనూ పీడిస్తూనే ఉంది.

'నాకుగాదులు లేవు, నాకుషస్సులు లేవు' అని కృష్ణశాస్త్రి వగచినంత మాత్రాన తెలుగు కవులకు ఉగాదులు లేకుండా పోలేదు. ఉగాది కవి సమ్మేళనాలు నేటికీ అట్టహాసంగా కొనసాగుతూనే ఉన్నాయి. అలాగని ఉగాది కవి సమ్మేళనాలు ప్రాచీనకాలం నుంచి కొనసాగుతున్నాయనడానికి ఆధారాలేవీ లేవు. మహా అయితే ఒకటి రెండు శతాబ్దాలుగా మొదలై ఉంటాయేమో! ప్రాచీన సాహిత్యంలో వసంత వర్ణన తప్ప ఉగాది వర్ణన ఎక్కడా కనిపించదు. ఒకప్పుడు కొన్ని పత్రికలు ఉగాది ప్రత్యేక సంచికలు విడుదల చేసేవి. ఆ కాలమంతా గత వసంత వైభవం.

కాల చక్రభ్రమణంలో రుతువులు వస్తుంటాయి, పోతుంటాయి. ఉగాదుల రాకతో లోకమంతా పచ్చగా మారిపోతుందనుకుంటే, అది భ్రమ మాత్రమే! 'నీతి పథమునందు, నిత్య జీవితమందు/ మాటనిరుకునందు మార్పులేక/ కొత్తబట్ట గట్టు కొన్నంత నూత్నవ/ర్షంబు మహము సార్థకంబుగాదు' అని జాషువా ఏనాడో నిష్ఠుర సత్యాన్ని పలికారు. 'ఉగాది పాటకు ఒకటే పల్లవి/ బాధ బాధ బాధ అది/ జగాన మెసలే జనాల జీవిత/ గాథ గాథ గాథ' అని నిర్మొహమాటంగా తేల్చేశాడు శ్రీశ్రీ. అంతేనా? 'ఉగాది వచ్చింది/ అయినా/ శుభాది వచ్చిందీ?' అని నిలదీశాడు కూడా!

ఏటా ఉగాది వస్తూనే ఉంటుంది. ఉగాది వేడుకలూ యథాప్రకారం జరుగుతూనే ఉంటాయి. సామాన్యుల జీవితాల్లో పెనుమార్పులేవీ రాకపోయినా; రాజకీయ పంచాంగ శ్రవణాలొక వైపు, బహిరంగ వేదికల మీద అధికారిక, అనధికారిక కందువాల కవి సమ్మేళనాలింకొక వైపు కోలాహలంగా కొనసాగుతూనే ఉంటాయి. ఒకే వేదిక మీదకు చేరిన కవుల్లో కొందరు ఉగాదిని రారమ్మని ఆహ్వానిస్తుంటారు. ఇంకొందరు రావద్దని బతిమాలుకుంటారు. ఉగాది పచ్చడిలోని చేదును మరపిస్తూ, ఈ తప్పనిసరి తతంగాలు జనాలకు ఉచిత వినోదాన్ని ఉదారంగా పంచిపెడుతూనే ఉంటాయి. పండగపూట ఆ మాత్రం వినోదమైనా లేకపోతే, బతుకులు మరీ చేదెక్కిపోవూ!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు.
ఫాల్గుణ మాసం, **తిథి:** చతుర్దశి రా.1.37 వరకు, తదుపరి అమావాస్య,
నక్షత్రం: శతభిషం రా.7.24 వరకు, తదుపరి పూర్వాభాద్ర.
వర్జ్యం: రా.1.26 నుండి 2.56 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.32 నుండి 1.21 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.44 వరకు.
అమృతఘడియలు: ప.12.38 నుండి 2.07 వరకు.

సూర్యోదయం: 6.09
సూర్యాస్తమయం: 6.06
రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు

మన తీరు ఇలా ఉండాలా?

కామెంట్



కరణ్ థాపర్

ఆస్ట్రేలియన్ క్రికెటర్ ఉస్మాన్ ఖ్వాజా పట్ల మనం వ్యవహరించిన తీరు సంకుచితంగా ఉంది. అతడికి ద్వంద్వ జాతీయత ఉంది. అటు పాకిస్తానీయుడిగానూ, ఇటు ఆస్ట్రేలియన్ పౌరుడిగానూ ఉంటున్నాడు. అది మన ప్రభుత్వ కళ్లలో అతడిని అనుమానితుడిని చేసింది. అందుకే ఆస్ట్రేలియన్ క్రికెట్ జట్టుతో కలిసి భారత్ పర్యటనకు వీసా కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు, వెంటనే అనుమతి దక్కలేదు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, మానవ హక్కుల సూత్రబద్ధ సమర్థకురాలిగా ఉంటున్నందుకు భారత్ గర్వపడుతుంది. మనం ఈ స్వీయ–ప్రతిష్ఠను నిలుపుకొనేలా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. మన పట్ల పాకిస్తాన్ ప్రవర్తన కూడా అలాగే ఉందనే వాదన ఒకటుంది. మన సొంత ప్రమాణాలను నిర్దేశించుకోవడానికి మన పొరుగువాడి ప్రవర్తన ప్రమాణం అవుతుందా? పాకిస్తాన్ పౌరులనూ, వారి భయంకరులైన పాలకులనూ మనం వేరు చేసి చూడకూడదా? దక్షిణాసియా ప్రాంతంలో కీలక శక్తిగా తనను తాను పరిణించుకుంటున్న దేశం, ఐరాసలో అత్యున్నత సీటును కోరుకుంటున్న దేశం వ్యవహరించాల్సిన తీరు ఇదేనా?



మన దేశాన్ని సందర్శించాలని కోరుకునే పాకిస్తానీయుల పట్ల మనం ఎందుకు చీకాకుగా వ్యవహరిస్తాం? అయితే మన పట్ల వాళ్ల ప్రవర్తన కూడా అలాగే ఉందనే వాదన ఒకటుంది. కానీ నా అనుభవం అలా లేదని నేను చెప్పాల్సి ఉంటుంది. ఏమైనా ఇలాంటి వాదన సముచితమైనది కాదు. అది మనకు విలువనివ్వదు కూడా!

మొదటి విషయం: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగానూ, మానవ హక్కుల విషయంలో సూత్రబద్ధ సమర్థకురాలిగానూ ఉంటున్నందుకు భారత్ గర్వపడుతుంది. కానీ మనం దీన్ని గురించి చెప్పినట్లయితే పాకిస్తాన్ అసలు నమ్మదు. అయితే మనం కూడా మన స్వీయ–ప్రతిష్ఠను నిలుపుకొనేలా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. మరింత ముఖ్యమైన విషయం ఏమిటంటే, మన సొంత ప్రమాణాలను నిర్దేశించుకోవడానికి మన పొరుగువాడి ప్రవర్తన ప్రమాణం అవుతుందా? అలా కాదంటే– ఇస్లామాబాద్‌కు వ్యతిరేకంగా కాకుండా, దానికి భిన్నంగా వ్యవహరించడం ద్వారా మనం మరింత మెరుగైనవాళ్లమని దృఢ నిరూపణ చేయాల్సి ఉంటుంది.

అనుమానపు చూపు

అద్భుతమైన ఆస్ట్రేలియన్ బ్యాట్స్‌మన్ ఉస్మాన్ ఖ్వాజా పట్ల మనం వ్యవహరించిన తీరు నేను వర్ణించిన రోత ప్రవర్తనకు ప్రతిరూపమే. నిజానికి ఇది అంతకుమించిన ఘోరమైన విషయం. సంకుచితంగా, ద్వేషపూరితంగా, మనల్ని మనం తక్కువ చేసుకుంటున్నట్లుగా ఉంది. ఇలాంటి వైఖరి భారత్‌ను పేలవంగా చూపిస్తుంది. దీంట్లోని అత్యంత ఘోరమైన విషయం ఏమిటంటే, ఇదంతా మనకు మనం కలిగించుకున్న నష్టమే.

పాకిస్తాన్‌లో పుట్టిన ఖ్వాజా నాలుగేళ్ల వయసులో ఉండగా కుటుంబంతోపాటు ఆస్ట్రేలియాకు వలస వెళ్లాడు. ఈరోజు అతడికి ద్వంద్వ జాతీయత ఉంది. అతడు అటు పాకిస్తానీయుడిగానూ, ఇటు ఆస్ట్రేలియన్ పౌరుడిగానూ ఉంటున్నాడు. అది మన ప్రభుత్వ కళ్లలో అనుమానితుడిని చేసింది. ఆస్ట్రేలియన్ క్రికెట్ జట్టుతో కలిసి భారత్ పర్యటనకు వీసా కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు, అతడికి వెంటనే అనుమతి దక్కలేదు. అది ఎంత ఆలస్యమైందంటే, ఫిబ్రవరి 1న ఖ్వాజా లేకుండానే ఆస్ట్రేలియా టీమ్ ఇండియాకు వచ్చేసింది. ఆస్ట్రేలియన్ క్రికెట్ పాలనా యంత్రాంగం నిరసన తెలిపిన తర్వాతే ఖ్వాజా వీసాను పొందగలిగాడు.

ప్రభుత్వాల ప్రామాణిక ధోరణి

భారతదేశంలో మనలో ఏ కొద్దిమందికో ఈ విషయం గురించి తెలుసు. అందులో బహుశా చాలా కొద్దిమంది దీని గురించి కలవరపడుతుండవచ్చు. కానీ ఆస్ట్రేలియాలో ఇలా ఉండదు. బీజేపీ ఖ్వాజాను ఆస్ట్రేలియా అత్యుత్తమ క్రికెటర్లలో ఒకరిలా కాకుండా పాకిస్తాన్‌లో పుట్టిన ముస్లింలా చూస్తోందని 'సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్'లో రాసే దేశ అత్యుత్తమ క్రికెట్ వ్యాఖ్యాతల్లో ఒకరైన మాల్కమ్ కోన్ రాశారు. వాస్తవం ఇంతకంటే దారుణంగా ఉంది. భారతీయ వీసాను పొందడంలో సమస్యలు ఎదుర్కోవడం ఖ్వాజాకు ఇదే తొలిసారి కాదు. 'ది గార్డియన్' పత్రిక ప్రకారం– మన్మోహన్ సింగ్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కూడా 2011లోనే ఈ అనుభవం అతడికి ఎదురైంది. పాకిస్తానీయుల పట్ల ద్వేషపూరిత వైఖరిని ప్రదర్శించడం భారత ప్రభుత్వాలకు ఒక ప్రామాణికమైన ఆచరణగా మారిపోయిందని ఇది స్పష్టం చేస్తోంది.

ద్వంద్వ పౌరసత్వం ఉన్న పాకిస్తానీయుడు, భారతీయ వీసా కోసం దరఖాస్తు చేస్తున్నప్పుడు ఏం జరుగుతుందో ఇప్పుడు నన్ను వివరించనివ్వండి. ఆ వ్యక్తి లండన్, న్యూయార్క్ లేదా దుబాయ్ నివాసి అయినప్పటికీ, వారి పాకిస్తానీ పాస్‌పోర్ట్‌పైనే దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది తప్ప మరొక పాస్‌పోర్ట్ మీద కాదు. దరఖాస్తు సమర్పించగానే భారతీయ రాయబార కార్యాలయం దాన్ని ఢిల్లీకి పంపిస్తుంది. అక్కడ విదేశీ వ్యవహారాల శాఖ కాకుండా, హోమ్ మంత్రిత్వ శాఖ దాన్ని నిర్ణయిస్తుంది. దానికి కొన్ని నెలలు పడుతుంది. మూడు నెలల్లోగా నిర్ణయం వస్తుందని ఆశించవద్దని దరఖాస్తుదారులకు ఆటోమేటిక్‌గా చెబుతారు.

అఖండ భారత్ ఇలాగా?

తరచుగా నేను మెజారిటీ కేసులను తడిమి చూశాను. ఎక్కడా స్పందన లేదు. అలాంటి సందర్భాల్లో ఏ వార్తా రాకపోవడం మంచి వార్త కాదు. ఒకవేళ వచ్చిందంటే, ఎవరో మీ కోసం తీగ లాగగలగాలి. అదీ మీరు అదృష్టవంతులైతే! కానీ ఎంతమంది పాకిస్తానీయులకు అలాంటివి చేసి పెట్టేవారు దొరుకుతారు? తుది ఫలితం ఏమిటంటే – భారత్ సందర్శించడానికి చాలా తక్కువ మంది మాత్రమే అనుమతి పొందుతారు.

ఒకప్పుడు –అంటే చాలా కాలం క్రితం కాదు– మన తోటి దేశవాసులుగా ఉండిన వారితో మనం నిజంగా వ్యవహరించవలసిన తీరు ఇదేనా? మరీ ముఖ్యంగా, అఖండ భారత్‌పై మన ప్రకటనలకు (సమర్థన అటుండనీ) మద్దతు గెల్చుకోవడానికి మనం వెళుతున్న మార్గం ఇదేనా? దక్షిణాసియా ప్రాంతంలో కీలక శక్తిగా తనను తాను పరిగణించుకుంటున్న దేశం, ఐక్యరాజ్యసమితిలో అత్యున్నత సీటును కోరుకుంటున్న దేశం వ్యవహరించాల్సిన తీరు ఇదేనా? ఈ ప్రశ్నల్లో ఏ ఒక్కదానికైనా 'అవును' అనేది సమాధానం అయితే అది నేను నమ్మలేని విషయం అవుతుంది.

పాకిస్తాన్ ప్రభుత్వంతో మనకు దశాబ్దాలుగా సమస్యలు ఉన్నాయనడంలో సందేహమే లేదు. కానీ నిజం ఏమిటంటే పాకిస్తాన్ ప్రజల విషయంలో కూడా ఇది నిజమేనా? ఈ సందర్భంలో దేశ పౌరులనూ, వారి భయంకరులైన పాలకులనూ మనం వేరు చేసి చూడకూడదా? లేదా మనం అలాంటి సులభమైన సూక్ష్మ విషయాన్ని కూడా గ్రహించలేనంత అసమర్థులమా?

ఈ విషయంలో నిజం ఏదంటే, మనం వీసాలను నిరాకరించడం ద్వారా పాకిస్తానీయులు ఇబ్బందిపడి ఉండవచ్చు లేదా పడకపోయి ఉండవచ్చు. కానీ ఒక దేశంగా మనం (భారత ప్రభుత్వాలు మాత్రమే కాదు, భారత ప్రజలం కూడా) వికారంగా కనిపించడం లేదా? కాబట్టి మన కోసమైనా మనం ఇలాంటి ధోరణిని తప్పక ఆపివేయాలి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అలవాటు మారుతుందా?



వారం రోజులు అలహాబాద్ (ఉత్తర ప్రదేశ్) నగర జనాలతో ఉన్నాను. ఏ ఒక్కరూ దాన్ని ప్రయాగ్‌రాజ్ అని పిలవడం లేదు.
– రంజనా బెనర్జీ, కాలమిస్ట్

గాంధీ తర్వాత...



'ఇండియా ఆఫ్టర్ గాంధీ' నూతన ఎడిషన్ గురించి నేను రామచంద్ర గుహను ఇంటర్వ్యూ చేశాను. ఇండియాను బీజేపీ ఎలా హిందూ పాకిస్తాన్‌గా మార్చడానికి యత్నిస్తున్నదో ఆయన ఈ పుస్తకంలో వివరంగా చర్చించారు.
– నరేశ్ ఫెర్నాండెజ్, సంపాదకుడు

కొత్త సవాలు



అతడి పేరు పిప్స్ బన్స్, ఒక పెద్ద బ్రిటిష్ బ్యాంకుకు డైరెక్టర్. లైంగికత విషయంలో అతడిది ద్రవ స్థితి: అంటే కొన్నిసార్లు పురుషుడిగానూ, కొన్నిసార్లు మహిళగానూ ఐడెంటిఫై అవుతాడు. 2018లో 100 మంది మహిళా వ్యాపారవేత్తల్లో ఒకడిగా నిలిచాడు. మనం పురోగమిస్తున్న భవిష్యత్తులో పుట్టుకతో మహిళలు అయినవారు ఇలాంటివారితో పోటీ పడాల్సి ఉంటుంది.
– స్కిన్ డాక్టర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

సిత్రం సూడరో!



నీలిచిత్రాల వెబ్‌సైటు అయిన 'పోర్న్‌హబ్'ను ప్రైవేటు ఈక్విటీ సంస్థ అయిన 'ఎథికల్ క్యాపిటల్ పార్ట్‌నర్స్' చేజిక్కించుకుంది. ఒక నీలిచిత్రాల సైటును 'ఎథికల్' (నీతిసంబంధమైన) అని పేరున్న సంస్థ కొనడం... చూడండి తమాషా!
– అలీ టేలర్, స్ట్రేటజీ కన్సల్టెంట్

మన ఘనత



చరిత్రలో 'పై' విలువను మొదట లెక్కించిన గణిత శాస్త్రవేత్తలు: బోధాయనుడు (3.088), యాజ్ఞవల్క్యుడు (3.125). 'పై' విలువను గణించడానికి (3.1415926535898) కలన గణితాన్ని తొలిసారి ఉపయోగించినవాడు మాధవ. 'పై అనేది తార్కికం కానిది' అని ప్రకటించిన మొదటి శాస్త్రవేత్త నీలకంఠ.
– జోసెఫ్ టి. నూనీ, రచయిత

మొదటి ఇంజిన్



ఇండియాలో ఈ ఎనిమిదేళ్లలో వేసిన (3,48,000 కి.మీ.) గ్రామీణ రోడ్లు గత 70 ఏళ్లలో వేసిన (3,81,000 కి.మీ.) గ్రామీణ రోడ్ల పొడవుతో దాదాపు సమానం. అలాగే 70 ఏళ్లలో వేసిన జాతీయ హైవేల పొడవులో (97,000 కి.మీ.) సగం పొడవు ఈ ఎనిమిదేళ్లలో వేశారు (46,000 కి.మీ.). రెండోవారు ఎవరైనా కావొచ్చుగానీ, ఈ డబుల్ ఇంజిన్ సర్కార్‌లో మొదటి ఇంజిన్‌గా మాత్రం నితిన్ గడ్కరీ ఉంటారు.
– ఆనంద్ రంగనాథన్, రచయిత

అలా కాకూడదు!



వెయ్యేళ్ల క్రితం డమాస్కస్ (సిరియా), బాగ్దాద్(ఇరాక్) కొత్త ఆలోచనలకూ, పరిశోధనకూ, పారదర్శకతకూ కేంద్రాలుగా ఉండేవి. కానీ మత ఛాందసవాదపు గాలులు ఎప్పుడైతే వీయడం మొదలైందో, వర్తమానపు తరమడాలే గతకాలపు గొప్పతనానికి ప్రత్యామ్నాయంగా నిలిచాయో... ఇక నగరాల గొప్ప గుణాలన్నీ అంతానికి వచ్చాయి. అన్ని సమాజాలకూ ఇందులో నేర్చుకోవాల్సిన ఒక పాఠం ఉంది.
– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

ఇన్‌బాక్స్

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటాలా?

ఉద్యోగ నోటిఫికేషన్లు వచ్చాయన్న ఆనందం ఆవిరయ్యింది. బోర్డుల వైఫల్యాల వల్ల లక్షలాది నిరుద్యోగుల ఆశయాలు, ఆశలు ఏటిలో కొట్టుకుపోయాయి. ప్రశ్నపత్రాల లీకేజీ ఇందుకు కారణం. సంవత్సరాల కొద్దీ పడిగాపులూ, రేయింబవళ్ల అలుపెరుగని పోరాటాలూ... లీకేజి సునామీలో కొట్టుకుపోయాయి.

అయ్యా ప్రభుత్వ పెద్దలారా! మావి రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబాలు. ప్రభుత్వ ఉద్యోగం వస్తే మా భవిష్యత్ తరాలైనా బాగుపడతాయని చిన్న ఆశ. తెలంగాణ ఉద్యమం నీళ్ళు, నిధులు, నియామకాల కోసం జరిగి విజయం సాధించింది. నీళ్లు, నిధుల మాట అటుంచి... కనీసం నియామకాలనైనా నిజాయితీతో జరపండి. పండుగ పబ్బాలు మర్చిపోయి, ఇంటికి వెళ్లే దారులు మూసుకుపోయి, మది నిండా గాయాలతో, ఎద నిండా శోకాలతో అర్ధాకలితో చదువుకుంటున్నం. మీ నోటిఫికేషన్లు పద్మాయనీ, ఇదొక సముద్రమనీ తెలిసి కూడ ఈదుతున్నం. నడి సంద్రాన ముంచకండి. తెలంగాణ తెచ్చుకుందే ఉద్యోగాల కోసం. వాటినే మా నుండి దూరం చెయ్యకండి. ఆకలి, అవమానాల భారంతో జీవన పోరాటం చేస్తున్నవాళ్లం. ముప్పై లక్షల కుటుంబాల ఉసురు పోస్కోకండి. తప్పు జరిగిందని చేతులు దులుపుకోకండి. 'తప్పు జరగదు' అనే ధైర్యాన్ని ఇవ్వండి. ముద్ద గొంతు కూడా దిగుతలేదు. ప్రశాంతంగా మా నిరుద్యోగులు నిద్రపోయి చాలా రోజులైంది. అప్పులు తెచ్చి హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్నం. కొంచెం ఆత్మగౌరవంతో బతకనియ్యండి. లీకేజీకి కారణమై మా జీవితాలను నాశనం చేసిన, చేస్తున్న వారిని కఠినంగా శిక్షించండి. ఇక మీద ఎవ్వరికీ ఇలా చెయ్యాలనే ఆలోచన రాకుండా శిక్షించండి. మా నిరుద్యోగుల వెతలను తీర్చి గౌరవంగా బతికేందుకు మీ పని మీరు చిత్తశుద్ధితో చేయండి చాలు.

ఉద్యోగంతోనే ఇంటికి పోవాలని పూనుకున్న నిరుద్యోగులెందరో! దయచేసి ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా జరిగేలా చూడండి. నిరుద్యోగులందరూ ఏ అనుమానాలూ లేకుండా ఉద్యోగ పరీక్షలకు వెళ్లే భరోసా కల్పించండి!
– శ్రీకాంత్ చెర్వుగట్టు, నల్లగొండ

గర్భ సంస్కార్‌తో దేశభక్తులు!?

సందర్భం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

సంఘ్ అనుబంధ సంస్థ 'సమవర్ధిని న్యాస్' ఢిల్లీ జవహర్ లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయంలో 'గర్భ సంస్కార్' పేరుతో మార్చి 5న కార్యశాల (వర్క్ షాప్)ను నిర్వహించింది. 12 రాష్ట్రాల నుండి పలువురు స్త్రీ, శిశువైద్య నిపుణులూ; ఆయుర్వేద వైద్యులూ పాల్గొన్నారు. కడుపులోని పిండాలకు భారతీయ సాంస్కృతిక విలువలను నేర్పాలనీ, దీంతో దేశభక్తులైన స్త్రీలను గౌరవించే పిల్లలూ, శ్రీరాముని వంటి కొడుకులూ పుడతారనీ; సంస్కృతంలో ఉండే గీత, తదితర మత గ్రంథాలను చదివే గర్భశుద్ధి పద్ధతితో బిడ్డ డీఎన్ఏ మారుతుందనీ న్యాస్ నాయకులు చెప్పారు. పౌరాణిక హిందూ పాలకుల లక్షణాలు గల భావి నాయకులను తయారుచేయడం గర్భ సంస్కార్ లక్ష్యమని న్యాస్ జాతీయ నిర్వహణ కార్యదర్శి మాధురీ మరాతే అన్నారు.

గర్భ సంస్కార్ అన్న సంస్కృత పదాలకు గర్భసంచీని శుద్ధిచేయడం, పిండం మెదడును చైతన్యపరచడం అని అర్థం. ఇది వేదకాలం నాటి ఆధ్యాత్మిక ఆచరణ. గర్భ సంస్కార్‌లో గర్భవతులకు భగవద్గీత, రామాయణ శ్లోకాలను వినిపిస్తారు. యోగా నేర్పిస్తారు. అంటే సాంస్కృతిక విలువల పేరుతో మతాధిపత్య భావజాలాన్ని పుట్టబోయే పిల్లల మెదళ్ళలో చొప్పించి, వారిని హిందూవాదంతో చైతన్య పరిచే ప్రక్రియే సమవర్ధిని న్యాస్ ప్రతిపాదిస్తున్న గర్భ సంస్కార్ అన్నమాట.

ఆయుర్వేద వైద్యంలో 'సుప్రజ జనన్' పేరుతో గర్భ సంస్కార్ ప్రస్తావన ఉంది. సుప్రజ జనన్ సూత్రం ప్రకారం పిల్లలను కనాలనుకున్న దంపతులను 3 నెలల ముందే శుద్ధీకరిస్తారు. పిండశుద్ధి అంటే భర్త వీర్యాన్నీ, భార్య అండాన్నీ శుద్ధిచేస్తారు!? దంపతులు శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నా మానసిక స్థిరత్వం, ప్రశాంతత (సత్వగుణం) లేకపోతే ఆరోగ్యమైన పిల్లలను కనలేరని తీర్మానిస్తారు. సాత్వికాహారం, యోగా, ధ్యానం, మంత్రోచ్చాటన, రాగాలు, శ్లోకాలు, కథలు వినడం ఈ కార్యక్రమంలో ప్రధానం.



గర్భ సంస్కార్‌లో పౌరాణిక కథలను వినిపిస్తారు. కడుపుతో ఉన్న భార్య సుభద్రకు అర్జునుడు పద్మవ్యూహం గురించి చెప్పాడు. గర్భంలో ఉన్న అభిమన్యుడు పద్మవ్యూహంలోకి వెళ్లడం గురించి వినింది అక్కడే అంటారు కదా! హిరణ్యకశిపుని భార్య లీలావతి కడుపులో ఉన్న ప్రహ్లాదునికి నారదుడు విష్ణుకీర్తనలు వినిపించాడు. ప్రహ్లాదుడు విష్ణు భక్తుడయ్యాడు. కాబట్టి వీరూ ఇటువంటివాటిని గర్భస్థ పిండాలకూ, గర్భవతులకూ వినిపిస్తారట! గర్భ సంస్కార్ కార్యక్రమంలో భాగంగా గర్భం ధరించినప్పటి నుండి బిడ్డ పుట్టిన తర్వాత 2 ఏళ్ల వరకు తల్లీపిల్లలకు 'చైతన్య' శిక్షణ ఉంటుంది.

నిజానికి... 18 వారాల పిండం తల్లి గుండె చప్పుడు లాంటి శబ్దాలను మాత్రమే వినగలుగుతుంది. 6, 7 నెలల తర్వాత అమ్మ శరీరానికి బయట ఉన్న శబ్దాలు వినపడతాయి. 30 వారాల పిండానికి వినడానికి అవసరమైన ఇంద్రియ, మెదడు వ్యవస్థలు అభివృద్ధి చెందుతాయి. బిడ్డ పుట్టిన తర్వాత 3 నెలలకు దేహం వాసనను, సైగల భాషను గుర్తుపడుతుంది. 3 ఏళ్ళకు గానీ అతి ప్రాథమిక స్థాయి బోధనలు అర్థం కావు. అటువంటిది గర్భసంస్కార్‌లో చదివే సంస్కృత శ్లోకాలు తల్లీ, శిశువు లకు ఎలా అర్థమవుతాయి? ఐతే ఈ మతాచారాల లయబద్ధ శబ్దాలు తల్లీపిల్లలను సవ్వడి సమ్మతులుగా మారుస్తాయి. ఈ ప్రక్రియలో జరిగే హిందూవాద తంతులతో తల్లీ, రెండేళ్ల బిడ్డా మమేకమవుతారు. ఈ మిషతో సంఘ్... పిల్లల తొలి గురువూ, సమాజ నిర్మాతా అయిన తల్లికి కాషాయ కషాయం తాపుతుంది. జన్యుశాస్త్ర సాంకేతికతలతో మాత్రమే శాస్త్రవేత్తలు ఒక జీవి డీఎన్ఏను మార్చగలరు. అంతేకాని దానిని మాటలతో మార్చలేం.

గర్భ సంస్కార్ కొత్త వ్యాపారాలకు తెర లేపింది. ప్రయోగశాలలు, శిక్షణాలయాలు పుట్టుకొస్తున్నాయి. సాహిత్య సామగ్రి అమ్మకాలు విపరీతంగా పెరిగాయి.

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి । 94902 04545

దేహంతో సాధించు!

అనగనగా ఒక నిరుపేద. అతడు ఓ జెన్ సాధువు దగ్గరకు వెళ్ళాడు. 'గురువుగారూ! నేను కటిక పేదవాడిని. నా దగ్గర నా ప్రాణం తప్ప మరే ఆస్తీ లేదు. కనీస వసతులతోనైనా బతకడానికి ఒక దారి చెప్పండి' అని అడిగాడు.

అందుకు ఆ సాధువు 'నేను నీకు అయిదు వేల వరహాలు ఇస్తాను. నీ చేతులను నరికి నాకివ్వు' అన్నారు. అందుకు 'మీరిచ్చే అయిదు వేల వరహాల కోసం నా చేతులను కోల్పోలేను' అన్నాడు. ఇలాగే కాళ్లు, కళ్లు, ప్రాణాలకు విలువ కట్టి, వాటిని ఇస్తే డబ్బులిస్తానని అన్నారు సాధువు. అందుకు పేదవాడు 'మీరు ఎంతటి గురువుగారైనా కావచ్చు... డబ్బుకు నా అవయవాలు, ప్రాణాలు ఎలా ఇస్తాను?' అని ప్రశ్నించాడు.

జ్యోతిర్మయం

అంతట, ఆ జెన్ సాధువు "నీ దగ్గర నీ ప్రాణం తప్ప మరే ఆస్తీ లేదన్నావు. చేతులూ, కాళ్ళూ, కళ్ళూ ఇలా ఏవి అడిగినా ఇవ్వనంటున్నావు. డబ్బులిస్తానన్నా సరే నువ్వు ఇవ్వనని చెప్పావు. అంటే నువ్వు ఇవ్వకూడదని అనుకున్న ప్రతి అవయవమూ అమూల్యమైనదేగా! మరి అటువంటి అమూల్యాలను నీ దగ్గర ఉంచుకుని 'నేను పేదవాడిని, నా దగ్గర ఏమీ లేదు' అని ఎలా అంటున్నావు? నువ్వెలా పేదవాడివవుతావు? కనుక జీవితంలో వీలున్నంత మేరకు కష్టించు. అవకాశాల కోసం ఎదురు చూస్తూ కూర్చోకు. ఆలోచనలతో రోజులు గడిపెయ్యకు. నీ శక్తి యుక్తుల మీద నీకు విశ్వాసం ఉండాలి. అంతేతప్ప నేనేదీ చెయ్యలేనని అనుకుంటూ కాలం గడపకు. 'నీ కర్తవ్యం నువ్వు నిర్వహిస్తే ఫలితం అదే వస్తుంద'ని కదా గీతాకారుడు అన్నది. కాబట్టి నీ ప్రయత్నం నువ్వు చెయ్యి" అని సాధువు జ్ఞానబోధ చేశారు.


అప్పుడా పేదవాడు కళ్ళు తెరిచాడు. 'పుట్టుక ఎలాగైనా ఉండొచ్చు. కానీ ఎదగడం, ఎదగకపోవడం మన చేతిలో ఉన్నదే. కష్టాలను జయించడానికి అమూల్యమైన ఆణిముత్యమైన ఆత్మ విశ్వాసం ఒక్కటి చాలు. ఆ తర్వాత అంతా దేవుడే చూసుకుంటాడు' అనుకుంటూ ఇంటిదారి పట్టాడు.
– యామిజాల జగదీశ్

ట్రాక్‌లో పడేదెప్పుడు?

దశాబ్దకాలంగా అమలుకు నోచని వెహికల్ ట్రాకింగ్

- ఢిల్లీ నిర్భయ ఘటన నేపథ్యంలో తెరపైకి ప్రతిపాదన
- అప్పట్లోనే ప్రతిపాదనలు సిద్ధం చేసిన తెలంగాణ ఆర్టీఏ
- ఇప్పటికీ ఆచరణకు నోచుకోని వైనం
- మంత్రి కేటీఆర్ సూచనతో తాజాగా మరోసారి తెరపైకి..
- 'ట్రాకింగ్' తప్పనిసరి చేస్తే మహిళలకు మరింత భద్రత

సాక్షి, హైదరాబాద్: మహిళలు, చిన్నారుల భద్రత కోసం అన్ని రకాల ప్రజా రవాణా వాహనాలను నిఘా చట్రంలోకి తేవాలన్న ప్రతిపాదన తాజాగా మరోసారి తెరపైకి వచ్చింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి రాత్రి పూట ఆలస్యంగా క్యాబ్‌లో వెళ్లేందుకు భయపడాల్సి వస్తోందని, ఇలాంటి వాహనాలపై పోలీసులు లేదా ఏదైనా ప్రభుత్వ సంస్థ నిఘా ఉంటే బాగుంటుందని ఇటీవల ఓ ప్రయాణికురాలు ట్వీట్ చేశారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను ట్యాగ్ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన వెహికల్ ట్రాకింగ్ అంశాన్ని పరిశీలించాలంటూ డీజీపీకి సూచించారు. ఢిల్లీ నిర్భయ ఘటన తరువాత అన్ని ప్రజా రవాణా వాహనాల్లో జీపీఎస్ ఆధారిత వెహికల్ ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ముందుకు వచ్చింది. ఈ మేరకు అప్పట్లో రాష్ట్ర రవాణా శాఖ కూడా ప్రణాళికలను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా గ్రేటర్‌లో తిరిగే క్యాబ్‌లు, ఆటోలు, ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, తదితర అన్ని రకాల వాహనాల్లో జీపీఎస్ ట్రాకింగ్ పరికరాల ఏర్పాటును తప్పనిసరి చేయాలని నిర్ణయించారు. కానీ ఇప్పటివరకు అది అమలుకు నోచలేదు.



దారుణం జరిగినప్పుడే చర్చ..

ఢిల్లీలో 2012లో చోటుచేసుకున్న నిర్భయ ఘటన దేశవ్యాప్తంగా మహిళల భద్రతను ప్రశ్నార్థకం చేసింది. ముఖ్యంగా రాత్రి వేళ ప్రజా రవాణా వాహనాల వినియోగంపై భయాందోళనలను పెంచింది. క్యాబ్‌లు, ఆటోరిక్షాలు, ప్రైవేట్ బస్సుల్లో ప్రయాణం ఏ మాత్రం క్షేమం కాదనే భావన నెలకొంది. ఆ తర్వాత కొద్దిరోజులకే హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మాదాపూర్ నుంచి క్యాబ్‌లో ఇంటికి వెళ్లే సమయంలో అత్యాచారానికి గురైంది. ఆ తర్వాత జరిగిన మరికొన్ని ఘటనలు రాత్రివేళ ప్రయాణించే మహిళల భద్రతను ప్రశ్నార్థకం చేశాయి. ఈ నేపథ్యంలోనే ప్రతి వాహనంపై నిఘా తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు 2017లో కేంద్ర ప్రభుత్వం కూడా ఈ మేరకు చట్టాన్ని రూపొందించింది. ప్రజా రవాణా వాహనాలపై నిఘా ఏర్పాటు చేసేందుకు నిర్భయ నిధి కింద కేంద్రం ఇచ్చే నిధులను ఖర్చు చేయవచ్చునని రాష్ట్రాలకు సూచించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు నిర్భయ నిధులు వచ్చాయి. కానీ మరోమారు ఈ అంశం అటకెక్కింది. నిఘా వ్యవస్థ ఏర్పాటు కాలేదు. గ్రేటర్‌లో తిరిగే క్యాబ్‌లలో ఆయా సంస్థలకు చెందిన వెహికల్ ట్రాకింగ్ వ్యవస్థ ఉన్నప్పటికీ అవి పోలీసు నిఘా పరిధిలో లేవు. దీంతో ఫిర్యాదులొస్తే తప్ప పోలీసులు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకునేందుకు అవకాశం లేకుండా పోతోంది. మరోవైపు క్యాబ్ డ్రైవర్‌లు తమ వాహనాల్లోని డివైస్‌లను స్విచ్ ఆఫ్ చేస్తే వాటిని ట్రాక్ చేయడం కష్టంగా మారుతోంది.

ట్రాకింగ్‌తో పక్కా నిఘా

ప్రతి వాహనంలో జీపీఎస్ వెహికల్ ట్రాకింగ్ డివైస్‌ను ఏర్పాటు చేయడం వల్ల దాని కదలికలపైన కచ్చితమైన నిఘా ఉంటుంది. ట్రాకింగ్ డివైస్ నుంచి ప్రతి 10 సెకన్లకు ఒకసారి వాహనం కదలికలు కమాండ్ కేంద్రానికి అందుతాయి. ఏదైనా ఇబ్బంది కలిగితే ప్రయాణికులు ఎస్‌ఓఎస్ బటన్ నొక్కితే కమాండ్ కంట్రోల్‌లో అలారం మోగుతుంది. వెంటనే పోలీసులు అప్రమత్తం అవుతారు. ప్రస్తుతం వాహనాల్లో అమర్చిన డివైస్‌లను తొలగించేందుకు ఏ మాత్రం అవకాశం లేకుండా పటిష్టంగా ఏర్పాటు చేసే సాంకేతిక వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. ఏపీ, మహారాష్ట్ర, పంజాబ్, కేరళ, ప.బెంగాల్లో మైనింగ్ వాహనాలకు ఈ సాంకేతికతను వినియోగిస్తున్నారు. హైదరాబాద్‌లో ఆర్టీసీ కొన్ని బస్సులకు ఏర్పాటు చేసింది. రూ.5000 లోపు లభించే ట్రాకింగ్ డివైస్‌లను తప్పనిసరి చేయడం వల్ల మహిళలు, యువతులు, విద్యార్థినులకు భద్రతతో కూడిన ప్రయాణాన్ని అందజేయవచ్చు.

ఆచరణ సాధ్యమే

వెహికల్ ట్రాకింగ్ వ్యవస్థ ప్రతిపాదన దశలోనే ఉంది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ప్రతి వాహనంలో ఈ డివైస్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ప్రభుత్వం ఆదేశిస్తే ఆచరణసాధ్యమే.

– రమేశ్, సంయుక్త రవాణా కమిషనర్, ఐటీ విభాగం

తక్కువ ఖర్చుతో భద్రత

వెహికల్ ట్రాకింగ్ డివైస్‌లు ఏ మాత్రం భారం కాదు. నాలుగైదు వేల రూపాయల ఖర్చుతో మంచి భద్రత కల్పించవచ్చు. ఇప్పుడు మరింత కచ్చితమైన ప్రమాణాలతో రూపొందించిన డివైస్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒకసారి వాటిని వాహనంలో ఏర్పాటు చేస్తే తొలగించడం సాధ్యం కాదు.

– ఆర్.ఎల్ రెడ్డి, సాంకేతిక నిపుణులు



పెద్దపల్లిలోని ర్యాకదేవపల్లిలో..



కరీంనగర్ జిల్లా చొప్పదండిలో కురుస్తున్న వడగళ్ల వర్షం



చొప్పదండిలో రాలిపోయిన మామిడి కాయలు



వరంగల్ జిల్లా మందపల్లిలో వడగళ్ల వానతో మృతి చెందిన జీవాలు

5 లక్షల ఎకరాల్లో పంట నష్టం

▶ మొదటి పేజీ తరువాయి

మామిడి తోటలు ఉన్నాయి. అకాల వర్షాలు, వడగళ్ల కారణంగా ప్రధానంగా వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మొక్కజొన్న విరిగిపోయింది. వరి నేల వాలింది. వడగళ్లు, ఈదురు గాలుల ప్రభావంతో.. మామిడి పూత, పిందెలు, కాయలు రాలిపోయాయి. మామిడి దిగుబడి తగ్గి నష్టం వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఈసారి 12 – 13 లక్షల టన్నుల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేశామని.. కానీ ప్రస్తుత నష్టంతో దిగుబడి సగం దాకా పడిపోయే అవకాశం ఉందని ఉద్యానశాఖ అధికారి ఒకరు తెలిపారు. ఇక టమాటా, బీరకాయ, పచ్చిమిర్చి, బొబ్బర్లు, మినుములు వంటి పంటలకూ వేల ఎకరాల్లో నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది.

గాలిలో దీపంలా పంటలు!: మూడేళ్ల క్రితం వరకు రాష్ట్రంలో పంటల బీమా అమలయ్యేది. కానీ ఇప్పుడు పంటనష్టాలకు పరిహారం అందే పరిస్థితి లేకుండా పోయింది. కొత్త పంటల బీమా విధానాన్ని తీసుకొస్తామని వ్యవసాయశాఖ పలు సందర్భాల్లో చెప్పినా ఆచరణలోకి రాలేదు. దీనితో పంటల పరిస్థితి గాలిలో దీపంలా మారిపోయిందని రైతు సంఘాలు వాపోతున్నాయి. రైతుబంధుతో ఎంతో ప్రయోజనం ఉన్నా పంట నష్టం పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నాయి.

పిడుగుపడి ముగ్గురు విద్యార్థులకు గాయాలు

నిజామాబాద్ పట్టణంలోని మాలపల్లిలో ఉన్న ఓ మదర్సాలో శనివారం రాత్రి పిడుగుపడటంతో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. వారిలో ఓ విద్యార్థి పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

కన్నీళ్లు మిగిల్చిన వడగళ్లు

- ఖమ్మం జిల్లా పరిధిలో 10,418 మంది రైతులకు చెందిన 20,748 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.
- సూర్యాపేట జిల్లాలో 14,429 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని.. 7,097 మంది రైతులు సుమారు 69.77 కోట్ల మేర నష్టపోయారని ప్రాథమికంగా అంచనా వేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 4,282 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. నల్లగొండ జిల్లాలో 610 ఎకరాల్లో మామిడి తోటలకు నష్టం వాటిల్లింది.
- కరీంనగర్ జిల్లాలో 14,300 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. మొక్కజొన్న, వరి బాగా నష్టపోయినట్టు గుర్తించారు.
- జగిత్యాల జిల్లాలో 4,600 ఎకరాల్లో మామిడి, 600 ఎకరాల్లో నువ్వులు, మొక్కజొన్న, వరికి.. పెద్దపల్లి జిల్లాలో 1,622 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు.
- ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, జేఎస్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో మొక్కజొన్న, మిర్చి, పొగాకుతోపాటు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. మామిడి, బొప్పాయి నేలరాలాయి. భూపాలపల్లిలో ఓపెన్ కాస్ట్ గనుల్లో వాన నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది.
- ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలో మూడు వేల ఎకరాల్లో మొక్కజొన్న, మిర్చికి నష్టం వాటిల్లింది. ఇతర పంటలకూ భారీగానే నష్టం జరిగిందని రైతులు చెప్తున్నారు.
- సంగారెడ్డి జిల్లాలోని 18 మండలాల్లో 4,425 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ముఖ్యంగా జొన్న, శనగ పంటలకు నష్టం జరిగింది.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించి ఆదుకోవాలి. కోతకు వచ్చిన మొక్కజొన్న, మిర్చి పంటలు నేలకొరిగాయి. మామిడి పిందెలు రాలిపోయాయి. వరికి అపార నష్టం వాటిల్లింది. ఉడకబెట్టి, ఆరబెట్టి కల్లాల్లో ఉంచిన పసుపు తడిసిపోయింది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి బాధిత రైతులందరికీ పరిహారం అందేలా చూడాలి. రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన పథకాన్ని అమల్లోకి తేవాలి.

– తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి



మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలంలో నేలవాలిన మొక్కజొన్న పంట



యాదాద్రి జిల్లా దత్తాయపల్లి వద్ద నేలకొరిగిన వరి పైరు

తాటాకు చప్పుళ్లకు భయపడతామా?

ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



సాక్షి, ఖమ్మం: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఖమ్మంలో కులాలు, మతాల మధ్య విద్వేషాలు రగిల్చి చిచ్చు పెట్టాలని కొన్ని పార్టీలు ప్రయత్నిస్తున్నాయని, మరి కొందరు ఇప్పుడిప్పుడే బూజు దులుపుకుని రోడ్లు ఎక్కుతున్నారని, వారిపట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం ఖమ్మంలో ఆయన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అర్హత లేని వారు కూడా కేసీఆర్‌ను గద్దె దింపుతామని అంటున్నారని మండిపడ్డారు. అలాంటి తాటాకు చప్పుళ్లకు, ఉడత ఊపులకు ఇక్కడ ఎవరూ భయపడరని, కేసీఆర్ అంటే ఎంటనేది తెలుసుకుని మాట్లాడితే మంచిదని ఆయన హితవు పలికారు. ఖమ్మం తన ఇల్లని, ఇక్కడి ప్రజలు తన కుటుంబ సభ్యులని పేర్కొన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం నుంచి సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందిస్తానని పువ్వాడ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జ్ శేరి సుభాష్ రెడ్డి, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాత మధు, ఎంపీ నామా నాగేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు పాల్గొన్నారు.

వెంటాడుతున్న కుక్కలు

- జనగామలో ఒకేరోజు 21 మందికి గాయాలు
- మలక్‌పేట, కాజీపేటల్లో ఇద్దరు చిన్నారులకు కుక్కకాటు

జనగామ, చాదర్‌ఘాట్, కాజీపేట: వీధి కుక్కల స్వైరవిహారంతో పలు ప్రాంతాల్లో 23మంది తీవ్రంగా గాయపడ్డారు. జనగామ జిల్లా కేంద్రంలోనే ఏకంగా 21 మంది వీధి కుక్కల బారిన పడి గాయాలపాలయ్యారు. కుర్మవాడ(సుమారు 4 వార్డుల పరిధి), హనుమాన్ స్ట్రీట్ తదితర ప్రాంతాలకు చెందిన స్థానికులు రోడ్డుపై వెళ్తుండగా కుక్కలు దాడి చేశాయి. సమీప వాసులు కర్రలు, రాళ్లతో తరిమికొట్టడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. వెంటనే బాధితులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి కుక్క కాటుకు సంబంధించిన ఇంజక్షన్ తీసుకుని చికిత్స పొందారు. హైదరాబాద్‌లోని మలక్‌పేట పద్మానగర్‌కు చెందిన పదేళ్ల బాలుడు మహ్మద్ అర్స్‌లాన్ రోడ్డుపై ఆడుకుంటుండగా కుక్క కరవడంతో చేతికి గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఇక హనుమకొండ జిల్లా కాజీపేటలో స్కూలుకు వెళ్లి వస్తున్న తొమ్మిదేళ్ల బాలుడు ముస్తఫాను స్థానిక శైలేందర్ సింగ్‌కు చెందిన పెంపుడు కుక్క కరిచింది. బాధితుడి తండ్రి ఫిర్యాదుతో కుక్క యజమానిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



జనగామలో కుక్కల దాడిలో గాయపడిన వ్యక్తి



మలక్ పేటలో గాయపడిన మహ్మద్ అర్స్‌లాన్

ఐక్యతతోనే ముదిరాజ్‌ల అభ్యున్నతి



బండ ప్రకాశ్

హస్తినాపురం: ఐక్యంగా ఉంటేనే ముదిరాజ్‌లు రాజకీయంగా ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతారని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ స్పష్టం చేశారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని చంద్ర గార్డెన్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశానికి బండ ప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముదిరాజ్‌ల వందేళ్ల చరిత్రను గ్రంథస్థం చేసి సెప్టెంబర్ 30న రవీంద్రభారతిలో ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా నియమితులైన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

రైతులను ఆదుకోకుంటే ఆమరణ దీక్ష



నల్లగొండ: జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు, వడగళ్ల వల్ల రైతన్నకు కడగండ్లు మిగిలాయని భువనగిరి పార్లమెంటు సభ్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాశారు. అకాల వర్షం వల్ల భువనగిరి పార్లమెంట్ పరిధిలోని తిరుమలగిరి మండలంలో 99 శాతం పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. వరి, మిరప, టమాటా, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతిని రైతన్న తీవ్రంగా నష్టపోయినట్టు తెలిపారు. వరి పంట గింజ కూడా లేకుండా రాలిపోయిందని పేర్కొన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా రామన్నపేట, కనగల్, తుంగతుర్తి, నూతన్‌కల్ సహా పలు మండలాల్లో చేతికొచ్చిన పంటలు నాశనమైనట్టు ఎంపీ కోమటిరెడ్డి తెలిపారు. ఇంకొన్ని రోజులు వర్షాలు పడతాయని వాతావరణశాఖ హెచ్చరిస్తున్నా.. ఎమ్మెల్యేలు, అధికారులు రైతన్నను పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో ప్రభుత్వం స్పందించకుంటే రైతుల పక్షాన తానే రంగంలోకి దిగుతానని హెచ్చరించారు. ఈనెల 22న తిరుమలగిరి మండలంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిరాహార దీక్షకు కూర్చుంటానని ఎంపీ కోమటిరెడ్డి తెలిపారు.

వడగళ్లు, ఈదురుగాలులు

ఏపీలో పిడుగుపాట్లకు ఐదుగురు మృత్యువాత

సాక్షి నెట్‌వర్క్: ఏపీలో అనేకచోట్ల ఆదివారం కూడా వానలు దంచికొట్టాయి. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో వర్షాలు కురిశాయి. వర్షాలకు తోడు వడగళ్లు, ఈదురుగాలులు, పిడుగులు బెంబేలెత్తిస్తున్నాయి. పిడుగుపాటుకు పల్నాడులో ఇద్దరు, నంద్యాల, అన్నమయ్య, ప్రకాశం జిల్లాల్లో ఒకొక్కరు చొప్పున మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. వర్షాలకు కొన్నిచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. ఎక్కడెక్కడ పంట నష్టం జరిగిందనే దానిపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

ఎకరాకు రూ.15వేలు చెల్లించండి

- సీఎం కేసీఆర్‌కు రేవంత్ బహిరంగ లేఖ

సాక్షి, హైదరాబాద్: గత నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో రాష్ట్ర రైతాంగం పరిస్థితి దయనీయంగా మారిందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పెట్టుబడులు భారీగా పెరిగిపోయిన పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి చేయూత లేదన్నారు. వెంటనే రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం రేవంత్.. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేయించాలని, రాష్ట్రంలో పంటల బీమా పథకం అమలు కానందున ప్రతీ ఎకరానికి రూ.15 వేల పరిహారం చెల్లించాలని కోరారు.

పరిహారం ఇప్పించండి

అకాల వర్షాలతో రాష్ట్రంలో పాడైన పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ మేరకు ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్‌చైర్మన్ ఎం.కోదండరెడ్డి, పార్టీ నేతలు వి.హనుమంతరావు, గడ్డం ప్రసాద్, రాములు నాయక్‌లతో కూడిన ప్రతినిధి బృందం ఆదివారం వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం అందజేసింది.

మిల్లెట్ మ్యాన్ పీవీ సతీష్ కన్నుమూత

చిరుధాన్యాల ఉద్యమ శిఖరంగా పేరు

- డీడీఎస్ ద్వారా చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం
- నేడు పస్తాపూర్‌లో అంత్యక్రియలు



జహీరాబాద్, సాక్షి, హైదరాబాద్:నలభై ఏళ్ల క్రితం డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్)ని స్థాపించి, పాత పంటలు, సంప్రదాయ పంటలు, చిరుధాన్యాల సంరక్షణను ఉద్యమంలా చేపట్టి తెలంగాణ మిల్లెట్ మ్యాన్‌గా పేరుగాంచిన పీవీ సతీష్ (77) ఆదివారం కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో హైదరాబాద్ లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ లో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దేశ వ్యాప్తంగా మిల్లెట్ పునరుద్ధరణకు ఆయన శ్రమించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం పస్తాపూర్ కేంద్రంగా కార్యక్రమాలను నిర్వహిస్తూ వచ్చారు. మహిళా రైతులతో కలిసి పాత పంటల పరిరక్షణ కోసం 1983 నుంచి కృషి చేస్తూనే, వారితోనే సంప్రదాయ పంటలు, వాటి ఆవశ్యకత గురించి కమ్యూనిటీ రేడియోను ప్రారంభించారు. వారు స్థాపించిన సొసైటీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడమే కాకుండా యునైటెడ్ నేషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలలో ఈక్వేటర్ ప్రైజ్‌ను గెలుచుకుంది. ప్రతీ సంక్రాంతికి ''పాత పంటల జాతర''ను సతీష్ నిర్వహిస్తున్నారు. చిరుధాన్యాలను ప్రజల ఎజెండాగా చేయడంలో ఆయన జీవితకాల కృషికి ఇటీవల పురస్కారం లభించింది. డీడీఎస్ సంస్థకు పలు అవార్డులతో పాటు ప్రతిష్టాత్మక వృక్షమిత్ర అవార్డు సైతం సాధించింది.

తెలంగాణ మిల్లెట్ మ్యాన్‌గా గుర్తింపు పొందిన పెరియపట్నం వెంకట సుబ్బయ్య సతీశ్ 1945వ సంవత్సరం జూన్ 18న మైసూర్‌లోజన్మించారు. న్యూఢిల్లీలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ నుంచి గ్రాడ్యుయేట్ పూర్తిచేసి జర్నలిస్టుగా జీవితం ప్రారంభించారు. సుమారు రెండు దశాబ్దాల పాటు అగ్రగామి టెలివిజన్ నిర్మాతగా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణాభివృద్ధి, గ్రామీణ అక్షరాస్యతకు సంబంధించిన కార్యక్రమాలను రూపొందించారు. 1970లో చారిత్రక ఉపగ్రహ బోధనా టెలివిజన్ ప్రమోగం(ఎస్ఐటీఈ)లో ముఖ్యమైన పాత్ర పోషించారు. 1980 కాలంలో సతీష్ కొంతమంది మిత్రులతో కలిసి జహీరాబాద్ ప్రాంతంలో డీడీఎస్ సంస్థను ప్రారంభించారు. భారత దేశ మొట్ట మొదటి కమ్యూనిటీ మీడియా ట్రస్ట్‌ను ప్రారంభించిన ఘనత కూడా ఆయనకే దక్కింది. నిరక్షరాస్యులైన దళిత మహిళలను ప్రోత్సహించి వారికి మీడియా, వీడియో రంగంలో శిక్షణ ఇప్పించారు.

మంత్రుల సంతాపం: ఆయన మరణం పట్ల వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. 2023ను అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరంగా జరుపుకుంటున్న సమయంలో తెలంగాణ మిల్లెట్ మ్యాన్‌గా గుర్తింపు పొందిన సతీష్ మరణ వార్త దిగ్భ్రాంతికి గురి చేసిందని విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పేర్కొన్నారు.

నేడు అంత్యక్రియలు: పి.వి.సతీష్ అంత్యక్రియలను ఈనెల 20వ తేదీన సోమవారం ఉదయం 10.30 గంటలకు జహీరాబాద్ మండలంలోని పస్తాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ సభ్యులు తెలిపారు.

గడ్డి మొలకెత్తని పొలాల్లో సిరులు పండేలా చేశారు

ఎర్ర మొరం మట్టి నేలల్లో గడ్డికూడ మొలకెత్తని పరిస్థితి ఉండేది. ఏ గ్రామంలో చూసినా మహిళలు, వృద్ధులు తప్ప రైతులు కనిపించేవారు కాదు. ఇదంతా దూరదర్శన్‌లో పనిచేస్తున్న సమయంలో పి.వి.సతీష్ గమనించారు. తర్వాత ఉద్యోగాన్ని వదిలేసి జహీరాబాద్ వచ్చారు. ఎర్ర మట్టిలో సారం నింపి, సొంత విత్తనాలు నాటాలని చెప్పారు. దీంతో మహిళలు అతని వెంట పలు గు, పార పట్టుకొని నడిచారు. జహీరాబాద్ చుట్టూ విసిరేసినట్లు ఉండే ఎల్గోయి, రేజింతల్, పస్తాపూర్, జీడిగడ్డతండా, ఖాశీంపూర్, పొట్‌పల్లి, చిల్కెపల్లి వంటి 30 గ్రామాల్లో ఆరువేల మంది ఆడబిడ్డలు మిల్లెట్స్‌ని ఒక ఉద్యమంగా పండిస్తున్నారు. వారు అక్కడితోనే ఆగలేదు. సొంత విత్తనాలతో సీడ్ బ్యాంకు ఏర్పాటు చేసుకున్నారు. ఆర్గానిక్ ఎరువులు, గానుగ నూనెలు తయారు చేస్తున్నారు. బ్రెడ్ నుంచి అరిసెల వరకు చిరు ధాన్యాలతో అరుదైన 60 రకాల ఆహార ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. సొంతంగా మిల్లెట్ రెస్టారెంట్ సైతం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగంలోకి ప్రవేశిస్తున్న హైబ్రీడ్ విత్తనాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. మొక్కజొన్న, సోయాబీన్, పత్తి పంటల సాగును వ్యతిరేకిస్తూ పలు ఉద్యమాలు చేశారు.

'ఓటీటీ ప్లాట్ ఫామ్‌ను సెన్సార్ పరిధిలోకి తీసుకురావాలి'

సాక్షి, హైదరాబాద్: ఓటీటీ ప్లాట్ ఫామ్‌లో ప్రసారమవుతున్న రానా నాయుడు, మీర్జాపూర్ వంటి వెబ్ సిరీస్‌ను ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముఖ్యంగా తెలుగు ప్రజలకు మంచి కుటుంబ కథా చిత్రాలు అందించిన దగ్గుబాటి రామా నాయుడు కుటుంబ సభ్యుల నుండి రానా నాయుడు వంటి వెబ్ సిరీస్ రావడం దురదృష్టకరమన్నారు. అందులో అశ్లీల డైలాగులను దగ్గుబాటి వెంకటేశ్, రానా మాట్లాడటం కుటుంబ మర్యాదలకు భంగం కలిగేలా ఉందన్నారు. ఓటీటీలపై నియంత్రణ, సెన్సార్ షిప్ లేకపోవడంతో అశ్లీల సన్నివేశాలు, డైలాగులు విశృంఖలంగా ప్రసారం చేస్తున్నారని అన్నారు. దీంతో యువత పెడదోవ పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పైగా ప్రతి ఒక్కరికి మొబైల్ ఫోన్ ఉండడంతో ఓటీటీల ద్వారా వెబ్ సిరీస్ మారుమూల పల్లెల్లో సైతం సులువుగా వీక్షించేందుకు సౌలభ్యం కలిగిందన్నారు. తక్షణమే ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ను సెన్సార్ బోర్డు పరిధిలోకి తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ముఖ్యంగా రానా నాయుడు వెబ్ సిరీస్‌ను ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సరదాగా...

కాలిఫోర్నియాలో అంతుచిక్కని వెలుగురేఖ!



కాలిఫోర్నియా: ఆకాశంలో ఎవరికీ అంతు చిక్కని వెలుగు రేఖ ఒకటి అమెరికా కాలిఫోర్నియాలోని శాక్రమెంటోలో కనిపించింది. సెయింట్ పాట్రిక్ డే వేడుకల్లో ఉన్న వారంతా నీలాకాశంలో కనిపించిన ఆ వెలుగుని చూసి ఆశ్చర్యచకితులయ్యారు. వెంటనే తమ చేతుల్లో ఉన్న సెల్‌ఫోన్ కెమెరాల్లో దానిని బంధించి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కేవలం 40 సెకండ్ల పాటు మాత్రమే కనిపించి ఆ వెలుగురేఖ అదృశ్యమైపోయింది. ''ఇప్పటివరకు ఇలాంటి దృశ్యాన్ని మేము చూడలేదు. ఆకాశంలో ఏదో మండుతున్నట్టుగా ఒక వెలుగు కొన్ని సెకండ్లు కనిపించి మాయమైపోయింది. ఇది ఎందుకు కనిపించిందో ఎవరైనా చెప్పగలరా'' అంటూ దానిని వీడియో తీసిన హెర్నాండెజ్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఈ వీడియోను చూసిన హార్వార్డ్–స్మిత్‌సోనియాన్ సెంటర్ ఫర్ ఆస్ట్రోఫిజిక్స్‌కు చెందిన జోనాథాన్ మెక్‌డొవెల్ అంతరిక్షంలో మండించే శిథిలాల్లో ఒక చిన్న తునక కావడానికి 99.9% ఆస్కారం ఉందని బదులిచ్చారు. జపాన్‌కు చెందిన రిటైర్ అయిన కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ఇటీవల మంటల్లో దగ్ధం చేశారని, దాని తాలూకు చిన్న తునక అలా కనిపించి ఉంటుందని అంచనా వేశారు.



గద్దతో 'మంత్రాంగం'

ఈయనెవరో తెలుసా? బ్రిటన్ విదేశాంగ మంత్రి జేమ్స్ క్లెవర్లీ. కజకిస్తాన్‌లోని ఆస్తానాలో ఉన్న బాల్‌ఖరగాయ్ నేషనల్ కల్చరల్ రిక్రియేషన్ జోన్ సందర్శన సందర్భంగా చేతిలో గద్దతో ఇలా ఫొటోకు పోజిచ్చారు.

అవిగవిగో నీటి జాడలు

జీవుల మనుగడకు కావాల్సింది జలం. భూమిపై జలం ఉంది కాబట్టి మానవులతో సహా లక్షల సంఖ్యలో జీవులు ఆవిర్భవించాయి. నిక్షేపంగా మనుగడ సాగిస్తున్నాయి. భూమికి సహజ ఉపగ్రహమైన చంద్రుడిపైనా నీటి జాడలు ఉన్నట్లు గతంలోనే పరిశోధకులు గుర్తించారు. ఈ నీటి ఆనవాళ్లకు సంబంధించిన సవివరమైన పటాన్ని(మ్యాప్)ను తాజాగా రూపొందించారు. దీనివల్ల చందమామ ఉపరితలం, అక్కడ మానవుల జీవనానికి అందుబాటులో ఉన్న పరిస్థితుల గురించి మరింత లోతుగా తెలుసుకోవడానికి వీలవుతుందని చెబుతున్నారు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా 'ఆర్టిమిస్'పేరిట కీలకమైన ప్రయోగానికి ఏర్పాట్లు చేస్తోంది. త్వరలో చందమామపైకి మనుషులను పంపించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో చంద్రుడిపై నీటి మ్యాప్‌ను తయారు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.


ఇటు చంద్రునిపై.. అటు అంగారకుడిపై..

- అమెరికా, జర్మనీ సంయుక్తంగా ప్రయోగించిన స్ట్రాటోస్ఫియరిక్ అబ్జర్వేటరీ ఫర్ ఇన్‌ఫ్రారెడ్ ఆస్ట్రానమీ(సోఫియా) అనే అంతరిక్ష నౌక పంపించిన డేటా ఆధారంగా చంద్రుడిపై ఉన్న నీటి మ్యాప్‌ను రూపొందించారు.
- చంద్రుడిలో మన కంటికి కనిపించే భాగంలో నాలుగింట ఒక వంతు భాగాన్ని ఈ మ్యాప్ కవర్ చేస్తోంది. చంద్రుడిపై 60 డిగ్రీల అక్షాంశాల దిగువ భాగం నుంచి దక్షిణ ధ్రువం వరకూ ఉన్న ప్రాంతమంతా ఈ మ్యాప్‌లో ఉంది.
- చంద్రుడిపై నీరు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఎలా కదులుతుంది? అనేది ఈ మ్యాప్ తెలుసుకోవచ్చని సైంటిస్టులు అంటున్నారు. అంతేకాకుండా చంద్రుడి దక్షిణ ధ్రువంలోని భౌగోళిక పరిస్థితులను స్పష్టంగా గమనించవచ్చని చెబుతున్నారు.
- చంద్రుడి ఉపరితలంపై చాలా ప్రాంతాల్లో సూర్యకాంతి పడదు. అతిశీతల వాతావరణం ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో చందమామ ఉపరితల లక్షణాలతో అక్కడి నీటికి ఎలాంటి సంబంధం ఉంది? అనేది మ్యాప్ సులభంగా ద్వారా తేల్చవచ్చని నాసా వెల్లడించింది.
- చంద్రుడి ఉపరితలంలో పాటు అంతర్భాగంలోనూ నీటి ఉనికిని గతంలో గుర్తించారు. ఇది మంచు స్ఫటికాల రూపంలో నిక్షిప్తమై ఉన్నట్లు అంచనాకొచ్చారు. మరి కొంత నీరు రసాయన సమ్మేళనాలుగా ఉన్నట్లు కనిపెట్టారు.
- చంద్రుడిపై అసలు నీరు ఎలా పుట్టిందన్న సంగతి నిగ్గు తేల్చడానికి సైంటిస్టులు ఆసక్తి చూపుతున్నారు.



ఆర్టిమిస్ ప్రయోగం

- వ్యోమగాములను పంపించడానికి నాసా చంద్రుడిపై 13 ల్యాండింగ్ సైట్లను గుర్తించింది.
- విభిన్నమైన వాతావరణ పరిస్థితుల్లో చందమామపై నీరు ఎలాంటి మార్పులు చెందుతున్న సంగతి తెలుసుకోవడానికి జల పటం ఉపకరిస్తుందని నాసా వెల్లడించింది.
- ఆర్టిమిస్ ప్రయోగం ద్వారా తొలిసారిగా ఒక మహిళను, ఒక నల్ల జాతీయుడిని చంద్రుడిపైకి పంపించాలని నాసా సంకల్పించింది. చంద్రుడిపై మనుషులు దీర్ఘకాలం నివసించేందుకు అనువైన పరిస్థితులను సృష్టించడానికి ప్రయోగాలు చేస్తోంది.
- ఇందులో భాగంగా అక్కడున్న నీటిని ఎలా ఉపయోగించుకోవాలన్న దానిపై పరిశోధనలు సాగుతున్నాయి.
- చంద్రుడి నీటి మ్యాప్ ఆర్టిమిస్ ప్రోగ్రామ్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని 'వైపర్'సైన్స్ టీమ్ సభ్యుడు కాసీ హానీబాల్ చెప్పారు.



అరుణ గ్రహంపై జల సవ్వడి!



అంగారక గ్రహం (మార్స్)పై వాతావరణం శూన్యం. గాలి, నీరు ఉండే అవకాశమే లేదని, మానవ మనుగడపై అనువైన పరిస్థితులు లేవని పరిశోధకులు ఇన్నాళ్లు భావించారు. కానీ, అక్కడ నీటి ఉనికి ఉందన్న నిజం వెలుగులోకి వచ్చింది. మార్స్ మధ్యరేఖ వద్ద పురాతన హిమానీనదం(గ్లేసియర్) అవశేషాలను గుర్తించామని అమెరికా సైంటిస్టులు ప్రకటించారు. ఈ అవశేషం 6 కిలోమీటర్ల పొడవు, 4 కిలోమీటర్ల వెడల్పు ఉందని వివరించారు. ఇదే ప్రాంతంలో వేలాది సంవత్సరాల క్రితం అగ్నిపర్వతం పేలుడు సంభవించిందని పేర్కొన్నారు. అగ్నిపర్వతం పేలుడు వల్ల ఇక్కడున్న నీరు ఉప్పురూపంలో ఘనీభవించినట్లు భావిస్తున్నామని వివరించారు. ఈ వివరాలను ఇటీవల జరిగిన 54వ లూనార్ అండ్ ప్లానెటరీ సైన్స్ కాన్ఫరెన్స్‌లో విడుదల చేశారు. భూమికి 5.46 కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉన్న అరుణ గ్రహంపై అమెరికాతో పాటు వివిధ దేశాలు విస్తృతంగా పరిశోధనలు చేస్తున్న సంగతి తెలిసిందే. కొన్ని దేశాలు రోవర్లను సైతం పంపించాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

రాహుల్ ఇంటికి పోలీసులు

'లైంగిక వేధింపుల' బాధితుల వివరాల కోసమే | 4 పేజీల ప్రాథమిక ప్రతిస్పందనను పంపిన రాహుల్ | పోలీసుల చర్య పట్ల కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం



ఆదివారం రాహుల్ నివాసం వద్ద ఆయన కోసం ఎదురు చూస్తున్న ఢిల్లీ పోలీసులు

న్యూఢిల్లీ: దేశంలో మహిళలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయంటూ జనవరి 30న శ్రీనగర్‌లో భారత్ జోడో యాత్రలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఢిల్లీ పోలీసులు మరోసారి స్పందించారు. సదరు బాధిత మహిళల నుంచి ఫిర్యాదు స్వీకరించడంతోపాటు రక్షణ కల్పించడానికి వీలుగా వారి వివరాలు తెలుసుకొనేందుకు ఆదివారం ఢిల్లీలోని రాహుల్ గాంధీ ఇంటికి వెళ్లారు. ప్రత్యేక కమిషనర్ సాగర్‌ప్రీత్ హుడా నేతృత్వంలో పోలీసుల బృందం ఉదయం పదింటికి తుగ్లక్ రోడ్డులోని రాహుల్ ఇంటికి వెళ్లినా ఆయన్ను కలవలేకపోయింది. మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి వెళ్లిపోయింది. ఢిల్లీ పోలీసులు రాహుల్ గాంధీ ఇంటికి రావడం ఇటీవల ఇది మూడోసారి. 'లైంగిక వేధింపులకు గురవుతున్నామంటూ మిమ్మల్ని వేడుకున్న మహిళల వివరాలు తెలపండి' అంటూ రాహుల్‌కు ప్రశ్నావళితో నోటీసు పంపించారు.

తీవ్రమైన ఆరోపణలు చేశారు

రాహుల్ ఇంటికి పోలీసుల వచ్చారన్న సంగతి తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నేతలు పవన్ ఖేరా, అభిషేక్ సింఘ్వీ, జైరాం రమేశ్ తదితరులు ఇక్కడికి చేరుకున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఢిల్లీలో జోడో యాత్ర జరుగుతున్నప్పుడు రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై స్థానికంగా దర్యాప్తు జరిపామని, మహిళలపై లైంగిక వేధింపులు జరిగినట్లు, సమస్యను వారు ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు నిర్ధారణ కాలేదని ప్రత్యేక కమిషనర్ సాగర్‌ప్రీత్ హుడా చెప్పారు. ''రాహుల్ తీవ్ర ఆరోపణలు చేశారు. త్వరలో తానే స్వయంగా ఆయనను కలిసి, వివరాలు తెలుసుకుంటా'' అని చెప్పారు.

అదానీపై ప్రశ్నిస్తున్నందుకే: రాహుల్

తన ఆరోపణపై రాహుల్ ఆదివారం సాయంత్రం 4 పేజీల్లో ప్రాథమిక ప్రతిస్పందనను పోలీసులకు పంపించారు. గౌతమ్ అదానీ అంశంలో పార్లమెంట్ లోపల, బయట కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తున్నందుకే పోలీసులు తన ఇంటికి వస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, ఇతర పార్టీలు ప్రకటనలపై కూడా ఇలాంటి శల్యపరీక్ష చేశారా అని ప్రశ్నించారు. ఢిల్లీ పోలీసుల చర్యను తీవ్రంగా ఖండించారు. ఆరోపణలపై పూర్తిస్థాయిలో సమాధానం ఇవ్వడానికి 8 నుంచి 10 రోజుల సమయం కోరారు.

కుట్రపూరితంగానే: కాంగ్రెస్

ఢిల్లీ పోలీసులు రాహుల్ ఇంటికి వెళ్లడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. దీని వెనుక రాహుల్‌ను వేధించి, బెదిరించే కుట్ర ఉందని పార్టీ నేతలు అశోక్ గహ్లోత్, జైరాం రమేశ్, అభిషేక్ సింఘ్వీ మండిపడ్డారు. ప్రతిపక్ష నేతలు చేసే ప్రకటనలపై కేసులు నమోదు చేసే దుష్ట సంస్కృతికి మోదీ సర్కారు తెరతీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీయేతర పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాల్లో బీజేపీ నేతలు, కేంద్ర మంత్రులు చేసే ప్రకటనలపై ఇకపై ఇలాంటి కేసులు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకుల విమర్శలపై బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా స్పందించారు. పోలీసులు వారి విధులను వారు నిర్వర్తించారని, ఇందులో తప్పుపట్టడానికి ఏమీ లేదని తేల్చిచెప్పారు. చట్ట ప్రకారమే వారు నడుచుకున్నారని తెలిపారు.

కరోనాతో ఆనందం ఆవిరి

గువాహటి: కరోనా మహమ్మారి మన భావోద్వేగాలతో ఒక ఆటాడుకుంది. మన ఆనందాలను ఆవిరి చేసేసింది. కోవిడ్ సోకిన భారతీయుల్లో 35 శాతం మంది ఇంకా తీవ్ర నిరాశ నిస్పృహల్లోనే ఉన్నారని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఒత్తిడి, కోపం, విచారం, ఆందోళన వంటి ప్రతికూల భావోద్వేగాలు కోవిడ్ బాధితుల్లో అధికంగా ఉన్నాయని హ్యాపీప్లస్ సంస్థ విడుదల చేసిన హ్యాపీనెస్–2023 నివేదికలో వెల్లడైంది. అరుణాచల్‌ప్రదేశ్‌లో కోవిడ్ బాధితుల్లో అత్యధికంగా 60 శాతం మంది తాము ఆనందంగా లేమని చెప్పారు. 58 శాతంతో మధ్యప్రదేశ్, 51 శాతంతో గుజరాత్, ఉత్తరప్రదేశ్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. కరోనాతో నిమిత్తం లేకుండా కూడా భారతీయుల్లో సంతోషం పాలు కాస్త తగ్గుతోందని నివేదిక తేల్చింది. తాము ఆనందంగా ఉన్నామని గతేడాది 70 శాతం మంది చెప్పగా ఇప్పుడది 67 శాతానికి తగ్గిందట! ప్రజల శ్రేయస్సును లెక్కల్లోకి తీసుకుంటే గతేడాది 10కి 6.84 పాయింట్లుంటే 6.08కి తగ్గింది. భారతీయ ప్రజల్లో సంతోషం తగ్గిపోవడానికి ఆర్థిక ఇబ్బందులు, పని ఒత్తిడి, సామాజిక సంబంధాల్లో క్షీణత, ఒంటరితనం కారణాలని అధ్యయనం పేర్కొంది.

పరారీలో అమృత్‌పాల్

చండీగఢ్: పంజాబ్‌లో వివాదాస్పద ఖలిస్తానీ నేత,, 'వారిస్ దే పంజాబ్' సంస్థ చీఫ్ అమృత్‌పాల్‌సింగ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. శనివారం నుంచి మొదలైన గాలింపులో అతడి 78 మంది అనుచరులను అరెస్ట్ చేశామన్నారు. ఆదివారం అదుపులోకి తీసుకున్న నలుగురు అమృత్‌పాల్ సన్నిహితులను అస్సాంలోని డిబ్రూగఢ్ సెంట్రల్ జైలుకు ప్రత్యేక హెలికాప్టర్‌లో తరలించామన్నారు. అమృత్‌పాల్ జాడ కోసం గాలింపు ముమ్మరం చేశామన్నారు. రాష్ట్రంలో మొబైల్ ఇంటర్నెట్, ఎస్ఎంఎస్ సేవల నిలిపివేతను సోమవారం దాకా పొడిగించారు. శనివారం ఛేజింగ్ సమయంలో తన కాన్వాయ్ ముందు వాహనంలో ఉన్న అమృత్‌పాల్ సింగ్, ఇరుకు సందుల్లో వెళుతూ అదను చూసి తప్పించుకున్నట్లు ఉన్నతాధికారులు చెప్పారు. కానీ అమృత్‌పాల్ పోలీసుల అదుపులోనే ఉన్నాడని అతడి తండ్రి తర్సెమ్ సింగ్ అంటున్నారు.

జపాన్‌లో పుష్పవిలాసం

చెర్రీ బ్లాసమ్ సీజన్‌కు ఘనస్వాగతం

రుతువులు మారే వేళ..
ప్రకృతి వింత అందాలను సంతరించుకున్న వేళ..
నింగిలోని కోటి తారలే నేలపై పూలై
విరబూసే సమయాన..
ఒక పండుగ శోభ మది మదిని ఆహ్లాదపరుస్తుంది.
రాలేటి పూలు రాగాలు పలికిస్తుంటే,
పూసేటి పూలు సుగంధాలు వెదజల్లుతూ ఉంటే
తెలుగువారు ఆమని పాడవే హాయిగా అని
పాటలు పాడుకుంటారు.





అదే జపాన్‌లో అయితే చెర్రీ బ్లాసమ్ (సకుర) చెట్ల కింద కూర్చొని వేడుకలు చేసుకుంటారు. వాతావరణ మార్పుల కారణంగా ఈ ఏడాది చెర్రీ బ్లాసమ్ సీజన్ జపాన్‌ను ముందుగానే పలకరించింది. జపాన్ దేశవ్యాప్తంగా చెర్రీ బ్లాసమ్ చెట్లు ఎక్కడంటే అక్కడే కనిపిస్తాయి. సాధారణంగా మార్చి చివరి వారంలో ఈ చెట్లు విరగబూస్తాయి. కానీ ఈ ఏడాది పది రోజుల ముందే చెర్రీ బ్లాసమ్స్ పూసాయి. రోడ్డుకిరువైపులా ఉన్న చెట్లు నిండా తెలుపు, గులాబీ రంగుల్లో పువ్వులు అత్యంత ఆకర్షణీయంగా ఉంటాయి. కొన్ని చెట్లకు పసుపు, ఆకుపచ్చ రంగుల్లో కూడా పూలు పూస్తాయి. ఈ పూలు కేవలం 15 నుంచి నెల రోజుల వరకు మాత్రమే ఉండి ఆ తర్వాత నేల రాలిపోతాయి. అందుకే ఈ సీజన్‌లో జపాన్‌లో ఒక పండుగ వాతావరణం నెలకొని ఉంటుంది. చెర్రీ బ్లాసమ్‌ని మహోత్సవంలా నిర్వహిస్తారు. దీనినే హనామీ ఫెస్టివల్ అంటారు. ఇది జపాన్ జాతీయ పండుగ. వెయ్యేళ్ల క్రితం నుంచే హనామీ ఉత్సవాలు జపాన్ నేలపై జరుగుతున్నాయి. ఈ సీజన్ ఎందరో కవుల హృదయాలను తట్టి లేపి దేశానికి అమృతం లాంటి కవిత్వాన్ని పంచి ఇచ్చింది. ఈ సీజన్‌లో ప్రజలు తమ బాధలన్నీ మర్చిపోయి రోజంతా చెట్ల కింద ఆడుకుంటారు. పాడుకుంటారు. ముచ్చట్లు చెప్పుకుంటారు. తింటారు. తాగుతారు. అక్కడే సేద తీరుతారు. పార్కులు, రోడ్డుకిరువైపులా చెర్రీలు కనువిందు చేస్తుంటే ప్రజలు గుంపులు గుంపులుగా వచ్చి చీర్స్ చెప్పుకుంటూ ఎంజాయ్ చేస్తారు. చైనా, కొరియా, తైవాన్, యూరప్, అమెరికా దేశాల్లో కూడా చెర్రీ బ్లాసమ్ చెట్లు ఉన్నప్పటికీ జపాన్‌లో చేసినట్టుగా ఒక పండుగలా వైవిధ్యభరితంగా మరెవరూ చేయరు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఈ పండుగ జపాన్ వాసులకు ఆహ్లాదాన్ని పంచడమే కాదు ఆదాయాన్ని కూడా భారీగా సమకూరుస్తుంది. ఈ సీజన్‌లో జపాన్‌కి పర్యాటకులు పోటెత్తుతారు. గత రెండు మూడేళ్లుగా కరోనా మహమ్మారితో ఈ పండుగ కాస్త కళ తప్పింది. ఈ ఏడాది అన్ని భయాలు తొలగిపోవడంతో జపాన్ వాసులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకోవడానికి సిద్ధమయ్యారు. మార్చి నుంచి ఏప్రిల్ వరకు కొన్ని ప్రాంతాల్లో ఈ చెట్లు పూస్తే, దేశానికి ఉత్తరాదివైపు ఉండే హిరోసాకి

ఆహ్లాదంతో ఆదాయం

వంటి నగరాల్లో మేలో పూలు పూస్తాయి. ఈ సీజన్‌లో చెర్రీ చెట్లు దేశ ఖజానాకు 61,580 కోట్ల యెన్‌ల ఆదాయం తెచ్చిపెడతాయి. ఈ సమయంలో జపాన్‌కు ఏటా 23 లక్షల విదేశీ పర్యాటకులు వస్తుంటారు. ఈసారి జపాన్‌కు బుకింగ్స్ గతం కంటే 70 శాతం ఎక్కువయ్యాయని ట్రావెలింగ్ సంస్థల గణాంకాలు వెల్లడించాయి. హనామీ పండుగలో పాల్గొనడానికి ముందస్తు బుకింగ్‌లకు పర్యాటకులు క్యూ కడుతున్నారు. టోక్యోలో ప్రధాన కంపెనీలు దేశవిదేశాల్లోని తమ ప్రతినిధుల్ని చెర్రీ పిలిచి చెట్ల కిందే పార్టీలు చేసుకుంటాయి. అయితే ఈ చెట్లను ముందుగానే ప్రభుత్వం దగ్గర బుక్ చేసుకోవాల్సి ఉంటుంది! అలాగాక అప్పటికప్పుడు చెట్ల కింద పార్టీ చేసుకుందామంటే దొరకడం కష్టమే!! ఈ సీజన్‌లో జపాన్‌లో ఫుడ్ అండ్ బెవరేజెస్ కంపెనీల ఆదాయం ఓ రేంజ్‌లో ఉంటుంది. అవును మరి.. చెర్రీ అంటే ఏమనుకున్నారు. ఫ్లవర్ కాదు పవర్....!!

పార్లమెంటే అత్యుత్తమం: ఉపరాష్ట్రపతి

కొందరు విదేశాల్లో దేశంపై విషం చిమ్ముతున్నారంటూ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: దేశంలో పార్లమెంటే అత్యుత్తమమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తేల్చిచెప్పారు. రాజ్యాంగం మన పార్లమెంట్‌లోనే పురుడు పోసుకుందని గుర్తుచేశారు. రాజ్యాంగ రచనలో న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థ తదితరాల పాత్ర ఎంతమాత్రం లేదన్నారు. ప్రజల తీర్పును పార్లమెంట్ ప్రతిబింబిస్తుందని చెప్పారు. రాజ్యాంగ రూపశిల్పి పార్లమెంటేనని వివరించారు. తమిళనాడు మాజీ గవర్నర్ పీఎస్ రామ్మోహన్‌రావు జీవిత చరిత్ర గ్రంథాన్ని జగదీప్ ధన్‌ఖడ్ ఆదివారం పార్లమెంట్ ప్రాంగణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ధన్‌ఖడ్ మాట్లాడారు. సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకంపై కేంద్ర ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ నడుమ వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో జగదీప్ ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, దేశాభివృద్ధిని చూసి ఓర్వలేకే కొందరు విదేశాలకు వెళ్లి మన దేశంపై విషం చిమ్ముతున్నారని, మన ప్రజాస్వామ్యంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని ధన్‌ఖడ్ విమర్శించారు! అలాంటి వారికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఇటీవల బ్రిటన్‌లో చేసిన వ్యాఖ్యలపై ప్రస్తుతం పార్లమెంటులో దుమారం రేగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాహుల్ పేరు ప్రస్తావించకుండా ధన్‌ఖడ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

సల్మాన్ ఖాన్‌కు బెదిరింపు మెయిల్

ముంబై: బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ కార్యాలయానికి బెదిరింపు మెయిల్ రావడం కలకలం రేపింది. గ్యాంగ్ స్టర్ గోల్డీ బ్రార్ ఆయనతో ముఖాముఖి మాట్లాడాలని అనుకుంటున్నట్లుగా అందులో ఉంది. రోహిత్ గర్గ్ అనే ఐడీతో ఆ మెయిల్ ఉంది. శనివారం ఈ మేరకు అందిన ఫిర్యాదుపై గ్యాంగ్‌స్టర్లు లారెన్స్ బిష్ణోయ్, గోల్డీ బ్రార్, రోహిత్ అనే మరో వ్యక్తిపై ముంబైలోని బాంద్రా పోలీసులు కేసులు నమోదు చేశారు. బిష్ణోయ్ ప్రస్తుతం భటిండా జైలులో ఉన్నాడు. పంజాబీ సింగ్ సిద్ధూ మూసేవాలా హత్య కేసులో గోల్డీ బ్రార్ నిందితుడు. గత ఏడాది గుర్తు తెలియని వ్యక్తి నుంచి సల్మాన్‌కు బెదిరింపు లేఖ అందింది.

ఆక్రమిత మేరియుపోల్‌లో పుతిన్



కీవ్: ఉక్రెయిన్‌లోని ఆక్రమిత తీర ప్రాంత నగరం మేరియుపోల్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆకస్మికంగా పర్యటించారు. సెప్టెంబర్‌లో తమ సైన్యం ఈ నగరాన్ని స్వాధీనం చేసుకున్నాక పుతిన్ మొదటిసారిగా అక్కడికి వెళ్లారని రష్యా వార్తా సంస్థలు తెలిపాయి. హెలికాప్టర్‌లో అక్కడికి చేరుకున్న పుతిన్, సొంతంగా వాహనం నడుపుతూ నగరంలోని స్మారకప్రాంతాలను సందర్శించారు. పుతిన్ శనివారం మేరియుపోల్‌కు దగ్గర్లోనే ఉన్న క్రిమియాకూ వెళ్లారు.

ఈక్వెడార్, పెరూల్లో భూకంపం..14 మంది మృతి

క్విటో: ఈక్వెడార్–పెరూ సరిహద్దుల్లో శనివారం భారీ భూకంపం సంభవించింది. భవనాలు కూలిన ఘటనల్లో 14 మంది చనిపోయారు. మృతుల్లో 13 మంది ఈక్వెడార్‌కు, ఒకరు పెరూకు చెందిన వారు. మరో 126 మంది గాయపడినట్లు ఈక్వెడార్ అధికారులు చెప్పారు. మృతుల్లో 11 మంది ఎల్ ఒరోకు చెందిన వారేనన్నారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారి కోసం రక్షణ సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. పలు భవనాలు బీటలు వారాయి. విద్యుత్, టెలిఫోన్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. పసిఫిక్ తీరంలో ఈక్వెడార్ రెండో పెద్ద నగరం గుయాక్విల్ కేంద్రంగా ఉన్న ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.8గా నమోదైనట్లు అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది.



మత్స్య విలాపం

ఆస్ట్రేలియాలోని డార్లింగ్ నదిలో దృశ్యమిది. బ్రోకెన్‌హిల్ సమీపంలో ఇటీవల ఇలా ఏకంగా 10 లక్షలకు పైగా చేపలు చచ్చిపోయాయి. వీటిలో సున్నితమైన బోనీ హెర్రింగ్ సహా పలు రకాల చేపలున్నాయి. ఇందుకు వడగాలుల తీవ్రతే కారణమని అధికారులంటుంటే నీటి కాలుష్యమే ఉసురు తీసిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

లద్దాఖ్ మయూర్‌భంజ్ చలో

టైమ్ 'అద్భుత ప్రాంతాల జాబితాలో చోటు



న్యూఢిల్లీ: సమ్మర్ హాలీడేస్‌లో ఎక్కడికెళ్లాలి? పిల్లా పాపలతో కలిసి ఎక్కడికెళ్తే అన్నీ మర్చిపోయి హాయిగా ఎంజాయ్ చేస్తాం? పెద్దగా ఆలోచించకుండా లగేజ్ సర్దేసుకొని కశ్మీర్‌లోని లద్దాఖ్‌కో, ఒడిశాలో మయూర్‌భంజ్‌కు ప్రయాణమైపోవడమే! ఆ రెండే ఎందుకంటారా? ప్రఖ్యాత టైమ్ మ్యాగజైన్ ప్రపంచవ్యాప్తంగా అత్యంత అద్భుతమైన ప్రాంతాల జాబితా–2023లో మన దేశం నుంచి చోటు దక్కించుకున్న ప్రాంతాలు అవే మరి! అరుదైన పులులు, పురాతన ఆలయాలు, సాహసంతో కూడిన ప్రయాణం, ఆహా అనిపించే ఆహారం. ఇవన్నీ లద్దాఖ్, మయూర్‌భంజ్‌లకు 50 పర్యాటక ప్రాంతాలతో టైమ్స్ రూపొందించిన ఈ జాబితాలో చోటు కల్పించాయి. లద్దాఖ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అక్కడ అడుగు పెడితే స్వర్గమే తలవంచి భూమికి చేరిందా అనిపించక మానదు. ''మంచుకొండలు, టిబెటన్ బౌద్ధ సంస్కృతి కనువిందు చేస్తాయి. అక్కడి వాతావరణాన్ని ఫీల్ అవడానికి పదేపదే లద్దాఖ్ వెళ్లాలి'' అని టైమ్స్ కీర్తించింది. ''ఇక మయూర్‌భంజ్ అంటే పచ్చదనం. సాంస్కృతిక వైభవం, పురాతన ఆలయాలు, కళాకృతులకు ఆలవాలం. ప్రపంచంలో నల్ల పులి సంచరించే ఏకైక ప్రాంతం'' అంటూ కొనియాడింది. ఏటా ఏప్రిల్లో మయూర్‌భంజ్‌లో జరిగే 'చౌ' డ్యాన్స్ ఫెస్టివల్ అదనపు ఆకర్షణ. ఒడిశా సాంస్కృతిక వారసత్వంతో పాటు ఏకశిలా శాసనాలు గొప్పగా ఉంటాయని టైమ్స్ పేర్కొంది. జాబితాలో అత్యధిక శాతం అమెరికా ప్రాంతాలకే చోటు దక్కింది. టాంపా (ఫ్లోరిడా), విల్లామెట్ (ఒరెగాన్), టక్సాన్ (అరిజోనా), యోసెమైట్ నేషనల్ పార్క్ (కాలిఫోర్నియా) వంటివి వాటిలో ఉన్నాయి.

మోదీ చిరంజీవి

చైనా నెటిజన్లు ఫిదా



బీజింగ్: భారత్, చైనా మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. కానీ ప్రధాని మోదీకి మాత్రం చైనాలో ఫాలోయింగ్ మామూలుగా లేదు! ముఖ్యంగా నెటిజన్లయితే మోదీ పట్ల ఫిదా అవుతున్నారు. 'మోదీ లావోగ్జియన్' (మోదీ చిరంజీవి) అని ప్రేమగా పిలుచుకుంటున్నారు. ఒక విదేశీ నేత పట్ల చైనీయులు ఇంతటి గౌరవాదరాలు చూపడం అరుదు. 'మోదీ అద్భుతమైన నాయకుడు. విభిన్నంగా ఆలోచిస్తారు. భారత్‌ను చక్కగా ముందుకు తీసుకెళ్తున్నారు' అంటూ చైనా సోషల్ సైట్ సినావెబోలో నెటిజన్లు ఆకాశానికెత్తుతున్నారని అమెరికా మ్యాగజైన్ ది డిప్లొమేట్ పేర్కొంది. సినా వెబోకు 58 కోట్లకు పైగా యాక్టివ్ యూజర్లున్నారు.

సాక్షి
కరీంనగర్
సోమవారం । 20 । మార్చి । 2023



కోడెమొక్కులు.. తలనీలాలు

వేములవాడ: రాజన్నను ఆదివారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కల్యాణకట్టలో తలనీలాలు, ధర్మగుండంలో స్నానాలు చేసి కోడెమొక్కులు చెల్లించుకున్నారు.



రేషన్ షాపులు.. మినీ బ్యాంకులు!

త్వరలో రేషన్ దుకాణాలు మినీ బ్యాంకులుగా మరిపించనున్నాయి. ఇప్పటికే మినీ గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. 8లో▸

గరిష్టం/కనిష్టం
28.0/19.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముగిసిన అంగారిక టౌన్‌షిప్ ప్లాట్ల వేలం



వేలం పాడుతున్న అధికారులు

కరీంనగర్ అర్బన్: అంగారిక టౌన్‌షిప్ ప్లాట్ల వేలం ప్రక్రియ మూడు విడతలుగా జరగగా ఆదివారంతో ముగిసింది. మూడు రోజులుగా జరిగిన వేలంలో 154 ప్లాట్లకు రూ.42.71కోట్ల ఆదాయం వచ్చినట్లు కలెక్టర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. మూడో రోజు 60 ప్లాట్లకు గానూ 57 ప్లాట్లకు వేలం జరగగా రూ.15.91కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు వివరించారు. నగరంలోని వాసర గార్డెన్‌లో ఆదివారం జరిగిన ప్రత్యక్ష వేలంలో ఆశావహులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేలంలో చదరపు గజానికి అత్యధికంగా రూ.17,600 పలుకగా అతి తక్కువగా ధర రూ.6,000 పలికింది. మూడు రోజులు 157 ప్లాట్లకు వేలం వేయగా 154 అమ్మడం జరిగిందని కలెక్టర్ వివరించారు. అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్, ఆర్‌డీఓ ఆనంద్‌కుమార్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మధుసూదన్, తహసీల్దార్లు కోడం కనకయ్య, కోమల్‌రెడ్డి, నల్ల వెంకట్‌రెడ్డి, రాజీవ్ స్వగృహ ఏఈ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

‘ఛత్రపతి’కి ఉగాది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న శ్రీనివాస్

చొప్పదండి: పట్టణానికి చెందిన కవి, రచయిత తాళ్ళపల్లి ఛత్రపతి శ్రీనివాస్ ఆదివారం జాతీయ ఉగాది పురస్కారం అందుకున్నారు. ఆయన రచించిన విశ్వతేజం పుస్తకానికి కర్నాటక తెలుగు రచయితల సమాఖ్య, ఇండోనేషియా అకాడమీ, డీఆర్ అకాడమీ సంయుక్తంగా బెంగుళూరులో నిర్వహించిన జాతీయ ఉగాది అవార్డుల ప్రధానోత్సవంలో ఈ మేరకు ఛత్రపతికి పురస్కారం అందజేశారు. ఈ పుస్తకంలో ఉన్న విశ్వానికి సంబంధించిన అంశాలను సమాజానికి అందించాలని వక్తలు సూచించారు. ఈసందర్భంగా సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు తన వంతు కృషి చేస్తానని శ్రీనివాస్ పేర్కొన్నారు.

వ్యవసాయ విద్యార్థినుల క్షేత్ర పర్యటన



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

కొత్తపల్లి(కరీంనగర్): ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాల పొలాసకు చెందిన విద్యార్థినులు ఆదివారం జిల్లా ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం నాగులమల్యాల గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. పలు పంటల్లో రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రస్తుత వాతారణ పరిస్థితుల్లో వరిలో అగ్గితెగులు ఆశించే అవకాశం ఉన్నందున వాటి పట్ల అప్రమత్తంగా ఎలా ఉండాలి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. విద్యార్థినులు రీతునాథ్, సంధ్యన, సబూరా రానా, శ్రావణి, యోగితా తదితరులు పాల్గొన్నారు.

‘చలో ఢిల్లీ’ జయప్రదం చేయండి

కరీంనగర్: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న సీఐటీయు ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి అజయ్ పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో మజ్దూర్ కిసాన్ సంఘర్ష ర్యాలీ ‘చలో ఢిల్లీ’ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మిక చట్టాల రక్షణ, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరణ, ధరల పెరుగుదలను నియంత్రించడం తదితర డిమాండ్ల సాధనకు ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా నుంచి 100 మంది తరలివెళ్లనున్నట్లు తెలిపారు. ఎ.ముకుందరెడ్డి, రవి, నర్సింహా రెడ్డి, ముక్కెర బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ బ్రిడ్జి విశేషాలు

- 500 మీటర్ల పొడవైన రోడ్డు, నాలుగు వరుసల రహదారి.
- 26 పొడవైన స్టీల్ కేబుల్స్.. ఇటలీ నుంచి తెప్పించినవి.
- వంతెనకు 2 పైలాన్లు, రెండు పైలాన్ల మధ్య దూరం 220 మీటర్లు.
- పైలాన్ నుంచి ఇంటర్ మీడియస్‌కు దూరం 110 మీటర్లు.
- రూ.180 కోట్ల బడ్జెట్.. పూర్తిగా అధునాతన ఇంజినీరింగ్.
- రూ.8 కోట్లతో కొరియా డైనమిక్ లైటింగ్ సిస్టమ్.
- వెడల్పు 21.5 మీటర్లు, 7 మీటర్ల వెడల్పుతో రెండు దారులు.
- రోడ్డుకు ఇరువైపులా 2.5 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్‌లు.
- టాటా కంపెనీ సారథ్యంలో నిర్మాణం.
- 2017 డిసెంబరులో శంకుస్థాపన, 2018 ఫిబ్రవరిలో పనులు ప్రారంభం.
- 2023 జనవరి 26న వంతెనపై పనుల కోసం వాహనాలకు అనుమతి.
- 2023 ఏప్రిల్ 14న వంతెన ప్రారంభం.



దాదాపుగా పూర్తయిన తీగల వంతెన, ఇన్‌సెట్‌లో నాణ్యత లోడింగ్ పరీక్ష (ఫైల్)

తీగల వంతెనకు ముహూర్తం ఖరారు

ఏప్రిల్ 14న ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్

- వంతెన పరిసరాల్లో ఫుడ్, మ్యూజిక్, వినోదాత్మక స్టాల్స్
- ప్రతి ఆదివారం బ్రిడ్జిపై రాకపోకలు బంద్
- నగరవాసులు ఉల్లాసంగా గడిపేందుకే: మంత్రి గంగుల

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ సిగలో మరో మణిహారంగా నిలిచే తీగల వంతెన ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. వచ్చేనెల 14న వంతెన ప్రారంభించాలని ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. మున్సిపల్ మంత్రి కె.తారకరామారావు చేతుల మీదుగా వంతెనను ప్రారంభిస్తారని సమాచారం. వాస్తవానికి తీగల వంతెనను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభింపజేయాలని అంతా అనుకున్నారు. కానీ.. జాతీయ స్థాయిలో బీఆర్ఎస్ పార్టీ నిర్మాణం, సెక్రటేరియట్ పనుల కారణంగా ఆయన పర్యటన సాధ్యపడలేదని తెలిసింది. అందుకే మంత్రి గంగుల కమలాకర్ విజ్ఞప్తి మేరకు వంతెన ప్రారంభానికి స్వయంగా కేటీఆర్ రానున్నారని సమాచారం.

వేగంగా డైనమిక్.. అప్రోచ్ రోడ్డు పనులు

వరంగల్– కరీంనగర్ నగరాల మధ్య దాదాపు 7 కిలోమీటర్ల దూరం తగ్గించడం, హైదరాబాద్– కరీంనగర్ రహదారి మీద ట్రాఫిక్ జామ్ బెడద నివారణకు ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణానికి పూనుకుంది. 2018లో రూ.180 కోట్ల బడ్జెట్‌తో వంతెన పనులు ప్రారంభించింది. హైదరాబాద్‌లోని తీగల వంతెన తర్వాత రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న కేబుల్ బ్రిడ్జి ఇదే కావడం విశేషం. పూర్తిగా విదేశీ ఇంజినీరింగ్ సాంకేతికతతో ఏర్పాటు చేసిన ఈ బ్రిడ్జి నాణ్యతను ఇప్పటికే పలుమార్లు ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించారు. వచ్చేనెల 14న ప్రారంభ తేదీ ఖరారు కావడంతో ఇప్పటికే రూ.8కోట్లతో ఏర్పాటు చేస్తున్న డైనమిక్ లైటింగ్ సిస్టమ్ పనులు, సదాశివపల్లి నుంచి తీగలవంతెన వరకు, ఇటువైపు హౌజింగ్ బోర్డు వైపు కమాన్ వెళ్లే మార్గాన్ని కలిపే అప్రోచ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. పనుల కోసం సామగ్రిని తరలించేందుకు జనవరి 26 నుంచి తీగల వంతెనపైకి వాహనాలను కూడా అనుమతించారు.

ప్రతి ఆదివారం సెలవు..!

ఏప్రిల్ 14న ప్రారంభించిన అనంతరం వాహనాలను వంతెన మీదికి అనుమతిస్తారు. అయితే ప్రతి ఆదివారం మాత్రం వాహనాలను అనుమతించరు. వంతెనపై ఏర్పాటు చేసిన డైనమిక్ లైటింగ్‌ను ఆస్వాదించేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నారని సమాచారం. వంతెన నిర్వహణ బాధ్యతలు చూస్తున్న ఆర్అండ్‌బీ అధికారుల సమక్షంలోనే బ్రిడ్జిపై నగరవాసులకు ఉపయోగపడే ఫుడ్, వినోదాత్మక స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. సాయంత్రం పూట వెలుగుజిలుగుల మధ్య మిత్రులు, కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడిపేందుకు వీలుగా మ్యూజిక్, కొరియా సాంకేతికతతో డైనమిక్ లైటింగ్ సిస్టమ్, నాలుగు భారీ ఎల్ఈడీ తెరలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.



తుదిదశలో అప్రోచ్‌రోడ్డు పనులు

సీఎంకు కరీంనగర్ అంటే మమకారం



ఉద్యమ సమయం నుంచి సీఎం కేసీఆర్‌కు కరీంనగర్ అంటే ప్రత్యేక అభిమానం. అందుకే నిధుల కేటాయింపులో కరీంనగర్‌కు పెద్దపీట వేస్తారు. రూ.180 కోట్లతో తీగల వంతెన, రూ.410 కోట్లతో మానేరు రివర్‌ఫ్రంట్ మంజూరు చేశారు. ఇందులో తీగల వంతెనను ఏప్రిల్ 14న కేటీఆర్ జాతికి అంకితం చేస్తారు. నగరవాసులకు పూర్తిస్థాయిలో ఉల్లాసం, ఆహ్లాదం కలిగించేందుకు కొంతకాలంపాటు ప్రతి ఆదివారం తీగల వంతెనపై రాకపోకలు నిలిపివేస్తాం. నగరవాసులు సంతోషంగా గడిపేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. – గంగుల కమలాకర్, బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి

మతిభ్రమించిన మాటలు మానుకోండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

కరీంనగర్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీకి సంబంధించి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మతిభ్రమించిన మాటలు మానుకోవాలని, లీకేజీ విషయాలపై చిత్తశుద్ధి ఉంటే ఆరోపణలను రుజువు చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సూచించారు. ఆదివారం మీసేవ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో కేటీఆర్ పీఏ హస్తం ఉందని ఆరోపించడం సిగ్గుచేటన్నారు. చేతనైతే నిజాలను నిగ్గుతేల్చాలని సవాల్ విసిరారు. సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీని పథకం ప్రకారమే బదనం చేసే కుట్రలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కయ్యాయని దుయ్యబట్టారు. పేపర్ లీకేజీలో ఏ–2 నిందితుడైన రాజశేఖర్‌రెడ్డి బీజేపీ కార్యకర్త అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక లక్ష 30 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని, నియామకాల ప్రక్రియ కొనసాగుతుండగా పక్కా ప్రణాళికతో బీజేపీ, కాంగ్రెస్ ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడ్డాయని ఆరోపించారు. ఎంపీ సంజయ్ యువతను పక్కదారిపట్టిస్తూ రాజకీయ లబ్ధిపొందాలనే ఎత్తుగడలు మానుకొని బాధ్యతాయుత పాత్ర పోషించాలన్నారు. సిరిసిల్లకు చెందిన నిరుద్యోగి నవీన్ ఆత్మహత్యకు పాల్పడితే ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని, అసలు నవీన్ గ్రూప్–1 పరీక్షకు దరఖాస్తే చేయలేదని, పేపర్ లీకవ్వడంతో చనిపోయాడని శవ రాజకీయాలు చేయడం నీతిమాలిన చర్యగా అభివర్ణించారు. అనవసరపు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో గ్రంథాలయ స్థల చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాల లీక్ నిందితులను శిక్షించాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీకి నిరసనగా నగరంలోని తెలంగాణచౌక్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంత్రి కెటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, లక్షల మంది నిరుద్యోగులు వేలాది రూపాయలు కోచింగ్ సెంటర్లకు వెచ్చించి పరీక్షలకు సన్నద్ధమైతే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రశ్నపత్రాల లీకేజీకి కారణం నువ్వంటే నువ్వని యువతను అయోమయానికి గురిచేస్తూ ఆత్మస్థైర్యం దెబ్బతీస్తున్నారని అన్నారు. ప్రతీదానికి గొప్పలు చెప్పుకునే కేటీఆర్ లీకేజీ వ్యవహారంలో తప్పుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నిందితులను గుర్తించి శిక్షించాలని, నిరుద్యోగులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. సకలజనుల సమ్మె మాదిరి బీఆర్ఎస్ ప్రభుత్వంపై యువత ఉద్యమానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రవణ్‌నాయక్, సయ్యద్ అఖిల్, లింగంపల్లి బాబు, ఖంరొద్దీన్, గడ్డం విలాస్‌రెడ్డి, జీడీ రమేష్, పోరండ్ల రమేష్, ఎండీ చాంద్, షేక్ శేహెన్ష, మేకల నర్సయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకూ గుర్తింపునివ్వాలి

గంగాధర(చొప్పదండి): పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతీ కార్యకర్తకు గుర్తింపు నివ్వాలని బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య సూచించారు. మండలంలోని బూర్గుపల్లిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి సారయ్యతో పాటు జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణరావు, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హాజరై మాట్లాడారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనంలో గ్రామస్థాయి కార్యకర్త నుంచి ప్రతీ ఒక్కరు పాల్గొనేలా చూడాలన్నారు. గతంలో జరిగిన పొరపాట్లను గుర్తించి సరిదిద్దుకునేందుకు చక్కటి అవకాశమన్నారు. జనాభా ప్రాతిపదికన ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 24న గంగాధరలో, 27న రామడుగులో, 31న చొప్పదండిలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తామని వివరించారు. సమావేశంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఘనంగా పోచమ్మ బోనాలు

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని మక్తపల్లె, తిమ్మాపూర్‌లో ఆదివారం పోచమ్మ తల్లికి బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు నీలమ్మ, భాగ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ మాతంగి స్వరూప, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అకాలం.. ఆందోళన

- ఈదురుగాలి, రాళ్ల వానతో రైతుల హైరానా



బొమ్మనపల్లిలో నేలరాలిన వరిగింజలు



గొడిశాలలో గాలివానకు కూలిన రైస్ మిల్లు

హుజూరాబాద్‌రూరల్/మానకొండూర్/చిగురుమామిడి/సైదాపూర్: రెండురోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. పంటలు దెబ్బతింటుండడంతో కన్నీటిపర్యంతమవుతున్నారు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి హుజూరాబాద్ మండలం చెల్పూర్‌లో బండారి రమేశ్‌కు చెందిన రెండెరాల మొక్కజొన్న నేలవాలింది. దెబ్బతిన్న పంటలను ఆదివారం ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి పరిశీలించారు. రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ ఉన్నారు.

అధైర్యపడొద్దు

అకాల వర్షాలతో రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని ఊటూరు, కెల్లెడ, పోచంపల్లి, మద్దికుంట గ్రామాల్లో 250 ఎకరాల్లో మొక్కజొన్నకు నష్టం వాటిల్లిందని, నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల పోచంపల్లికి కోమల్ల మహేశ్వరి కుక్కకాటుతో మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బొమ్మనపల్లి, ఉల్లంపల్లిలో వడగండ్ల వర్షం

చిగురుమామిడి మండలం రేకొండ, బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, నవాబుపేట్, ఇందుర్తి తదితర గ్రామాల్లో ఈదురుగాలులు, వడగళ్ల వర్షానికి వరి, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోతకు వచ్చిన వరి పంట నేలకొరగగా, వడ్లు రాలిపోయాయి. దాదాపు 100 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు.

లేచిపోయిన రేకుల షెడ్డు

సైదాపూర్ మండలం రాయికల్ తండా, జాగీర్‌పల్లి, వెన్కెపల్లి, ఎగ్లాస్‌పూర్, బొమ్మకల్, రాయికల్, ఘనపూర్ గ్రామాల్లో మొక్కజొన్న చేన్లు పూర్తిగా నేలకొరిగాయి. గొడిశాలలో వాయుపుత్ర రైస్ మిల్ ఒక పక్క రేకుల షెడ్డు గాలికి లేచిపోయింది. వ్యవసాయాధికారులు పంట నష్టం అంచనాలను ప్రభుత్వానికి నివేదించాలని కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు చాడ కొండాల్‌రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సంది రవీందర్‌రెడ్డి కోరారు.

జిల్లావ్యాప్తంగా 14,308 ఎకరాల్లో నష్టం

కరీంనగర్‌అర్బన్: అకాల వాన విరుచుకుపడటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజులుగా జిల్లావ్యాప్తంగా రాళ్లవాన కురియగా అపార నష్టం వాటిల్లింది. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రాథమిక అంచనా వేస్తున్నారు. కరీంనగర్ అర్బన్, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, చొప్పదండి మండలాలు మినహా అన్ని మండలాల్లో పంట నష్టం జరిగింది. మొత్తంగా 14,308 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. వరి 7,128, మొక్కజొన్న 7,180 ఎకరాల్లో నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశామని జిల్లా వ్యవసాయ అధికారి వాసిరెడ్డి శ్రీధర్ వివరించారు. రామడుగు, గంగాధర, వీణవంక, సైదాపూర్, చిగురుమామిడి, హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, తిమ్మాపూర్, శంకరపట్నం, గన్నేరువరం, మానకొండూరు మండలాల్లో అత్యధికంగా పంటలకు నష్టం వాటిల్లింది.

జమ్మికుంటలో అత్యధికం.. చొప్పదండిలో అత్యల్పం

శని, ఆదివారాల్లో జిల్లావ్యాప్తంగా అకాల వాన దంచికొట్టింది. జమ్మికుంటలో 7.7 సెం.మీ వర్షపాతం నమోదైంది. చొప్పదండిలో 1.7సెం.మీ వర్షపాతం నమోదవగా శంకరపట్నంలో 7.6, సైదాపూర్ 7.2, హుజూరాబాద్ 7.1, చిగురుమామిడి 6.3, వీణవంక 4.8, తిమ్మాపూర్ 4.4, గంగాధర 3.4, రామడుగు 2.5, కరీంనగర్, మానకొండూరు 2.4 సెం.మీల వర్షపాతం నమోదైంది.

విద్యుత్ శాఖకు రూ.3 లక్షల నష్టం

కొత్తపల్లి(కరీంనగర్): ఈదురుగాలులతో కూడిన అకాల వర్షానికి జిల్లావ్యాప్తంగా రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ గంగాధర్ తెలిపారు. 42 స్తంభాలు ధ్వంసంకాగా, 2 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినట్లు చెప్పారు. కాగా విద్యుత్ సిబ్బంది ఎప్పటికప్పుడు విద్యుత్ అంతరాయాలను సరిచేస్తూ సరఫరాను అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

చొప్పదండిలో వడగండ్ల బీభత్సం

చొప్పదండి: చొప్పదండి నియోజకవర్గంలో ఆదివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. కొడిమ్యాల మండలం నుంచి గంగాధర మండలం వెంకటాయపల్లి, నర్సింహులపల్లి, సర్వారెడ్డిపల్లి, రామడుగు మండలం లక్ష్మీపూర్, రాంచంద్రాపూర్, వెంకట్‌రావుపల్లి, చొప్పదండి మండలం గుమ్లాపూర్, మంగళపల్లి, చొప్పదండి, భూపాలపట్నం, వెదురుగట్టు మీదుగా ఎలిగేడు మండలం లాలపల్లి వరకు వడగళ్ల వాన ఒక బెల్టులా వెళ్తూ కుప్పలు కుప్పలుగా రాళ్లు పడటంతో రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. వరి, మొక్కజొన్న, మామిడి తోటలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. నష్టపోయిన రైతుల పంటల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు నమోదు చేయాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. రైతులు అధైర్యపడవద్దన్నారు.



రామడుగులో వడగండ్ల వర్షం

మానకొండూర్: నేలవాలిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న అధికారులు



దెబ్బతిన్న పంటల పరిశీలన

రామడుగు/మానకొండూర్/జమ్మికుంట/చొప్పదండి/కరీంనగర్‌రూరల్: రామడుగు మండలం వెదిరలో దెబ్బతిన్న పంటలను డీఏవో శ్రీధర్ ఆదివారం పరిశీలించారు. అలాగే మానకొండూర్ మండలం కెల్లెడ, వేగురుపల్లి, ఊటూరు, మద్దికుంట, పచ్చునూర్, కొండపల్కల గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏఈవోలు పరిశీలించి వివరాలు సేకరించారు. జమ్మికుంట మండలంలో సుమారు 1,400 ఎకరాల్లో మొక్కజొన్న నేలవాలినట్లు ప్రాథమిక అంచన వేశామని వ్యవసాయ అధికారి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. చొప్పదండి మండలంలో నష్టపోయిన పంటలను ఎంపీపీ చిలుక రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, ఏవో వంశీక్రిష్ణ పరిశీలించారు. కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లో ఉద్యాన అధికారి స్వాతి పర్యటించి దాదాపు 60 ఎకరాల్లో నష్టం జరిగినట్లు ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



పూజలు చేస్తున్న ఉదయానందన్‌రెడ్డి

వీణవంక(హుజూరాబాద్‌): మండల కేంద్రం లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ట్యూరిటో సీఈవో పాడి ఉదయానందన్‌రెడ్డి ఆదివారం పూజలు చేశారు. అనంతరం కల్వల శివారులోని బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. వీణవంక గ్రామానికి చెందిన 108 ఉద్యోగి ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దాసారపు ప్రభాకర్‌, మాజీ సర్పంచు చిన్నాల ఐలయ్య, కో–ఆప్షన్‌ మెంబర్‌ హమీద్‌, నాయకులు మజర్‌, నభూ, ఖలీమ్‌, సమ్మిరెడ్డి, వెన్నంపల్లి నారాయణ, అమృత ప్రభాకర్‌, సమిల్ల చిట్టి తదితరులున్నారు.

పశుమిత్ర వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా కమిటీ



లలిత



ప్రభ



అనూష

కరీంనగర్‌: పశుమిత్ర వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా కమిటీని 13 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్‌ తెలిపారు. అధ్యక్షురాలిగా జాడి లలిత, ప్రధాన కార్యదర్శిగా పెండ్యాల ప్రభ, కోశాధికారిగా జె.అనూష, ఉపాధ్యక్షురాళ్లుగా మచ్చ జ్యోతి, లక్ష్మి, బి.అనూష, సహాయ కార్యదర్శులుగా శిరీష, మనీషా, కమిటీ సభ్యులుగా రేణుక, అంజలి, జ్ఞానేశ్వరి, స్వప్నలు ఎన్నికయ్యారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న పశుమిత్రులను ఐక్యం చేసి, కనీస వేతనం నిర్ణయించేవరకు ఉద్యమిస్తామని నూతన కమిటీ తెలిపింది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

గంభీరావుపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్‌ కో కన్వీనర్‌ మారవేని రంజిత్‌కుమార్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కేటీఆర్‌ స్పందించకపోతే భవిష్యత్‌లో విద్యార్థుల నుంచి వ్యతిరేకత ఎదుర్కోవడం ఖాయమన్నారు. మారుమూల ప్రాంత విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కళాశాల ఏర్పాటుకు కృషిచేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కన్వీనర్‌ నాగరాజు, ఆదిత్య అరవింద్‌, రాకేష్‌, సిద్ధు, నిఖిల్‌, శివ రాజేందర్‌, అజయ్‌, నరేశ్‌, అరుణ్‌, భరత్‌, వంశీ, ప్రవీణ్‌, ఈశ్వర్‌, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌ షాపులు ఇక మినీ బ్యాంకులు

- అన్నీ అనుకున్నట్లు జరిగితే త్వరలోనే అమలులోకి
- డీలర్లకు అవగాహన తరగతులు నిర్వహించేందుకు ఐపీపీబీ కసరత్తు
- జిల్లాలో 487 దుకాణాలు



రేషన్‌ దుకాణంలో లబ్ధిదారులకు సరుకులు ఇస్తున్న డీలర్‌ (ఫైల్‌)

కరీంనగర్‌ అర్బన్‌: అన్నీ అనుకున్నట్లు జరిగితే త్వరలో రేషన్‌ దుకాణాలు మినీ బ్యాంకులను మరిపించనున్నాయి. రేషన్‌ డీలర్లకు వేతనం లేకపోగా వచ్చే అరకొర కమీషన్‌తోనే బతుకు వెళ్లదీయాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో దుకాణాలను ఆదాయ వనరులుగా మలచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే మినీ గ్యాస్‌ సిలిండర్లు పంపిణీ చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. తాజాగా మినీ బ్యాంకు తరహాలో సేవలందించేందుకు చర్యలు తీసుకుంటోంది. తపాలా శాఖ ఐపీపీబీ (ఇండియన్‌ పోస్టల్‌ పేమెంట్‌ బ్యాంకు) రేషన్‌ దుకాణాల ద్వారా పౌర సేవలు విస్తరించనుంది. ఇందుకోసం ఆసక్తి కలిగిన డీలర్లను బ్యాంకు ప్రతినిధులుగా నియమించుకోనుంది. ఈ నేపథ్యంలో కరీంనగర్‌ జిల్లావ్యాప్తంగా మండలాల వారీగా డీలర్లకు అవగాహన తరగతులు నిర్వహించనున్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో నేరుగా బ్యాంకు సేవలు పొందడానికి అవకాశం కలగనుండగా నగదు లావాదేవీలు, వివిధ రకాల బిల్లుల చెల్లింపులు సులువుగా నిర్వహించుకునే వీలుంటుంది. జిల్లాలోని డీలర్లందరికి అవగాహన కల్పించిన తదుపరి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

డిజిటల్‌, నగదు లావాదేవీలు..

డీలర్ల సెల్‌ఫోన్‌లో ఐపీపీబీ యాప్‌ను ఇన్‌స్టాల్‌ చేస్తారు. దీని ద్వారా రూ.10 వేల వరకు నగదు, డిజిటల్‌ లావాదేవీలు నిర్వహించుకునే అవకాశం ఉంది. విద్యుత్‌, కుళాయి, ఫోన్‌ బిల్లుల వంటివి చెల్లించవచ్చు. డిజిటల్‌ ఖాతా తెరిచి, లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. ఇందుకుగాను డీలర్లకు ప్రతీ లావాదేవీకి రూ.4, నెలకు రూ.5 లక్షలు దాటితే రూ.11 చొప్పున కమీషన్‌ చెల్లిస్తారు. బ్యాంకులు లేని గ్రామీణ ప్రాంతాలకు ఇలాంటి సేవల అవసరం చాలా ఉంది. డీలర్లు కూడా నెలలో 15 రోజులపాటు ఖాళీగా ఉంటారు. ఆ సమయంలో ఐపీపీబీ సేవలను ప్రజలకు చేరువగా తీసుకెళ్లొచ్చు. గ్రామీణులు పట్టణాల్లోని బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

జిల్లాలో 441 మంది డీలర్లు

జిల్లావ్యాప్తంగా 487 రేషన్‌ దుకాణాలు ఉన్నాయి. ప్రస్తుతం 441 మంది డీలర్లు పని చేస్తున్నారు. తపాలాశాఖ ఐపీపీబీ సేవలు విస్తరించే క్రమంలో వీరిని బ్యాంకు మిత్రలుగా నియమించుకునే అవకాశం ఉంది. స్మార్ట్‌ఫోన్‌ వాడకంపై అవగాహన ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అవగాహన కార్యక్రమాలు త్వరలో నిర్వహిస్తామని తపాలా, పౌరసరఫరాల శాఖల అధికారులు తెలిపారు. లావాదేవీలు నిర్వహిస్తే కమీషన్‌ రూపంలో ఆదాయం సమకూరుతుందని చెబుతున్నారు.

నేటి కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్‌: జిల్లాలో సోమవారం నిర్వహించే కంటి వెలుగు శిబిరాల వివరాలను డీఎంహెచ్‌వో జువేరియా ప్రకటించారు. కరీంనగర్‌ నగరంలో 1,6,8,12,15,18,41, 45,46,49,53,56 డివిజన్‌లలో, హుజురాబాద్‌ పట్టణం 4,16వ వార్డుల్లో, అదే మండలం కాట్రపల్లి, సిరసపల్లిలో శిబిరాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. జమ్మికుంట పట్టణం 10వ వార్డు, అదే మండలం నాగంపేట, మడిపల్లి, వీణవంక మండలం ఎలబాక, కొండపాక, కనపర్తి, చిగురుమామిడి మండలం రేకొండ, ఇందుర్తి, చొప్పదండి పట్టణం11వ వార్డు, అదే మండలం కాట్నేపల్లి, రాగంపేట, ఇల్లందకుంట మండలంలోని మల్లన్నపల్లి, మల్యాల, గంగాధర మండలంలోని గర్శకుర్తి, ఇస్లాంపూర్‌, ఉప్పర మల్యాల, రామడుగు మండలంలోని దేశరాజ్‌పల్లి, వన్నారం, కొత్తపల్లి మండలంలోని బొమ్మకల్‌, కమాన్‌పూర్‌, కరీంనగర్‌రూరల్‌ మండలంలోని మొగ్దుంపూర్‌, నగునూర్‌, మానకొండూరు మండలంలోని ముంజపల్లి, కొండపల్కల, పచ్చునూర్‌, సైదాపూర్‌ మండలంలోని దుద్దెనపల్లి, అమ్మనగుర్తి, కేశవపట్నం మండలంలోని ఎరడపల్లి, లింగాపూర్‌, తిమ్మాపూర్‌ మండలంలోని నుస్తులాపూర్‌, బాలయ్యపల్లి, గన్నేరువరం మండలంలోని హనుమాజిపల్లిలో కంటి వెలుగు బృందాలు పనిచేస్తాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో కోరారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి



అభివాదం చేస్తున్న నాయకులు

జ్యోతినగర్‌(రామగుండం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ప్రదీప్‌, రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీనివాస్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని టీవీ గార్డెన్స్‌లో ఐఎఫ్‌టీయూ పెద్దపల్లి జిల్లా 8వ మహాసభల్లో భాగంగా నిర్వహించిన ప్రతినిధుల సభలో మాట్లాడారు. ప్రభుత్వ రంగం పూర్తిగా కార్పొరేట్‌ శక్తుల చేతుల్లోకి వెళ్లిందన్నారు. 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా తీసుకురావడంతో కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. పరిశ్రమల్లో అమలులో ఉన్న ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా ఎత్తివేశారని తెలిపారు. దేశంలోని కార్మిక సంఘాలు, ట్రేడ్‌ యూనియన్లు ఐక్యంగా ఉద్యమిస్తున్నాయని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని మండిపడ్డారు. అనేక ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగులను పక్కనబెట్టి, కాంట్రాక్ట్‌ వర్కర్లతో పనులు చేయిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి నరేష్‌ జెండావిష్కరణ చేశారు. సభకు అధ్యక్ష వర్గంగా నరేష్‌, అశోక్‌, చిలుక శంకర్‌లు వ్యవహరించగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.వెంకన్న అమరుల సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. వివిధ రంగాల నుంచి 250 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. సీపీఐ(ఎంఎల్‌) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రాజన్న, రాష్ట్ర కార్యదర్శి ఐ.కృష్ణ, నాయకులు వెంకన్న, మొగిలి, బుచ్చయ్య, బుచ్చమ్మ, జ్యోతి తదితరులున్నారు.

లోకో రన్నింగ్‌ స్టాఫ్‌ సమస్యలు పరిష్కరించాలి

- మజ్దూర్‌ యూనియన్‌ డివిజనల్‌ ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి రవీందర్‌
- నేడు దేశవ్యాప్త నిరసనలు



లోకో ఆర్‌వోహెచ్‌ షెడ్‌

రామగుండం: దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రైల్వే లోకో రన్నింగ్‌ స్టాఫ్‌ సమస్యల పరిష్కారానికి సోమవారం రైల్వేస్టేషన్లలోని క్రూ లాబీ కార్యాలయాల ఎదుట నిరసన తెలపనున్నట్లు సికింద్రాబాద్‌ డివిజనల్‌ ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి రవీందర్‌ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం రామగుండం రైల్వేస్టేషన్‌ ప్రాంగణంలోని మజ్దూర్‌ యూనియన్‌ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రైల్వేబోర్డు/జోనల్‌ అధికారులు రన్నింగ్‌ స్టాఫ్‌ను కట్టుబానిసలుగా భావిస్తూ కార్మిక వ్యతిరేక ఉత్తర్వులతో మనోవేదనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రన్నింగ్‌ రూంలో తమ కుటుంబసభ్యులతో కూడా ఫోన్‌ మాట్లాడకుండా మొబైల్స్‌ డిపాజిట్‌ చేయాలనే నిబంధన ఎత్తివేయాలన్నారు. అధిక పని భారాన్ని తగ్గించి, నిబంధనల మేరకు పని గంటలు ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్‌ చేశారు. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, 36 గంటల్లోగా లోకో పైలట్‌, గార్డు హెడ్‌క్వార్టర్‌కు చేరుకునేలా చూడాలన్నారు. మహిళా లోకో పైలట్లకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, ప్యాసింజర్‌, ఎక్స్‌ప్రెస్‌ లోకో పైలట్లకు 6 గంటలకు మించి పని గంటలు ఉండొద్దన్నారు. రన్నింగ్‌ స్టాఫ్‌ పనిచేసే బీట్‌లను నిర్ధారించి, అమలు జరిగేలా చూడాలని, పదోన్నతులు త్వరితగతిన అమలు చేయాలని, లైన్‌ బాక్స్‌లను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. నిరసన కార్యక్రమానికి సిబ్బంది తమ కుటుంబసభ్యులతో హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

కోనరావుపేట(వేములవాడ): ధర్మారం ప్రాథమిక పాఠశాలలో నిధుల దుర్వినియోగం జరిగిందని ఎస్‌ఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సామగ్రి, ఇతర వస్తువులు కొనుగోలు చేసేందుకు 2022–23 విద్యాసంవత్సరానికి గాను రూ.30 వేలు మంజూరయ్యాయి. ఎస్‌ఎంసీ చైర్మన్‌, ప్రధానోపాధ్యాయులకు జాయింట్‌ చెక్‌ పవర్‌ ఉండడంతో డబ్బులు డ్రా చేశారు. డబ్బులను తీసుకున్న ప్రధానోపాధ్యాయురాలు సామగ్రి వివరాలను తెలుపకపోవడంతో పాఠశాల స్థాయి సమావేశంలో ఎస్‌ఎంసీ చైర్మన్‌, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నించారు. పలు సమావేశాల్లో ఇదే విషయంలో వాగ్వాదం జరుగుతుండడంతో ఎంఈవో, డీఈవోకు సైతం ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ఎంఈవో దూస రఘుపతిని వివరణ కోరగా ఇప్పటివరకు లిఖితపూర్వక ఫిర్యాదు రాలేదని, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

కలప పట్టివేత

మేడిపెల్లి(జగిత్యాల): భీమారం మండలంలోని మన్నెగూడెంలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను అటవీ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. రూ.5 లక్షల విలువగల టేకు కలపను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ ఎఫ్‌ఆర్వో రవికుమార్‌, బీట్‌ ఆఫీసర్‌ ప్రదీప్‌ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

సారంగాపూర్‌(జగిత్యాల): రేచపల్లిలో తాటిచెట్టుపై నుంచి పడి రంగు శంకరయ్య అనే గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరయ్య రోజూ మాదిరిగానే కల్లు గీసేందుకు ఆదివారం తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకు జారి కిందపడిపోయాడు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలుకాగా కుటుంబీకులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ధర్మపురిలో ఇద్దరికి..

ధర్మపురి : ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ధర్మపురి పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్‌ బంకు వద్ద శనివారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు అతివేగంగా వచ్చి, ఎదురెదురుగా ఢీకొన్నా యి. ఈ ఘటనలో తపత్‌ మహేందర్‌, కాస నర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించగా చికిత్స నిమి త్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బీజేపీ నాయకుడి అరెస్టు

జగిత్యాలక్రైం : జిల్లా కేంద్రంలోని కలెక్టర్‌ కార్యాలయం ఎదుట శనివారం బీజేపీ ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీని నిరసిస్తూ ధర్నా చేపట్టారు. ధర్నాలో బీజేపీ నియోజకవర్గం నాయకుడు పన్నాల తిరుపతి రెడ్డి పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు పోలీస్‌ వాహనంపై ఎక్కి దురుసుగా ప్రవర్తించడంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసునమోదు చేశారు. తిరుపతి రెడ్డిని ఆదివారం పట్టణ పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు.

ముగిసిన ఆల్‌ ఇండియా సెమ్స్‌ ఒలింపియాడ్‌



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించిన అనంతరెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్‌): సెమ్స్‌ ఒలింపియాడ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌ పద్మనగర్‌లోని మానేరు సెంట్రల్‌ స్కూల్‌లో నిర్వహించిన ఆల్‌ ఇండియా సెమ్స్‌ ఒలింపియాడ్‌ లెవెల్‌–2 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా వ్యాప్తంగా లెవెల్‌–1 పరీక్షలో అర్హత సాధించిన 130 మంది విద్యార్థులు హాజరయ్యారు. అంతకుముందు పరీక్షా కేంద్రాన్ని మానేరు విద్యాసంస్థల అధినేత కదారి అనంతరెడ్డి పరిశీలించారు. దేశవ్యాప్తంగా సెమ్స్‌ ఒలింపియాడ్‌ పరీక్ష ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతోందన్నారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులందరూ ఇలాంటి పరీక్షలకు హాజరై, పోటీ ప్రపంచంలో వస్తున్న అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఏవో సుభాష్‌కుమార్‌, సిలివేరి మహేందర్‌, భూపతి, శాంతి, శిరీష, జహారా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

షర్మిలను కలిసిన వైఎస్సార్‌టీపీ జిల్లా నాయకులు



షర్మిలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కుమార్‌

కొత్తపల్లి(కరీంనగర్‌): సిరిసిల్లలో ఆత్మహత్య చేసుకున్న నిరుద్యోగి నవీన్‌ కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆదివారం వైస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్‌.షర్మిల వచ్చారు. ఆమెను జిల్లాకు చెందిన పార్టీ నాయకులు కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పార్టీని పటిష్ట పరచాలని సూచించారని జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కుమార్‌ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్‌ నగేశ్‌, నాయకులు కంది వెంకటరమణారెడ్డి, వరాల శ్రీనివాస్‌, డాక్టర్‌ శివరాం, పి.శ్రీనివాస్‌, రవీందర్‌రెడ్డి, రాజ్‌కుమార్‌ వర్మ, సత్యరాజ్‌వర్మ, నీరజాదేవరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాల పట్టాలిచ్చేవరకూ పోరాటం ఆగదు



మాట్లాడుతున్న కుమారస్వామి

గోదావరిఖని(రామగుండం): పోలీసులు రాత్రి పూట జెండాలు తీసేసినంత మాత్రాన భూపోరాటం ఆగదని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల కుమారస్వామి అన్నారు. పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భూపోరాటం ఆదివారం రెండోరోజుకు చేరింది. వందలాది మంది నిరుపేదలు గుడిసెలు వేసుకోవడానికి చెట్లు కొట్టి, జెండాలు పాతారన్నారు. పోలీసులు రాత్రిపూట వచ్చి, వాటిని తొలగించారని తెలిపారు. కబ్జాదారుల నుంచి భూములను కాపాడాల్సిన వారు ఆ పని చేయకుండా పేదలు వేసుకున్న జెండాలు తీసివేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వానికి చేతనైతే కబ్జాదారుల నుంచి ప్రభుత్వ స్థలాలు కాపాడాలన్నారు. నిరుపేదలకు ఇళ్లస్థలాల పట్టాలిచ్చేవరకూ తమ పోరాటం ఆగదని తేల్చిచెప్పారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎ.మహేశ్వరి, జిల్లా కమిటీ సభ్యులు మెండె శ్రీనివాస్‌, లావణ్య, నాయకులు ఫైము ద, పీర్‌ మహమ్మద్‌, నాగమణి, లలిత, ఓదెలు, గోపాల్‌, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు కేటాయించండి



మాట్లాడుతున్న యాకయ్య

జ్యోతినగర్‌(రామగుండం): రామగుండం కార్పొరేషన్‌ పరిధిలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని, నిరుపేదల ఇళ్ల కోసం కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య డిమాండ్‌ చేశారు. ఆదివారం రెండో డివిజన్‌ ఇందిరమ్మ కాలనీలోని ప్రభుత్వ భూమిలో జెండాలను పాతారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు నిరుపేదలందరికీ డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తామని చెప్పి, పదేళ్లవుతున్నా ఇవ్వలేదన్నారు. కబ్జాదారుల నుంచి భూమిని రక్షించేందుకు రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.రామాచారి, జిల్లా కమిటీ సభ్యుడు నాంసాని శంకర్‌, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి, మహేశ్వరి, లావణ్య, నాయకులు అక్కపాక శంకర్‌, సాంబయ్య, దేవేంద్ర, ఉపేందర్‌, రమణ, శ్రీనివాస్‌, కృష్ణారెడ్డి, సంపత్‌, వేణు తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదమే ప్రాణాలు తీసింది



రోదిస్తున్న మృతుడి భార్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఓ రైతు తన పేరిట భూమి రిజిస్ట్రేషన్‌ చేసే విషయంలో తల్లి దండ్రులు అంగీకరించడం లేదని మనస్తాపంతో పురుగులమందు తాగగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ సంఘటన స్థానికంగా విషాదం నింపింది. జన్మనిచ్చిన తల్లిదండ్రులే భూమి ఇవ్వడంలో వివాదంగా వ్యవహరించడంతో తన భర్త మనోవేదనకు గురై క్రిమిసంహారక మందు తాగాడని మృతుని భార్య మానస ఆరోపించింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డిపేటకు కేంద్రానికి చెందిన బింగి సురేశ్‌(35) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో రెండు ఎకరాల భూమిని తన పేరిట చేయాలని కోరాడు. తల్లిదండ్రులు నిరాకరించడంతో ఆవేదనకు లోనైన సురేశ్‌ కిష్టంపల్లి శివారులో గత శుక్రవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. సురేశ్‌ తండ్రి లచ్చయ్యకు ముగ్గురు కొడుకులు కాగా.. రెండో కుమారుడు అనారోగ్యంతో మృతిచెందాడు. తన భర్త మృతితో తాము రోడ్డున పడ్డామని భార్య మానస విలపించింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌ఆర్‌ఐ పాలసీ అమలు చేయాలి


- బీజేపీ యూఏఈ కో–కన్వీనర్‌ పెనుకుల అశోక్‌



ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అశోక్‌, నాయకులు

మల్లాపూర్‌(కోరుట్ల) : గల్ఫ్‌ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎన్‌ఆర్‌ఐ పాలసీ ఏర్పాటు చేయాలని బీజేపీ యూఏఈ కో–కన్వీనర్‌ పెనుకుల అశోక్‌ కోరారు. ఆదివారం దుబాయిలో బీజేపీ యూఏఈ శాఖ ఆధ్వర్యంలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఉపాధి కోసం ఏడారి దేశాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అమాయక కార్మికులు నకిలీ ఏజెంట్ల చేతుల్లో మోసపోతున్నారని, గల్ఫ్‌ దేశాలకు వలస వచ్చి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి గల్ఫ్‌ బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలని పేర్కొన్నారు. వలసజీవుల వెతలు తీరాలంటే కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఐ పాలసీని ప్రకటించాలన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే గల్ఫ్‌ కార్మికుల విన్నపాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఎన్‌ఆర్‌ఐ పాలసీపై ప్రభుత్వం ప్రకటన చేయాలని అసెంబ్లీలో లేవనెత్తుతాని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో యూఏఈ బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేతకాని మహర్‌లు అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌

గోదావరిఖని(రామగుండం): నేతకాని మహర్‌ ప్రజల హక్కుల రక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని నేతకాని మహర్‌ కుల హక్కుల పరిరక్షణ సంఘం జాతీయ అధ్యక్షుడు గోమాస శ్రీనివాస్‌ అన్నారు. ఆదివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నేతకాని మహర్‌ సామాజికవర్గానికి చెందినవారు రాష్ట్రంలో 15 లక్షల మందికి పైగా ఉన్నారని తెలిపారు. వీరందరూ రాజకీయంగా, విద్య, ఉద్యోగ, ఆర్థికపరంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం పలు అంశాలపై తీర్మానం చేశారు. పెద్దపల్లి పార్లమెంట్‌తోపాటు నాలుగు అసెంబ్లీ స్థానాలు నేతకాని మహర్‌ సామాజికవర్గానికి కేటాయించాలని కోరారు. అటవీ ప్రాంతంలో నివసిస్తున్న నేతకాని గిరిజనేతరులకు పోడు భూములకు భూయాజమాన్య హక్కు పత్రాలు ఇచ్చి, క్రయవిక్రయాలు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేసి, అసైన్డ్‌, పోరంబోకు, ఇనాం భూములు కలిగిన ఎస్సీలందరికీ భూయాజమాన్య హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. సింగరేణి భూ నిర్వాసితులకు కనీస వసతులతోపాటు ఇంటికో ఉద్యోగం కల్పించాలన్నారు. నాయకులు జవ్వాజి తిరుపతి, దుర్గం ఎల్లయ్య, రత్నం ప్రదీప్‌, నాగరాజు, అంతర్గాం రాజమౌళి, ఇప్పుల గంగారాం, హెచ్‌ఎంఎస్‌ నాయకులు రియాజ్‌ అహ్మద్‌ తదితరులున్నారు.

క్లుప్తంగా

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కరీంనగర్: నగరంలోని తెలంగాణచౌక్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు జీఎస్ ఆనంద్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్‌పై, మంత్రులపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ అక్బర్, ఎండీ ఫహెద్, కొలిపాక శ్రీనివాస్, వెంకటేష్, రమేశ్, గంగిపల్లి సతీశ్, అజ్మత్, నవాజ్, కిరణ్ పాల్గొన్నారు.

పరీక్షా ప్యాడ్లు పంపిణీ


పరీక్షా ప్యాడ్లు అందజేస్తున్న సభ్యులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం ఇరుకుల్ల, దుర్శేడ్ గ్రామాల్లోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు ఆదివారం తాండ్ర అంజన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వాలీబాల్, పరీక్షా ప్యాడ్లు, జీకే బుక్స్ పంపిణీ చేశారు. అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు చదువుకోవాలని ట్రస్టు చైర్మన్ తాండ్ర మధూకర్ కోరారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మీసాల సురేశ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని సన్మానించిన కురుమ సంఘం నాయకులు



కరీంనగర్: ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్‌విప్ భాను ప్రసాద్‌రావును ఆదివారం జిల్లా కురుమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు మీస బీరయ్య మాట్లాడుతూ కురుమ సంఘ భవన నిర్మాణానికి అవసరమైన నిధులపై మాట్లాడగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సంఘం నాయకులు కడారి అయిలయ్య, లచ్చయ్య, అశోక్, రాజు, రఘునందన్, మేకల నర్సయ్య, ధర్మయ్య, శ్రీనివాస్, విజయ్‌కుమార్, వీరయ్య, బీరయ్య, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

'పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

కరీంనగర్: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శుక్ర, శనివారాల్లో జమ్మికుంట, హుజూరాబాద్, కొత్తపల్లి, కరీంనగర్‌రూరల్ తదితర మండలాల్లో వడగండ్ల కురిసిన వర్షంతో పెద్ద ఎత్తున పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. ముఖ్యంగా మొక్కజొన్న, వరి, కూరగాయల పంటలకు నష్టం ఏర్పడిందని తెలిపారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని అన్నారు. ఆరుగాలం కష్టించి పనిచేసి పంట చేతికొచ్చే ముందు ప్రకృతి వైపరీత్యాలతో పెద్ద ఎత్తున రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. నష్టపోయిన రైతాంగానికి వరికి ఎకరానికి రూ.40వేలు, మొక్కజొన్నకు రూ.30వేలు, కూరగాయలకు ఎకరానికి రూ.60వేలు చెల్లించాలని పేర్కొన్నారు.


బోనమెత్తుకున్న మేయర్ సునీల్ రావు


కొత్తపల్లిలో పోచమ్మ బోనాల వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు

ఘనంగా పోచమ్మ బోనాలు

కరీంనగర్ కల్చరల్: నగరంలోని కట్టారాంపూర్‌లో ఆదివారం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. మేయర్ సునీల్‌రావు ముఖ్య అతిథిగా హాజరై బోనమెత్తుకున్నారు. మహిళలు కోతిరాంపూర్‌లోని పోచమ్మ ఆలయంలో అమ్మవారికి బోనాలు సమర్పించి తమ కుటుంబాలను చల్లగా చూడాలని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆకుల నర్మదా నర్సయ్య, మర్రి భావనా సతీశ్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి(హెచ్) పట్టణంలో పోచమ్మ బోనాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల.. నెత్తిపై బోనంతో పోచమ్మ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. రెడ్డిరామయ్యపల్లి కాలనీ, మాల అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా జరిగిన బోనాల వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కౌన్సిలర్లు గండు రాంబాబు, సత్యనారాయణరెడ్డి, గున్నాల విజయరమేశ్, మాల సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్, చామనపల్లి, నల్లగుంటపల్లి గ్రామాల్లో మహిళలు బోనాలను తలపై ఎత్తుకుని డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లి పోచమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. చామనపల్లిలో సర్పంచ్ బోగొండ లక్ష్మిఐలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పోచమ్మ బోనాల వేడుకల్లో ఉప సర్పంచ్ దావు నిర్మల, ఆలయ కమిటీ చైర్మన్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు. దుర్శేడ్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర భూమయ్య, ఉపాధ్యక్షులు కొయ్యడ సంపత్, బుర్ర హరీశ్, న్యాలం కనుకయ్య, బుర్ర తిరుపతి, లచ్చయ్య, శ్రీనివాస్, భూమయ్య, ఎల్లయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు. నల్లగుంటపల్లిలో జరిగిన వేడుకల్లో సర్పంచ్ వడ్లూరి సంతోష కిరణ్, ఉప సర్పంచ్ అంజయ్య, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.


నల్లగుంటపల్లిలో బోనాలతో మహిళలు


దుర్శేడ్‌లో..

నిఖత్, సింధూ స్ఫూర్తి.. క్రీడలపై ఆసక్తి

- క్రీడారంగంపై బాలికల మక్కువ
- పోటీలకు పెద్ద సంఖ్యలో హాజరవుతున్న వైనం
- తాముసైతం పతకాలు సాధిస్తామంటున్న క్రీడాకారిణులు

కరీంనగర్‌స్పోర్ట్స్: పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు.. లక్ష్య సిద్ధితో చేస్తే దేనినైనా సాధించవచ్చు అన్న నానుడి అందరికీ తెలిసిందే. ఇటీవల కాలంలో క్రీడా రంగంలో ఒలింపిక్స్, వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా రాణించడమే కాకుండా పతకాలను సైతం సాధిస్తున్నారు. షట్లర్ పీవీ సింధూ, బాక్సర్ నిఖత్ జరీన్ లాంటి మన తెలంగాణ క్రీడారత్నాలను స్ఫూర్తిగా తీసుకున్న బాలికలు తాము సైతం క్రీడల్లో అంటూ క్రీడా రంగం వైపు ఆసక్తిని కనబరుస్తుండడం విశేషం. ఇటీవల కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియం, మల్కాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీలకు పెద్ద సంఖ్యలో బాలికలు హాజరు కావడమే ఇందుకు నిదర్శనం. పీవీ సింధూ, నిఖత్ జరీన్ లాగే తాము కూడా వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాలనే లక్ష్యంతో క్రీడారంగంలోకి వచ్చామంటున్నారు పలువురు క్రీడాకారులు. క్రీడల్లో దేశానికి పతకాలు సాధించి జాతీయ పతాకాన్ని సగౌరవంగా ఎగురవేస్తామంటున్న పలువురు క్రీడాకారిణిల అభిప్రాయాలు వారి మాటల్లోనే..


మల్కాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన పోటీల్లో క్రీడాకారిణుల సందడి (ఫైల్)


కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో జరిగిన కబడ్డీ పోటీల్లో తలపడుతున్న బాలికలు (ఫైల్)

చాంపియన్లమవుతాం



మేమిద్దరం క్రీడల్లో బాగా ఆడుతాం. ఖోఖో, కబడ్డీ లాంటి క్రీడలతోపాటు రన్నింగ్ కూడా బాగా చేస్తాం. మేము కూడా పీవీ సింధూ లాగా పెద్ద క్రీడాకారులం కావాలనుకుంటున్నాం. అందుకు తగ్గట్టుగానే ప్రాక్టీస్ కూడా చేస్తున్నాం. పీవీ సింధూ మాకు స్ఫూర్తి.

– కె.వెన్నెల, వి.లయనశ్రీ, జిల్లా పరిషత్ పాఠశాల, చింతకుంట

పీవీ సింధూ నా ఫేవరేట్..



మొగ్దుంపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నా. ఇటీవల మల్కాపూర్‌లో జరిగిన క్రీడా పోటీల్లో తొలిసారిగా పాల్గొన్న. చాలా హ్యాపీ అనిపించింది. నా ఫేవరేట్ ప్లేయర్ పీవీ సింధూ. తనలా నేను కూడా వరల్డ్ చాంపియన్‌గా నిలవాలని ఉంది.

– టి శ్రీవల్లి, జిల్లా పరిషత్ పాఠశాల, మొగ్దుంపూర్

నిఖత్ జరీనా స్ఫూర్తితో..



గేమ్స్ అంటే చాలా ఇష్టం. పోటీలు ఉన్నాయంటే తప్పకుండా పాల్గొంటా. నిఖత్ జరీనాలా పెద్ద క్రీడాకారిణి కావాలనుకుంటున్న. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని కబడ్డీలో దేశానికి పతకం సాధించిపెట్టాలని ఉంది. కబడ్డీలో డిస్ట్రిక్ ప్లేయర్.

– సభా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సప్తగిరికాలనీ

భారత జట్టులో చోటు సంపాదించడమే లక్ష్యం



పదో తరగతి చదువుతున్న. ఖోఖో క్రీడల్లో ఇండియన్ ఉమెన్ టీంకు ఆడాలని ఉంది. ఇంటర్‌లో అండర్–19 ఎస్జీఎఫ్‌లో, డిగ్రీలో యూనివర్సిటీ క్రీడల్లో టాప్ ప్లేయర్‌గా నిలిచి భారత జట్టులో చోటు సంపాదించడమే లక్ష్యం. కరీంనగర్ ఖోఖో క్రీడకు కంచుకోట. ఆ కోటలో నేను కూడా ఉండాలనుకుంటున్న.

– సీహెచ్ రశ్మిత, జిల్లా పరిషత్ పాఠశాల, చామనపల్లి

పెద్ద క్రీడాకారిణిగా పేరుతెచ్చుకుంటా..



మల్కాపూర్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న. పదో తరగతి పూర్తయ్యేలోపు ఖోఖోలో పెద్ద క్రీడాకారిణిగా పేరు తెచ్చుకోవాలని ఉంది. స్కూల్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో బాగా రాణించాను. జాతీయ ఖోఖో పోటీల్లో బంగారు పతకం సాధించడమే లక్ష్యం.

– జి.అర్చన, జిల్లా పరిషత్ పాఠశాల, మల్కాపూర్

గీతాభక్త సమాజం ద్విదశాబ్ది మహోత్సవం


పురస్కారం అందజేస్తున్న నాయకులు

కరీంనగర్ కల్చరల్: నగరంలోని గణేశ్‌నగర్‌లో గల గీతాభక్త సమాజం 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతా మందిరంలో ద్విదశాబ్ది మహోత్సవం నిర్వహించారు. పారాయణాలు, ప్రత్యేక పూజల అనంతరం అతిథిగా హాజరైన చిన్మయ మిషన్ జిల్లా ఇన్‌చార్జి అక్షయ చైతన్య భగవద్గీత విశిష్టత, శ్రీకృష్ణతత్వాన్ని వివరించారు. ఈ సందర్భంగా ధార్మిక, ఆధ్యాత్మిక, సామాజిక సేవా రంగాల్లో కృషి చేస్తున్న ఆరుగురికి భగవద్గీత పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వంగల శ్రీదేవి, సంస్థ అధ్యక్షుడు బండ సత్తయ్య, ప్రధాన కార్యదర్శి ఉప్పల రామేశం, మర్యాల రవీందర్, గుండ రాధాకిషన్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

వినాయకనగర్ కాలనీ కమిటీ



కొత్తపల్లి: కరీంనగర్ నగర పాలక సంస్థ 21వ డివిజన్ పరిధిలోని వినాయకనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వర్థ పెద్దిరెడ్డి, వి.వెంకటరమణరెడ్డి, కోశాధికారిగా పి.లక్ష్మీకాంతం, ఉపాధ్యక్షులుగా రాచమల్ల సుగుణాకర్, పి.శశిధర్‌రెడ్డి, సభ్యులుగా జి.సుధాకర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, విష్ణువర్థన్, జాకీర్ అలీ, హన్మండ్లు ఎన్నికయ్యారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు కొనసాగుతున్నందున సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11 కేవీ శివనగర్ ఫీడర్ పరిధిలోని శివనగర్, ప్రగతినగర్, మార్కండేయనగర్, రాజీవ్‌పార్కు, హస్నాపూర్‌కాలనీ, సప్తగిరికాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

శంకరపట్నం: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీకి నిరసనగా శంకరపట్నం మండలం కేశవపట్నంలో ఆదివారం డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాస్తారోకో చేసి సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని విమర్శించారు. లీకేజీకి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామకాలు చేయకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుట్ర చేసి, లీకేజీకి పూనుకుందని ఆరోపించారు. కరీంనగర్–వరంగల్ రహదారిపై రాస్తారోకోతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపగోని బస్వయ్య, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్, తిరుపతి, రాజిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ స్థలాలను కాపాడుతాం

- మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ సిటీ: నగర పాలక సంస్థ ఖాళీ స్థలాలు ఎక్కడ ఉన్నా అవి అక్రమణకు గురికాకుండా కాపాడటమే మా ప్రధాన బాధ్యత అని మేయర్ సునీల్‌రావు అన్నారు. ఆదివారం రేకుర్తిలోని 18వ డివిజన్ కాశ్మీర్‌నగర్‌లో పర్యటించి గ్రీన్‌హోమ్స్ కాలనీలో పట్టణ ప్రగతి నిధులతో ఖాళీ స్థలంలో కాంపౌండ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. నగరవ్యాప్తంగా రెండు గుంటల స్థలం నుంచి ఎకరం వరకు ఎక్కడ స్థలం ఉన్నా అవి ఆక్రమణకు గురికాకుండా కాపాడుతున్నామని అన్నారు. డివిజన్‌లలోని ఖాళీ స్థలాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు పార్కుల నిర్మాణం, క్రీడా ప్రాంగణాలు, మహిళా యూత్ అసోసియేషన్ భవనాలు, వాకింగ్‌ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లను నిర్మిస్తున్నామని తెలిపారు. రేకుర్తిలోని 18, 19 డివిజన్ల ముఖ స్వరూపాన్ని మార్చి ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రధాన రహదారులతో పాటు అన్ని కాలనీల్లో చక్కటి లైటింగ్ ఏర్పాటు చేశామని అన్నారు. జూన్‌లోగా అన్ని కాలనీలకు మంచినీటిని సరఫరా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్లు సుదగోని మాధవి, ఎదుల్ల రాజశేఖర్, డీఈ మసూద్ అలీ, కాశ్మీర్‌నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల స్వచ్ఛభారత్


దుర్శేడ్‌లో శ్రమదానం చేస్తున్న వలంటీర్లు


బద్దిపల్లి ప్రభుత్వ పాఠశాలలో..

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో నిర్వహిస్తున్న ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా ఆదివారం వలంటీర్లు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. జెడ్పీ పాఠశాల ఆవరణలోని చెత్తచెదారాన్ని వలంటీర్లు తొలగించి శుభ్రపరిచారు. నల్లగుంటపల్లిలో నిరుద్యోగ యువతపై ఇంటింటా సర్వే నిర్వహించారు. అనంతరం రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వలంటీర్లకు యో గా, మెడిటేషన్‌పై సమితి అధ్యక్షుడు తిప్పర్తి విజ యకుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్లూరి సంతోష, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు బీబీ నాయుడు, చంద్రమౌళి పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం బద్దిపల్లిలో కరీంనగర్‌లోని అల్ఫోర్స్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన శిబిరంలో భాగంగా రెండో రోజు ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. బద్దిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గ్రామ పంచాయతీ ఆవరణను శుభ్రం చేశారు. వంద మంది వలంటీర్లు ఐదు బృందాలుగా ఇంటింటికీ తిరుగుతూ పరిసరాల పరిశుభ్రత, ప్రాముఖ్యతను గ్రామస్తులకు వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అల్ఫోర్స్ డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి, సర్పంచ్ రాచమల్ల మధు, ప్రిన్సిపాల్ గోలి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ జి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎ.సుమలత, రజిత, ఎస్.ఐలయ్య, ఉపాధ్యాయురాలు ఎం.సరళాదేవి, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అప్‌డేట్‌కు ఆధారం చూపాల్సిందే..

- ఆధార్‌కార్డు సవరణకు సరికొత్త మార్పులు
- మారిన దరఖాస్తు విధానం

కరీంనగర్‌రూరల్: ప్రతీ వ్యక్తికి ఆర్థిక పరమైన కార్యకలాపాలతో పాటు ప్రభుత్వ పథకాలకు ప్రస్తుతం ఆధార్‌కార్డు తప్పని సరైంది. అయితే ఆధార్‌కార్డులో ఇంటిపేరు, చిరునామా, పేరులో తప్పులుండటంతో ఉపయోగించుకునే అవకాశం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఆధార్‌కార్డులో వివరాలను సరిచేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఆధార్‌కార్డు తీసుకుని పది సంవత్సరాలు పూర్తయిన వారికి మాత్రమే అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. ఆధార్‌కార్డు అప్‌డేట్ చేసుకునేందుకు పట్టణాల్లో మీ సేవా, ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉండగా గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆధార్‌కార్డులోని తప్పులను సవరించుకునేందుకు అవసరమైన ఆధారాలను చూపించిన అనంతరమే సవరణలు చేసే అవకాశముంది. వయస్సు ఆధారంగా సవరణల కోసం దరఖాస్తులను మూడు విభాగాలుగా గుర్తించారు. మొదటి విభాగంలో ఐదేళ్లలోపు పిల్లలు, రెండో విభాగంలో 5–18 ఏళ్లలోపు, మూడో విభాగంలో ఆపైన వయస్సు ఉన్నవారిగా నిర్ధారించారు. 18 ఏళ్లు పూర్తయిన వారు కొత్తగా ఆధార్‌కార్డు కావాలంటే తహసీల్దార్‌తో ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంటుంది.

పుట్టిన తేదీ సవరణ

ప్రస్తుతం చిన్నారులకు జనన ధ్రువీకరణ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇతరులైతే ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించాల్సి ఉంది. ఆధార్ కార్డులో ఒకసారి మాత్రమే పుట్టిన తేదీని సవరించుకునే అవకాశముంది. రెండోసారి మార్చుకోవాలంటే హైదరాబాద్‌లోని యూఐడీఏఐ కార్యాలయంలో తగిన ఆధారాలు, ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.


మొగ్దుంపూర్ గ్రామపంచాయతీలో ఆధార్ కేంద్రంలో వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

పేరులో మార్పులు

పేరులో తప్పులను సవరించుకునేందుకు ఫొటో గుర్తింపు ఉన్న ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలి. ఓటరు గుర్తింపుకార్డు, పాన్‌కార్డు, ఎస్సెస్సీ మెమో, డ్రైవింగ్‌లైసెన్స్, ఉపాధిహామీ జాబ్‌కార్డు, ఉద్యోగుల గుర్తింపు కార్డు, కుల ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాలి.

చిరునామాలో మార్పులుంటే..

చిరునామా మారినట్లయితే తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ జారీ చేసిన గుర్తింపు పత్రం సమర్పించాలి. ఓటరు గుర్తింపు కార్డు, రేషన్‌కార్డు, పాసుపోర్టు, బ్యాంకుఖాతా బుక్‌లో సరైనా చిరునామా ఉన్నట్లయితే మార్పు చేసుకునే అవకాశముంది. విద్యార్థులయితే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇచ్చే ధ్రువీకరణ పత్రం సరిపోతుంది.

ఆధార్ అప్‌డేట్ నిరంతర ప్రక్రియ

ఆధార్ అప్‌డేట్ చేసుకోవడం నిరంతరం కొనసాగే ప్రక్రియ. ఆధార్‌కార్డు అప్‌డేట్ పెండింగ్ ఎక్కువగా ఉన్న గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. జిల్లాలో మొత్తం 29 ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి.

– శ్రీనివాస్‌రెడ్డి, ఆధార్ ఈడీఎం

ఘనంగా ఉగాది అగ్నిగుండాలు


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

చొప్పదండి: మండలంలోని శ్రీగట్టు మల్లిఖార్జున స్వామి ఆలయంలో ఆదివారం అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించారు. చొప్పదండి, కాట్నపల్లి, కొలిమికుంట గ్రామాల శివారులో కొలువైన శ్రీమల్లిఖార్జునస్వామి, భ్రమరాంభ దేవి ఆలయంలో ఒగ్గుపూజారులు ఏర్పాటు చేసిన పెద్దపట్నంపై స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు అగ్నిగుండాలపై స్వామివారితో ఊరేగారు. మల్లికార్జున్, ఐలయ్య, బక్కయ్య, తదితరులు పూజలు చేశారు. సత్తు నర్సయ్య, గుర్రం దామోదర్ రెడ్డి, నెరుమట్ల మల్లేశం, గుర్రం నందిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మూల్యాంకనంపై ఆచితూచి..

- అన్ని కోణాల్లోనూ పరిశీలించిన తర్వాతే ముందుకు..
- 35 లక్షల పేపర్ల వాల్యుయేషన్‌పై నేడు ఇంటర్ బోర్డు నిర్ణయం!



సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనం (వాల్యుయేషన్)పై బోర్డు అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. భద్రత ఎంతవరకు అనే అంశం తెరపైకి రావడంతో దీనిపై ఆచితూచి అడుగేయాలని భావిస్తున్నారు. అన్ని కోణాల్లోనూ చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోనున్నారు. ఈ అంశంపై సోమవారం ఉన్నతాధికారులు భేటీ అయ్యే అవకాశం ఉంది. ఈ నెల 15 నుంచి ఇంటర్ పరీక్షలు జరుగుతున్న సంగతి తెలిసిందే. వచ్చే నెల 4వ తేదీ వరకూ ఇవి కొనసాగుతాయి. పరీక్షలు జరుగుతుండగానే పూర్తయిన పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనానికి బోర్డు ఏర్పాట్లు చేస్తుంది. ఈ ఏడాది 35 లక్షల జవాబు పత్రాలను ఆన్‌లైన్ ద్వారా మూల్యాంకనం చేయాలని నిర్ణయించారు.దీనికోసం టెండర్లు కూడా పిలిచారు. మొదటిసారి ఒకే ఒక సంస్థ ముందుకు రావడంతో టెండర్లు రద్దు చేసి రెండోసారి పిలిచారు. ఈసారి రెండు సంస్థలు ముందుకొచ్చాయి. ఎల్–1 సంస్థను సోమవారం ఖరారు చేయాలని నిర్ణయించారు.

డేటా చోరీ నేపథ్యంలో..

ప్రస్తుతం రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నపత్రాల లీక్ వ్యవహారం రాష్ట్రాన్ని కుదిపేస్తోంది. కొన్ని నెలల క్రితం బోర్డులోనే డేటా ట్యాంపరింగ్ జరిగింది. ఓ వ్యక్తి అక్రమంగా కీలకమైన భద్రత డేటాను దొంగిలించినట్టు బోర్డు గుర్తించింది. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే బోర్డులోని భద్రత వ్యవస్థ చర్చనీయాంశమయ్యింది. డేటా ట్యాంపరింగ్ వ్యవహారం తర్వాత నిపుణుల చేత పూర్తిస్థాయి సాంకేతిక పరీక్షలు చేపట్టిన ఉన్నతాధికారులు.. మరింత లోతుగా విశ్లేషణ అవసరమని భావిస్తున్నారు.

అన్ని కోణాల్లో పరిశీలించాకే..

ఆన్‌లైన్ మూల్యాంకనం చేపట్టే విషయాన్ని పరిశీలిస్తున్నాం. దీనిపై ఇంకా పూర్తిస్థాయి నిర్ణయానికి రాలేదు. ఆఫ్‌లైన్‌తో పాటు పాక్షికంగా ఆన్‌లైన్లో చేపట్టే ఆలోచనపై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం. టెండర్ల విషయంలో సోమవారం ఓ నిర్ణయానికి వచ్చే వీలుంది. ఏది ఏమైనా అన్ని కోణాల్లోనూ ఈ అంశాన్ని పరిశీలించిన తర్వాతే ఓ నిర్ణయానికొస్తాం.

– నవీన్ మిత్తల్, ఇంటర్ బోర్డు కార్యదర్శి

చిన్నోనిపల్లి అష్టదిగ్బంధం

'నెట్టెంపాడు' రిజర్వాయర్ భూనిర్వాసితుల గ్రామంలో 144 సెక్షన్

- నిరసన దీక్షలు చేస్తున్న నిర్వాసితులను అర్ధరాత్రి అరెస్టు చేసిన పోలీసులు
- గ్రామంలోని పురుషులందరినీ అదుపులోకి తీసుకున్న వైనం
- పనులను అడ్డుకొనేందుకు మహిళల విఫలయత్నం



చిన్నోనిపల్లి రిజర్వాయర్ పనులు జరిగే చోటుకు వెళ్తున్న మహిళలను అడ్డుకుంటున్న పోలీసులు

గద్వాల రూరల్/గట్టు: జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం చిన్నోనిపల్లిని పోలీసులు అన్ని వైపులా చుట్టుముట్టారు. గ్రామంలో 144 సెక్షన్ విధించారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా గ్రామ సమీపంలో రిజర్వాయర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ గత కొంతకాలంగా నిరసన దీక్షలు చేస్తున్న వారందరినీ శనివారం అర్ధరాత్రి మొదలు ఆదివారం తెల్లవారుజాము వరకు అరెస్టు చేశారు. గ్రామం మొత్తం జల్లెడపట్టి కనిపించిన మగవారందరినీ అదుపులోకి తీసుకున్నారు. దీంతో మహిళలు నిర్మాణ పనులను అడ్డుకొనేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు.

ఇప్పటికే 90 శాతం పూర్తి..

జోగుళాంబ గద్వాల జిల్లా నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా గట్టు మండలం చిన్నోనిపల్లి గ్రామ సమీపంలో 1.50 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్‌ను 2006లో నిర్మించేందుకు పూనుకున్నారు. మూడేళ్లపాటు నిరాటకంగా సాగిన పనులు సుమారు 90 శాతం మేర పూర్తయ్యాయి. ఈ క్రమంలో రాక్ వర్క్ పనులకు సంబంధించి బ్లాస్టింగ్ చేయగా కొన్ని మట్టి మిద్దెలు, పాత ఇళ్ల నెర్రెలు ఇచ్చి కూలిపోయాయి. బ్లాస్టింగ్ పనులను సదరు కాంట్రాక్టర్ రాత్రివేళ కొనసాగించడంతో అప్పట్లో గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. అలాగే గ్రామాన్ని ఖాళీ చేయడానికి నిరాకరించారు. దీంతో పనులు నెమ్మదించి 2009 నాటికి పూర్తిగా ఆగిపోయాయి. తాజాగా 16 ఏళ్ల తర్వాత రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి మిగిలిన 10 శాతం పనులను పోలీసు పహారా మధ్య అధికారులు ప్రారంభించారు. ఇరిగేషన్ శాఖ ఈఈ రహీముద్దీన్, ఆర్డీఓ రాములు, డీఎస్పీ రంగస్వామి పనులను దగ్గరుండి కొనసాగిస్తున్నారు.

423 రోజులుగా దీక్షలు...

పచ్చని పంటలు పండిస్తూ హాయిగా జీవిస్తున్న గ్రామస్తులకు రిజర్వాయర్ నిర్మాణం గుదిబండగా మారింది. దశాబ్దాలుగా వ్యవసాయాన్నే నమ్ముకొని జీవనం సాగిస్తున్న భూములతోపాటు నివాసముంటున్న చిన్నోనిపల్లి గ్రామం సైతం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతుందనే విషయం తెలుసుకున్న రైతులు ఎందరు అధికారులను కలిసి రిజర్వాయర్ నిర్మించొద్దని కోరినా ఫలితం లేకపోయింది. దీంతో 'రిజర్వాయర్ రద్దు'కోసం గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నారు. ఏకంగా 423 రోజుల పాటు దీక్షలు చేసిన నిర్వాసితులను రాత్రి రాత్రికి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే రిజర్వాయర్ కింద ఒక్క ఎకరా ఆయకట్టు లేనప్పటికీ ప్రభుత్వం రైతుల ఆవేదనను పట్టించుకోకుండా పోలీసు బలగాలతో నిర్మాణ పనులు చేపడుతుండటాన్ని విపక్షాలు తప్పుబడుతున్నాయి. అధికార బీఆర్ఎస్ మినహా బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నేతలంతా ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించారు. రైతులకు జరిగే అన్యాయాన్ని అడ్డుకుంటామని, మరో ఉద్యమానికి సిద్ధమవుతామని ప్రకటించారు.

మళ్లీ జీవీకే చేతికి '108'

- 102, 104 సేవలు కూడా ఆ సంస్థకే అప్పగింత
- ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి పేదల శవాల తరలింపు కూడా..
- మండలానికో అంబులెన్స్ ఇవ్వాలని కీలక నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: ప్రజలకు అత్యవసర వైద్య సేవలందించే '108'వాహన టెండర్‌ను మళ్లీ జీవీకే సంస్థే దక్కించుకుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో జీవీకేతోపాటు మరో కంపెనీ పాల్గొంది. చివరకు జీవీకే సంస్థకే టెండర్ దక్కినట్లు వైద్య, ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. దీంతోపాటు ఈసారి 102 అమ్మ ఒడి, 104, ప్రభుత్వ ఆసుపత్రులనుంచి పేదల శవాలను వారి సొంతూళ్లకు ఉచితంగా తరలించేందుకు ఏర్పాటు చేసిన వాహనాల బాధ్యత కూడా జీవీకేకే అప్పగించారు. ప్రస్తుతం 50 వాహనాలు పేదల శవాలను ఆసుపత్రుల నుంచి సొంతూళ్లకు ఉచితంగా తీసుకెళ్తున్నాయి. ఈ నాలుగు సేవలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి ఆ సంస్థకు బాధ్యతలు అప్పగించారు.

ప్రస్తుతం 358 వాహనాలు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో '108'అత్యవసర అంబులెన్స్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో అకస్మాత్తుగా వైద్యం అవసరమైన వారు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారు '108'నంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా ఈ అంబులెన్స్ సేవలను ఉచితంగా పొందుతున్నారు. ప్రస్తుతం 358 వాహనాలు '108'అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నాయి. వాటిల్లో 333 రోడ్లపై అందుబాటులో ఉండగా, మిగిలిన వాటిని రిజర్వులో ఉంచారు. అప్పట్లో కొన్ని వాహనాలు చెడిపోగా, వాటి స్థానంలో కొన్ని వాహనాలను గిఫ్ట్ ఎ స్మైల్ కింద రాజకీయ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు తదితరులు ఉచితంగా ఇచ్చారు. ప్రస్తుతం లక్ష మంది జనాభాకు ఒకటి చొప్పున '108'వాహనం ఉందని అధికారులు చెపుతున్నారు. ఫోన్ చేసిన దాదాపు 20 నిమిషాల్లో అంబులెన్స్ బాధితుల వద్దకు చేరుకోవాలనేది నిబంధన. ఈ అంబులెన్స్ సర్వీసులను ప్రస్తుతం కూడా జీవీకే సంస్థనే నిర్వహిస్తోంది. ఇప్పటివరకు 108 వాహనాల నిర్వహణకోసం ప్రభుత్వం ఏడాదికి రూ. 86 కోట్ల మేర ఖర్చు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. కాగా, ఈసారి ఎంతకు ఖరారు చేశారన్న దానిపై స్పష్టత లేదు.

పలు మార్పులకు శ్రీకారం..

ప్రస్తుతమున్న '108'అంబులెన్స్ సేవల్లో పలు మార్పులు చేయాలని భావిస్తున్నారు. ఈ మేరకు జీవీకే సంస్థ ఏర్పాట్లు చేసే అవకాశముంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేట్ ఆఫ్ ఆర్ట్ కాల్ సెంటర్‌కు రూపకల్పన చేస్తారు. దాని ద్వారా కంప్యూటర్ ఆధారంగా అంబులెన్సులను ఆటోమాటిక్‌గా నడిపిస్తారు. ఆటోమాటిక్ కాల్ డిస్ట్రిబ్యూటర్ (ఏసీడీ) వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. కంప్యూటర్ టెలిఫోనీ ఇంటర్‌ఫేస్ (సీటీఐ), వాయిస్ లాగింగ్ కేపబిలిటీస్, జీపీఎస్ ఇంటిగ్రేషన్, హైలీ సెక్యూర్డ్ నెట్‌వర్క్‌లను రూపొందిస్తారు. ఈ వ్యవస్థ ప్రస్తుతానికే కాకుండా భవిష్యత్ అవసరాలకు కూడా ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. అంతేకాక దీనిని విపత్తు నిర్వహణ విభాగానికి అనుసంధానం చేస్తారు. ఇది పోలీస్, ఫైర్ సర్వీసులతోనూ అనుసంధానం అవుతుంది. అన్ని '108'అంబులెన్స్‌లకు జీపీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. అలాగే ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. బాధితుడిని తీసుకెళ్లే ఆసుపత్రికి ముందస్తు సమాచారం ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తారు. అన్ని కార్పొరేట్ కంపెనీల్లోనూ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా ఉంది.

మండలానికో '108'వాహనం..

ఇకపై ప్రతీ మండలానికి ఒక '108'వాహనాన్ని సమకూర్చాలని సర్కారు యోచిస్తోంది. తద్వారా దాని పరిధిలోని సమీప గ్రామాలకు తక్కువ సమయంలో చేరుకోవడానికి వీలు కలుగుతుందని, అనేకమందిని ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చనేది ప్రభుత్వ ఆలోచన. ప్రస్తుతం లక్ష మంది జనాభాకు ఒకటి చొప్పున '108'వాహనం ఉండగా, మండలానికి ఒకటి కేటాయించడం ద్వారా ప్రతీ 70 వేల జనాభాకు ఒకటి అందుబాటులోకి తీసుకురావాలని అనుకుంటున్నారు.

రణరంగంగా మోతె

- భూ వివాదంతో ఉద్రిక్తత
- రెండు వర్గాల ఘర్షణ



ఎస్సీలు ఏర్పాటు చేసిన కంచె, జెండాలను తొలగిస్తున్న గ్రామస్తులు

వేల్పూర్: వేల్పూర్ మండలం మోతె గ్రామంలోని 333 సర్వే నంబరు భూమిపై ఎస్సీలు, గ్రామస్తుల మధ్య చాలా ఏళ్లుగా కొనసాగుతున్న భూ వివాదం ఆదివారం ఘర్షణకు దారితీసింది. మోతె రాజరాజేశ్వరస్వామి ఆలయానికి సమీపంలోని 333 సర్వేనంబరులోని సుమారు ఎకరంన్నర భూమి రికార్డుల పరంగా మొదటినుంచి తమదేనని ఎస్సీలు ఇస్సాపల్లి నడ్పిగంగారాం, రవి, ప్రతాప్ పేర్కొంటున్నారు. ఈ భూమిని పూర్వకాలంలో ఎస్సీలు రాజరాజేశ్వరస్వామి ఆలయానికి ఇచ్చారని, యేటా జాతరకు ఈ భూమిని ఉపయో గించుకుంటామని గ్రామస్తులు వాదిస్తున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య చాలా ఏళ్లుగా వివాదం కొనసాగుతోంది. గతంలో ఎస్సీలు భూమిని దున్ని పంట వేయగా గ్రామస్తులు తొలగించారు. గతేడాది గ్రామస్తులు ఆ భూమిలో విగ్రహాలు ఏర్పాటు చేయగా ఎస్సీలు తొలగించారు. ఎస్సీలు ఆ భూమికి ఇటీవల కంచె ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు వీడీసీ ఆధ్వర్యంలో ఇంటికొకరు చొప్పున రాజరాజేశ్వర ఆలయానికి చేరుకొని సమావేశమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సీలు తమ అనుచరులు, బంధువులు, దళిత సంఘాల నేతలతో కలిసి భూమి వద్దకు చేరుకున్నారు. ఎస్సీలు ఏర్పాటు చేసిన కంచెను, జెండాలను గ్రామస్తులు తొలగించారు. అడ్డు వచ్చిన వారిపై దాడికి పాల్పడ్డారు. అదే సమయంలో భీమ్‌గల్ వైపు వెళ్తున్న బాల్కొండ నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు.. ఘర్షణను చిత్రీకరిస్తుండగా వారిపై దాడికి పాల్పడి పరికరాలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్ రెడ్డి, వేల్పూర్ ఎస్‌ఐ వినయ్‌కుమార్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వారిని చెదర గొట్టారు. ఎస్సీ వర్గీయులు తమపై దాడికి పాల్పడిన గ్రామస్తులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్యే గణేశ్ గుప్తాకు తప్పిన ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా వాహనం

కామారెడ్డి టౌన్: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తాకు పెను ప్రమాదం తప్పింది. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఎమ్మెల్యే కాన్వాయ్ మధ్యకు ఓ ప్రైవేటు వాహనం రావడంతో ప్రమాదం జరిగింది. కాన్వాయ్ కామారెడ్డి పట్టణంలోని సిరిసిల్ల రోడ్డులో జాతీయ రహదారిపై ఓవర్ వద్దకు రాగానే.. ఢిల్లీ నుంచి కేరళ వైపు వెళ్తున్న వాహనం ఎమ్మెల్యే వాహనం వెనక్కు వచ్చింది. ఆ కారు వేగం నెమ్మదించడంతో వెనకాల ఉన్న ఎమ్మెల్యే కాన్వాయ్ వాహనం ఢిల్లీ కారును ఢీకొనగా.. అది ఎమ్మెల్యే కారును ఢీకొట్టింది. ఇలా నాలుగు కార్లు ఒకదాని నొకటి ఢీకొన్నాయి. వెంటనే వాహనాల్లోని ఎయిర్ బ్యాగులు తెరుచుకున్నాయి. ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. నాలుగు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఎవరికీ గా యాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

బిడ్డ పుట్టినరోజే.. నాన్న ఆత్మహత్య



రాజు (ఫైల్)

ఉండవెల్లి: కొడుకు జన్మించిన రోజే ఓ తండ్రి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాదకర ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లిలో చోటు చేసుకుంది. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న రాజు (29)కు కొన్నేళ్ల క్రితం గీతతో వివాహమైంది. వారిద్దరికి పాప, కుమారుడు ఉండగా.. ఆదివారం మూడో సంతానంగా మగ బిడ్డ అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో జన్మించాడు. కుమారుడిని చూసి వచ్చిన రాజు.. మధ్యాహ్నం వేళ ఇంట్లోనే ఉరివేసు కుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆత్మ హత్యకు గల కారణాలు తెలియడం లేదని అతని తల్లిదండ్రులు, స్థానికులు చెబుతు న్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



సాధించిన పతకాలతో జిల్లా క్రీడాకారిణులు

ఆదిలాబాద్: ఖేలో ఇండియా ఉమెన్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణులు సత్తా చాటారు. హైదరాబాద్‌లోని గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన పోటీల్లో మూడు పతకాలను కై వసం చేసుకున్నారు. ట్రిపుల్ జంప్‌లో మడావి జంగుబాయి (స్వర్ణ), హైజంప్‌లో పంద్రం ప్రియాంక (రజత), జావిలిన్ త్రోలో దేవేంద్ర (కాంస్య) పతకాలను కైవసం చేసుకున్నారు. వీరి వెంట శిక్షకులు వీజీఎస్ రాకేశ్, పీడీలు అలివేలు, మహేశ్, ప్రియాంక రెడ్డి ఉన్నారు. సత్తా చాటిన క్రీడాకారులను డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, పి.రాజేశ్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి, పెటా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పార్థసారథి, ఎన్.స్వామి అభినందించారు.


రాష్ట్రస్థాయి కవి సమ్మేళనానికి 'గోపగాని'



ఎంపికైన రవీందర్

దండేపల్లి: ఉగాది పర్వదిన సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి కవి సమ్మేళనానికి దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, కవి గోపగాని రవీందర్ ఎంపికయ్యారు. ఈనెల 22న రవీంద్రభారతీలో జరిగే కవి సమ్మేళనంలో తెలంగాణ సహజీవన సామరస్య విలువలు అనే అశంపై రవీందర్ కవితాగానం చేయనున్నారు.

వ్యవసాయ క్షేత్ర పర్యటనలో కిష్టాపూర్ విద్యార్థులు



వ్యవసాయ పద్ధతులు తెలుసుకుంటున్న విద్యార్థులు

జన్నారం: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వృత్తి విద్యలో భాగంగా వ్యవసాయం కోసం క్షేత్రస్థాయి పర్యటనకు నిజామాబాద్ జిల్లా అంకాపూర్‌కు వెళ్లారు. హెచ్‌ఎం జాడి మురళి ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు అక్కడి వ్యవసాయ పద్ధతులు పరిశీలించారు. అక్కడి రైతులు విద్యార్థులకు వ్యవసాయ మెళకువలను నేర్పించారు. సీడ్ ఫ్యాక్టరీ, వివిధ రకాలైన పంటల వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. నేటి విద్యార్థులకు వ్యవసాయం గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ పర్యటన చేసినట్లు హెచ్‌ఎం తెలిపారు.

అమ్మా, నాన్నలను ఆదుకోండి

- తల్లికి క్యాన్సర్, తండ్రికి పక్షవాతం
- బడి మానేసి కూలీకి వెళ్తున్న కొడుకులు
- చికిత్సకు డబ్బులు లేక ఇబ్బందులు
- దీనస్థితిలో నిరుపేద కుటుంబం
- దాతల సాయం కోసం ఎదురుచూపులు



సాయం చేయమని వేడుకుంటున్న బాధితులు

నెన్నెల: రెక్కాడితే గాని డొక్కాడని వారి జీవితాల్లో క్యాన్సర్, పక్షవాతం శాపంగా మారింది. తల్లికి క్యాన్సర్, తండ్రికి పక్షవాతంతో కుటుంబ భారం పిల్లలపై పడింది. చదువుకోవాల్సిన వయస్సులో కూలి పనికి వెళ్తున్న కుమారులు, ఎంత కష్టపడినా తల్లిదండ్రుల చికిత్సకు సరిపోక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉండడానికి ఇళ్లు లేక, చికిత్సకు చిల్లి గవ్వలేక ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతూ దాతల సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. నెన్నెల మండల కేంద్రానికి చెందిన తుతుర్ల రాజం–లక్ష్మి దంపతులకు సన్ని(12), భీమేష్(16) పిల్లలు. వీరిది నిరుపేద కుటుంబం. రోజు పని చేస్తేనే కుటుంబం గడిచేది. భర్త ఏడాదిగా పక్షవాతంతో మంచానికే పరిమితం కాగా, లక్ష్మి ఆరు నెలలుగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతుండటంతో కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో పదో తరగతి చదువుతున్న కుమారుడు భీమేష్, ఏడో తరగతి చదువుతున్న సన్ని బడి మానేసి నిత్యం ఏదో ఒక పనికి కూలీకి వెళ్తూ వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రాత్రి, పగలు ఎంత కష్టపడినా తల్లిదండ్రుల చికిత్సకు సరిపోని పరిస్థితి. ఇప్పటికే చికిత్స కోసం రూ.2లక్షలు అప్పు చేశారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న తల్లి చికిత్స కోసం నెల నెలా రూ.15వేలు ఖర్చు చేస్తున్నారు. తల్లిదండ్రులను రక్షించుకునేందుకు నానా కష్టాలు పడుతున్నామని, మానవతావాదులు ఎవరైనా స్పందించి అమ్మానాన్నల చికిత్సకు ఆర్థిక సాయం చేయాలని సన్ని, భీమేష్‌లు చేతులెత్తి వేడుకుంటున్నారు. ప్రభుత్వం తరపున ఆసరా పింఛన్, ఉండడానికి ఒక చిన్న ఇళ్లు మంజూరు చేయాలని కోరుకుంటున్నారు.

ఫోన్ పే, గూగుల్ పే నంబర్ :
9573570508
పేరు : తుతుర్ల లక్ష్మి



అరుదైన పక్షి.. ఫిష్ ఈగల్

జన్నారం: మంచిర్యాల జిల్లా కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ బైసన్ కుంట ప్రాంతంలో అరుదైన గ్రే హెడెడ్ ఫిష్ ఈగల్ కనిపించగా, ఎఫ్‌డీవో మాధవ రావు తన కెమెరాలో బంధించారు. ఈ పక్షులు అరుదుగా కనిపిస్తాయని, ప్రతీ సంవత్సరం వలస వస్తాయని అటవీ అధికారులు తెలిపారు.

నిరుద్యోగ భృతి ఇవ్వండి

- పేపర్ లీక్‌పై సిట్టింగ్ జడ్జి విచారణ అవసరం
- కేటీఆర్ వ్యాఖ్యలు విడ్డూరం
- ఏపీ పాలసీని ఇక్కడ అమలు చేయాలి
- ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి



సిరిసిల్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: నాలుగేళ్లుగా కాలక్షేపం చేస్తున్న బీఆర్ఎస్ సర్కారు ఎన్నికల వేళలో నిరుద్యోగులకు ఇస్తామన్న భృతి వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆత్మహత్యకు పాల్పడిన నిరుద్యోగి చిటికెన నవీన్ కుటుంబాన్ని ఆదివారం సిరిసిల్లలో పరామర్శించిన అనంతరం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీలో లీకేజీలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించడం అవసరమన్నారు. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడితే సహించేది లేదన్నారు. లీకేజీలకు బాధ్యత వహిస్తూ..టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఇద్దరు వ్యక్తులు లీక్ చేస్తే..నాకేం బాధ్యత అంటూ..మంత్రి కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు విడ్డూరకరమన్నారు. నీళ్లు, నిధులు, ఉద్యోగాల పేరుతో సాధించుకున్న తెలంగాణలో అవేమీ లేకుండా కేవలం సీఎం కేసీఆర్ కుటుంబ పాలనకే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. ఏపీలో ప్రైవేటు సెక్టారులో స్థానికులకు 90శాతం ఉద్యోగాలను రిజర్వు చేశారని అటువంటి పాలసీని తెలంగాణలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో కనీసం 75శాతం ఉద్యోగాలకు స్థానికులు రిజర్వు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నిరుద్యోగులకు అండగా కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు.

జన చైతన్య యాత్రకు తరలిరండి

- సీపీఎం పెద్దపల్లి జిల్లా కార్యదర్శి వై.యాకయ్య



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యాకయ్య, నాయకులు

గోదావరిఖని(రామగుండం): ఈ నెల 25న గోదావరిఖనిలో జరిగే జన చైతన్య యాత్రకు తరలిరావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య కోరారు. ఈ మేరకు గోదావరిఖనిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై, లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ నెల 23 నుంచి 29 వరకు యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 25న మధ్యాహ్నం ఒంటి గంటకు గోదావరిఖనిలోని గోదావరి బ్రిడ్జి వద్దకు చేరుకుంటుందని పేర్కొన్నారు. అక్కడి నుంచి బైక్ ర్యాలీతో స్వాగతం పలుకుతూ ప్రధాన చౌరస్తాలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ పెద్ద ఎత్తున కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఆరోపించారు. మరోసారి ఆ పార్టీ అధికారంలోకి వస్తే బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఉండే పరిస్థితి లేదన్నారు. పూర్తిస్థాయిలో ప్రజలను చైతన్యవంతం చేయడానికి ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం జన చైతన్య యాత్ర వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వి.కుమారస్వామి, నాయకులు మహేశ్వరి, తుమ్మల రాజారెడ్డి, మెండె శ్రీనివాస్, లావణ్య, లలిత, సాగర్, ఓదెలు, నాగమణి, సంజీవ్, సలీం, లక్ష్మీనారాయణ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ రామగుండంలో ప్రపంచ నీటి దినోత్సవం




చిన్నారులతో ఎన్టీపీసీ జీఎం అలోక్ చంద్ర ఠాకూర్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండంలో ప్రపంచ నీటి దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని స్పందన క్లబ్‌లో ఎన్టీపీసీ, సీఐఎస్ఎఫ్ ఉద్యోగుల పిల్లలకు చిత్రలేఖన పోటీలు జరిపారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు జనరల్ మేనేజర్ అలోక్ చంద్ర ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరై, వాటర్ డే వేడుకలను ప్రారంభించారు. చిత్రలేఖన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారని చిన్నారులను అభినందించారు. ఫ్యామిలీ క్విజ్ నిర్వహించారు. విజేతలకు ఈ నెల 22వ తేదీన బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ, సీఐఎస్ఎఫ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సన్నిధి

ఇస్లాం వెలుగు

విలువల వికాసమే ఉపవాసాల ఉద్దేశ్యం



అల్లాహ్ ఈ సృష్టిని ఉనికిలోకి తెచ్చినప్పుడే దానికి కొన్ని ప్రత్యేకతలను ప్రసాదించాడు. భూమి నలు మూలలను మక్కా, మదీనా, బైతుల్ మఖ్దిస్ లాంటి పవిత్ర స్థలాలతో పునీతం గావించాడు. రోజుల్లో శుక్రవారానికి, రాత్రుల్లో షబేఖద్ర్‌కు, గ్రంథాల్లో పవిత్ర ఖురానుకు, నెలల్లో రమజాన్ నెలకు, రమజాన్‌లో రోజాలకు ప్రత్యేకతను ప్రసాదించాడు. ఇదేనెలలో పవిత్ర గ్రంథాన్ని అవతరింపజేశాడు. అందుకే రమజాన్ నెల నిస్సందేహంగా మిగతా నెలలన్నిటికంటే అగ్రగామిగా నిలిచింది.

ఇదేవిధంగా, విశ్వాసుల కోసం ప్రత్యేకంగా పవిత్ర రమజాన్ రుతువును ఉనికిలోకి తెచ్చాడు. బుద్ధిమంతులు, తెలివైనవాళ్ళు ఆయా రుతువు (సీజన్) ల ద్వారా లబ్ధిపొందుతారు. మిగతా కాలమంతా చీకూచింత లేకుండా హాయిగా గడిపేస్తారు. ఇదేవిధంగా విశ్వాసులకు రమజాన్ రుతువు భయభక్తుల రుతువు. ఎవరైతే ఈ రుతువు ద్వారా లబ్ధి పొందుతారో వారే మిగతా పదకొండు నెలల కాలం దైవాదేశపాలనలో విలువలతో కూడిన జీవితం గడపగలుగుతారు. ఒక వ్యాపారి మంచి వ్యాపార సీజన్‌లో, ఒకరైతు వ్యవసాయ తరుణంలో ఏమరుపాటుకు లోనై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా నష్టపోతాడో అలాగే విశ్వాసులు కూడా రమజాన్ రుతువును నిర్లక్ష్యం చేస్తే తీవ్రంగా నష్టపోతారు. ఇహపరాల వైఫల్యం మూటగట్టుకుంటారు. నిజానికి ఇది కాస్తంత శ్రమ చేసి అనంతమైన లాభం పొందే తరుణం. ఇంతమంచి శుభతరుణాన్ని పొంది, దానిద్వారా ప్రయోజనం పొందలేనివారు నిజంగానే దురదృష్టవంతులని చెప్పాలి. ఎవరైతే రమజాన్ నెలను పొంది, ఉపవాసాలు పాటించలేదో, పాపక్షమాపణకు ప్రయత్నించలేదో అలాంటి వారిపై దేవుని శాపం విరుచుకు పడుతుందని ప్రవక్త మహనీయులు హెచ్చరించారు. (ముస్తదక్ అల్ హాకిం 7256) అందుకని రమజాన్‌ను గౌరవించాలి. నియమానుసారం ఆరాధనలు చేయాలి. రోజూ ఐదు పూటల నమాజుతో పాటు, రాత్రి 'తరావీహ్'(ఖియాముల్లైల్) ఆచరించాలి. పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని భక్తితో పారాయణ చెయ్యాలి. దాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యాలి. ఉన్నంతలోనే వీలైనంత ఎక్కువగా దానధర్మాలు చెయ్యాలి. పిసినారితనం వహించకూడదు. దయాగుణంతో వ్యవహరించాలి.

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనం ప్రకారం:, 'ముహమ్మద్ ప్రవక్త (స) సహజంగానే మొదటినుండి దానధర్మాలు అధికంగా చేసేవారు. అయితే రమజాన్ నెలలో మరీ ఎక్కువగా చేసేవారు. అంటే, ఇతర రోజులు, ఇతర నెలలతో పోల్చుకుంటే రమజాన్‌లో దానధర్మాలు, సత్కార్యాలు అధికంగా చెయ్యాలని దీనిద్వారా మనకు తెలుస్తోంది.

రమజాన్ వచ్చిందంటే చాలు.. ప్రవక్త వారి ముఖ కవళికలు మారిపొయ్యేవి. ఆరాధనలు అధికమయ్యేవి. అభ్యర్థన, వేడుకోలు, దుఆలలో వినయ వినమ్రతలు ఉట్టిపడేవి.

హదీసులో ఇలా ఉంది: 'రమజాన్ నెలలో దేవుడు సింహాసనం మోసే దైవదూతలతో, మీరు మీ సేవలు, ఆరాధనలు అన్నీ ఆపేసి ఉపవాసం పాటిస్తున్న వారి దుఆలకు ఆమీన్ పలకండి.' అని ఆదేశిస్తాడు. కనుక రమజాన్ ప్రాముఖ్యతను అర్థం చేసుకొని ప్రధాన ఆరాధన అయిన ఉపవాసం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. నఫిల్ లు ఆచరించాలి. తరావీహ్ చెయ్యాలి. దాంతోపాటు దానధర్మాలు అధికంగా చెయ్యాలి. ఉన్నంతలోనే పేదసాదలను ఆదుకోవాలి. పేద బంధువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. సమాజంలో లేమికి గురైన వారిని ఆదరించాలి. వారి కష్టనష్టాలను విచారించాలి. సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలి. మొత్తం మీద జీవితాన్ని నిండు మానవీయ విలువలతో గడిపేలా తీర్చిదిద్దడమే రమజాన్ ఉపవాసాల పరమోద్దేశ్యం.

- ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

(23, గురువారం నుంచి రమజాన్ మాసం ఆరంభం)

అమృత బిందువులు



- ఒక్కొక్కసారి కొన్ని అనర్థాల వల్ల నవ్వులు అనే పూలు మాయమౌతాయి. కొన్ని అపార్థాల వల్ల కావాల్సిన వాళ్ళే ఎండిపోయిన ఆకుల్లా వీడిపోతారు. అయినా సరే నిరుత్సాహపడకూడదు. ఏదో రోజు ఆ అనర్థాలు, అపార్థాలు అనే అడ్డుతెరలు తొలగిపోతాయి.
- కాలం పెట్టిన సహన పరీక్షలో నువ్వు నెగ్గాలి. ఎందుకంటే మంచి విషయాలు అంత తేలికగా అర్థం కావు. కాబట్టి నీ కర్తవ్యాన్ని పూర్తి చేసి, సహనానికి ఆశ్రయం ఇవ్వు. బద్ధకానికి కాదు.
- ఏ నమ్మకంతో నువ్వు ఉదయాన్నే లేస్తావని అలారం పెట్టుకుంటున్నావో, అదే నమ్మకంతో ఏదో ఒక రోజు నీ జీవితం నువ్వు కోరుకున్న విధంగా మారుతుంది అని గట్టిగా నమ్ము. అలా జరగాలంటే నీకు కావాల్సిందల్లా ఓర్పు, సహనం.
- నువ్వు త్వరగా లేచినంత మాత్రాన సూర్యుడు ముందుగా ఉదయించడు. దానికి సమయం రావాలి. మనకు సహనం ఉండాలి.

బౌద్ధవాణి

గమ్యం ఉన్న ప్రయాణం



ప్రతి ధర్మం ఏదో ఒక గమ్యాన్ని సూచిస్తుంది. ఆ గమ్యం మనల్ని సురక్షిత ప్రాంతానికి తీసుకుపోవచ్చు. చిక్కుల లోకానికీ చేర్చవచ్చు. ఆకాశాన్ని అందించవచ్చు. పాతాళానికి పల్టీ కొట్టించవచ్చు. కాబట్టి సరైన మార్గాన్ని ఎంచుకోవడం ఎంత ముఖ్యమో, సరైన మార్గదర్శిని ఎంచుకోవడం అంతే ముఖ్యం.

మన జీవితంలో గమ్యాన్ని చేరడానికి ఒకే ఒక్క తిన్నని రహదారి అంటూ ఏదీ ఉండదు. రకరకాల ప్రదేశాల్ని దాటుకుంటూ పోవాలి. ఒక దారి నుండి మరో దారికి మళ్ళాలి. అలాగే ఒక వాహనం దిగి మరో వాహనం ఎక్కాలి. ఇన్ని రకాల ప్రయాణాలు చివరికి మనల్ని గమ్యానికి చేరుస్తాయి.

ఒకసారి బుద్ధుడు రాజగృహ నగరం దగ్గరలో ఉన్న వేణు వనంలో ఉన్నాడు. అక్కడికి ఒకే ప్రాంతానికి చెందిన కొందరు భిక్షువులు వచ్చారు. అప్పుడు బుద్ధుడు వారితో...

''భిక్షువులారా! తాను ఏకాంతంగా ఉంటూ, ఏకాంతాన్ని గురించి, తాను సంతృప్తి చెంది సంతృప్తిని గురించి, తాను ప్రయత్నిస్తూ ప్రయత్నాన్ని గురించి మీకు చెప్పేవారు ఎవరైనా ఉన్నారా?'' అని అడిగారు. అప్పుడు వారు- ''భగవాన్! ఉన్నారు. పుణ్యుడు అనే భిక్షువు'' అని చెప్పారు. వారు పుణ్యుని గురించి అలా చెప్పడం సారిపుత్రుడు విన్నాడు. బౌద్ధ సంఘంలో బుద్ధుని తరువాత స్థానం సారిపుత్రునిదే! బుద్ధుడే స్వయంగా అతణ్ణి ''ధర్మసేనాని'' అని పిలుస్తాడు. ఆ సారిపుత్రుడు స్వయంగా పుణ్యుణ్ణి దర్శించాలనుకున్నాడు.

ఆ సమయంలో పుణ్యుడు శ్రావస్తి నగరం సమీపంలో ఉన్న అంధక వనం లో ఉన్నాడు. బుద్ధుడు కూడా శ్రావస్తిలోని జేతవనానికి రావడంతో సారిపుత్రుడు బుద్ధుని వెంటే వచ్చి, పుణ్యుణ్ణి కలిశాడు. వారి మధ్య గొప్ప ధార్మిక సంభాషణ జరిగింది.

బుద్ధుడు బౌద్ధులకు అంతిమ లక్ష్యంగా చెప్పిన నిర్వాణం గురించి చర్చ వచ్చింది. బ్రహ్మ చర్యాన్ని పాటించేది శీల శుద్ధి కోసమా? చిత్త శుద్ధి కోసమా? దృష్టి శుద్ధి కోసమా? అని అడిగాడు సారిపుత్రుడు. ప్రతి దానికి ''కాదు'' ''కాదు'' అని పలికాడు పుణ్యుడు.

''మరి''? అడిగాడు సారిపుత్రుడు.

''ఒక వ్యక్తి కోసల నుండి సాకేతకు పోవలసి వచ్చింది. అది చాలా దూరం. ఆ రెండు నగరాల మధ్య ఏడు మజిలీలు ఉన్నాయి. కోసలలో గుర్రపు బండిపై బయలుదేరిన వ్యక్తి కొంతసేపటికి మొదటి మజిలీ దగ్గర ఆగి, అక్కడ మరో గుర్రపు బండి ఎక్కుతాడు. అతను అలా ఏడు మజిలీలలో గుర్రాల మీద, బండ్ల మీద, ఇతర ప్రయాణ సాధనాల మీద ప్రయాణం చేసి, చివరికి ఏడో మజిలీ ముగిశాక సాకేత నగరానికి చేరతాడు.

అతని ఈ ప్రయాణం ఒకే ఒక్క గుర్రపు బండి వల్ల పూర్తయిందా? లేదు కదా! అలాగని ఆ ఒక్క గుర్రపు బండి లేకుండానూ పూర్తి కాదు కదా! ఈ ఏడు మజిలీల మధ్య ఏడు ప్రయాణ సాధనాలు ఉన్నాయి. అవన్నీ గమ్యానికి చేరడానికి సహాయపడ్డవే. ప్రతిదీ గమ్యాన్ని చేర్చకపోయినా, గమ్యం చేరడంలో ప్రతిదీ ఒక భాగమే.

అలాగే... తథాగత బుద్ధుడు చెప్పిన నిర్వాణ పథాన్ని అందుకోవడానికి ఆ గమ్యం చేరడానికి బ్రహ్మచర్యం, శీలవిశుద్ధి, చిత్త విశుద్ధి, దృష్టి విశుద్ధి, సంశయ వితరణ విశుద్ధి, మార్గ విశుద్ధి, జ్ఞాన విశుద్ధి అన్నీ సాధనాలే!'' అని చెప్పాడు.

ఇంత తేలికగా చక్కని ఉపమానం ద్వారా తేటపరచిన పుణ్యుని ప్రతిభకు సారిపుత్రుడు సంతోషపడ్డాడు.

- బొర్రా గోవర్ధన్

మంచి మాట

జీవన స్పృహ

ప్రవహిస్తూ ఉంటేనే మనిషి జీవితంలోకి ప్రయాణం చేస్తూ ఉండగలడు. **స్పృహ మనిషికి స్వేచ్ఛను ఇస్తుంది. స్పృహ వల్ల మనిషికి బయటా, లోపలా చలనం కలుగుతుంది. ఆ చలనం గతికి, ప్రగతికి కారణం అవుతుంది. స్పృహ లేనప్పుడు మనిషికి ఏదీ అందదు, మనిషివల్ల ఏదీ జరగదు. స్పృహ లేకపోతే మనిషికి గతి, ప్రగతి ఉండవు.**

'జీవితం నిన్ను బలపరిచేందుకు సిద్ధంగా ఉంది; అందుకు ముందు నువ్వు జీవితానికి తలుపు తెరిచి ఉంచాలి' అని జర్మన్ తాత్త్వికుడు ఎక్‌హార్ట్ టోల్ తెలియజెప్పారు. స్పృహ ఉన్నప్పుడు మాత్రమే మనం జీవితానికి తలుపు తెరిచి ఉంచగలం. లేదా మనకు ఉన్న స్పృహ మాత్రమే జీవితానికి తలుపు తెరిచి ఉంచగలదు. మత్తు జీవితాన్ని మూసేస్తుంది. మన మత్తును మనం వదిలించుకోవాలి. మనల్ని మన జీవితం బలపరచాలంటే మనకు స్పృహ కావాలి. ఎక్‌హార్ట్ టోల్ స్పృహ విషయంలో ఇంకా ఇలా స్పష్టతను ఇచ్చారు, 'మనకు కలిగే ఆలోచనను స్పృహ అని అనుకోవడం తప్పు. ఆలోచన, స్పృహ పర్యాయపదాలు కావు. ఆలోచన అనేది స్పృహలోని ఒక చిన్న క్రియారూపం మాత్రమే. స్పృహ లేకుండా ఆలోచన ఉనికిలో ఉండదు; కానీ స్పృహకు ఆలోచన అవసరం ఉండదు'. మనం స్పృహ తోనే జీవనం చెయ్యాలి. మనకు ముందు కొందరికైనా సామాజిక స్పృహ ఉండి ఉండబట్టే ఇవాళ సమాజం ఉంది. సంగీతం, సాహిత్యం, ఇతర కళలపై స్పృహ ఉన్న కొందరివల్ల అవి చలామణిలో ఉన్నాయి. విద్య, వృత్తులు, పరిశోధనలు వంటివాటిపై మనకు పూర్వం ఉన్నవాళ్ళకు స్పృహ ఉండబట్టే మనం మనుగడ చెయ్యగలుగుతున్నాం.

స్పృహలేని మనిషి ఊపిరితో ఉన్న రాయి . మనం స్పృహతో మనుగడ చేద్దాం. రాళ్లల్లా కాదు మనుషులమై బతుకుదాం.

స్పృహ అనేది ప్రాణం ఉన్న ప్రతిమనిషికీ ఉండాల్సిన వాటిల్లో అతిముఖ్యమైంది. స్పృహ ఉండాలన్న స్పృహ కూడా లేని వాళ్లు ఉన్నారు. మనిషి ఏ పరిస్థితిలోనూ ఏ రకమైన మత్తుకూ లోనుకాకూడదు. ఏ రకమైన మత్తుకూ మనిషి చిత్తై పోకూడదు. కొన్ని సందర్భాల్లో మనిషిని నిస్పృహ ఆవరిస్తూ ఉంటుంది. దానికి కొనసాగింపుగా నిస్తేజం పట్టి పీడిస్తూ మనిషిని అదిమేస్తూ ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లోంచి మనిషి తెప్పరిల్లి తేరుకోగలగాలి. అందుకు స్పృహ అనేది తప్పకుండా ఉండాలి. స్పృహతో నిస్తేజాన్ని నిశ్వాసిస్తూ ఉత్తేజాన్ని ఉచ్ఛ్వాసిస్తూ ఉండాలి; సత్తేజంతో ఉండాలి.

మనిషిలో లేదా మనిషికి తప్పకుండా ఉండాల్సింది స్పృహ. స్పృహ అన్నది లేకుండా పోతే మనిషి తన నుంచి తాను తప్పిపోతాడు; మనిషి తనకు తాను కాకుండా పోతాడు. ఒక మనిషి తన జీవనోపాధిని కోల్పోవచ్చు, తన ఆస్తుల్ని కోల్పోవచ్చు, తనవి అన్నవాటిని అన్నిటిని ఒక మనిషి కోల్పోవచ్చు కానీ స్పృహను మాత్రం కోల్పోకూడదు. దేన్ని అయినా వదులుకోవచ్చు కానీ స్పృహను వదులుకోకూడదు. మనిషికి ఏదైనా లేకుండా పోవచ్చు కానీ స్పృహ లేకుండా పోకూడదు. తనకు తాను ఉన్నంత వరకూ, తనలో రక్తం పారుతున్నంత వరకూ మనిషికి స్పృహ ఉండాలి. మనిషి రక్తంలో స్పృహ పారుతూ ఉండాలి. మనిషిలో రక్తంలా స్పృహ ప్రవహిస్తూ ఉండాలి. తనలో స్పృహ

- శ్రీకాంత్ జయంతి





సినిమా


సంక్రాంతి బరిలో?



మహేశ్ బాబు

హీరో మహేశ్ బాబు నటిస్తున్న తాజా చిత్రం సంక్రాంతికి బాక్సాఫీస్ బరిలో నిలిచే అవకాశాలు ఉన్నాయనే టాక్ టాలీవుడ్‌లో లేటెస్ట్‌గా వినిపిస్తోంది. 'అతడు', 'ఖలేజా' తర్వాత మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో పూజాహెగ్డే హీరోయిన్. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో జరుగుతోంది. మహేశ్‌బాబు, మలయాళ నటుడు జయరామ్‌లపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు తెలిసింది. కాగా ఈ సినిమాకి 'అడవిలో అర్జునుడు', 'ఆమె కథ', 'అమ్మ కథ' అనే టైటిల్స్ ప్రచారంలో ఉన్నాయి. అయితే ఉగాది పండుగ సందర్భంగా ఈ నెల 22న ఈ మూవీ టైటిల్‌ను అధికారికంగా రిలీజ్ చేయాలనే యోచనలో ఉన్నారట మేకర్స్. అలాగే ఈ మూవీని గతంలో దసరా సందర్భంగా రిలీజ్ చేయాలనుకున్నారు. అయితే తాజాగా సంక్రాంతికి రిలీజ్ చేసే ఆలోచనలో ఉందట యూనిట్. కాగా ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

సెప్టెంబరులో స్టార్ట్



రామ్‌చరణ్

హీరో రామ్‌చరణ్, 'ఉప్పెన' ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబు కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. వెంకట సతీష్ కిలారు నిర్మించనున్న ఈ చిత్రం షూటింగ్ సెప్టెంబరులో స్టార్ట్ కానుంది. ''రంగస్థలం' సినిమాలో నేను చేసిన చిట్టిబాబు పాత్రని మించి ఈ సినిమాలో నా క్యారెక్టరైజేషన్ ఉంటుంది. ఈ సినిమా షూటింగ్‌ను సెప్టెంబరులో స్టార్ట్ చేస్తాం'' అంటూ ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో రామ్‌చరణ్ అన్నారు. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం మృణాళ్ ఠాకూర్ పేరు ప్రచారంలోకి వచ్చింది. కాగా ప్రస్తుతం శంకర్ దర్శకత్వం వహిస్తున్న సినిమాతో రామ్‌చరణ్ బిజీగా ఉన్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ కానుందని ఫిల్మ్‌నగర్ టాక్.

అప్పుడు కన్నీళ్లొచ్చాయి

- కృష్ణవంశీ



కాలిపు మధు, కృష్ణ వంశీ, రాహుల్ సిప్లిగంజ్

''రంగమార్తాండ' సినిమా ప్రీమియర్ చూసిన తర్వాత ఒక చిన్నారి నా వద్దకు వచ్చి, 'నేను మా అమ్మానాన్నలను బాగా చూసుకుంటాను' అని చెప్పడం విశేషం. ప్రతిఒక్కరూ తమ తల్లితండ్రులతో కలిసి ఈ సినిమాను చూడాలి'' అని డైరెక్టర్ కృష్ణవంశీ అన్నారు. ప్రకాష్ రాజ్, రమ్యకృష్ణ, బ్రహ్మానందం ప్రధాన పాత్రల్లో రాహుల్ సిప్లిగంజ్, శివాత్మిక జంటగా నటించిన చిత్రం 'రంగమార్తాండ'. హౌస్‌ఫుల్ మూవీస్, రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై కాలిపు మధు, ఎస్. వెంకట్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఉగాది కానుకగా ఈ నెల 22న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో చిత్ర దర్శకుడు కృష్ణవంశీ మాట్లాడుతూ- ''రంగమార్తాండ' సినిమాకి ప్రకాష్ రాజ్, బ్రహ్మానందం, రమ్యకృష్ణల అద్భుతమైన నటన, ఇళయరాజాగారి సంగీతం, 'సిరివెన్నెల' సీతారామశాస్త్రిగారి సాహిత్యం.. ఇలా అన్నీ అద్భుతంగా కుదిరాయి. రమ్యకృష్ణ కళ్లు చాలా పవర్‌ఫుల్‌గా ఉంటాయి. దీంతో ఎలాంటి పెద్ద డైలాగులు లేకుండా కళ్లతోనే నటించాలని చెప్పినప్పుడు తను సరేనంది. ఈ మూవీ క్లైమాక్స్‌లో రమ్యకృష్ణపై సన్నివేశాలు తీసేటప్పుడు చాలా బాధపడ్డాను. దాదాపు 36 గంటల పాటు ఈ సీన్స్ తీశాను. అప్పుడు నాకు సెంటిమెంట్ అడ్డొచ్చింది.. చిత్రీకరిస్తుంటే కంట్లో నుంచి నాకు నీళ్లు వస్తూనే ఉన్నాయి'' అన్నారు. ''కృష్ణవంశీగారి దర్శకత్వంలో 'రంగమార్తాండ' వంటి మంచి సినిమా చేయడం నా అదృష్టం'' అన్నారు సింగర్, నటుడు రాహుల్ సిప్లిగంజ్.

యాక్షన్ ఎంటర్‌టైనర్ షురూ



విశ్వక్ సేన్, మీనాక్షీ చౌదరి

విశ్వక్ సేన్ హీరోగా కొత్త సినిమా (వీఎస్10 వర్కింగ్ టైటిల్) షురూ అయింది. ఈ చిత్రం ద్వారా రవితేజ ముళ్లపూడి దర్శకునిగా పరిచయమవుతున్నారు. మీనాక్షీ చౌదరి హీరోయిన్. ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ సినిమా ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి రచయిత, దర్శకుడు మచ్చ రవి కెమెరా స్విచ్చాన్ చేయగా, రామ్ తాళ్లూరి సతీమణి రజనీ క్లాప్ ఇచ్చారు. రవితేజ ముళ్లపూడి తొలి షాట్‌కి దర్శకత్వం వహించగా, రామ్ తాళ్లూరి స్క్రిప్ట్‌ను డైరెక్టర్‌కి అందించారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ- ''రామ్ తాళ్లూరిగారు నాకు ఇష్టమైన నిర్మాత. ఇది నా పదో చిత్రం. కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. ఏప్రిల్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అన్నారు. ''నాకు అవకాశం ఇచ్చిన విశ్వక్ సేన్, రామ్ తాళ్లూరిగార్లకు కృతజ్ఞతలు'' అన్నారు రవితేజ ముళ్లపూడి. ''ఈ సినిమా ప్రేక్షకులు, విశ్వక్‌గారి అభిమానుల అంచనాలకు తగ్గకుండా ఉంటుంది'' అన్నారు రామ్ తాళ్లూరి. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, కెమెరా: మనోజ్ కాటసాని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: సత్యం రాజేష్, విద్యాసాగర్. జె.

నాందిలా ఉగ్రంని హిట్ చేయాలి

- 'అల్లరి' నరేష్



కాజల్



అల్లరి నరేష్, మీర్నా మీనన్

''ఉగ్రం' సినిమాని ఎక్కడా రాజీ పడకుండా నిర్మించిన సాహు, హరీష్‌గార్లకు థ్యాంక్స్. నా కెరీర్‌లో అత్యధిక బడ్జెట్‌తో రూపొందిన చిత్రమిది. వేసవిలో మీ ముందుకు వస్తోంది. విజయ్, నా కాంబినేషన్‌లో వచ్చిన 'నాంది' మూవీని హిట్ చేసినట్టు 'ఉగ్రం'ని కూడా పెద్ద హిట్ చేయాలి'' అని హీరో 'అల్లరి' నరేష్ అన్నారు. 'నాంది' ఫేమ్ విజయ్ కనకమేడల దర్శకత్వంలో 'అల్లరి' నరేష్, మీర్నా మీనన్ జంటగా రూపొందిన చిత్రం 'ఉగ్రం'. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించిన ఈ మూవీ వేసవిలో విడుదల కానుంది. శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'దేవేరి..' అంటూ సాగే పాటను హైదరాబాద్‌లో విడుదల చేశారు. శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి పాడారు. విజయ్ కనకమేడల మాట్లాడుతూ- ''నరేష్‌గారి కెరీర్‌లో 'ఉగ్రం' మరో వైవిధ్యమైన సినిమా అవుతుంది. శ్రీచరణ్ అద్భుతమైన మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చారు'' అన్నారు. ఈ వేడుకలో మీర్నా మీనన్, శ్రీచరణ్ పాకాల, సాహు గారపాటి, హరీష్ పెద్ది తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సిద్.

అలా ముందుకెళ్లడమే!

- జాన్వీకపూర్



''సినిమా నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించినందుకు చాలా సంతోషంగా ఉంది. నటిగా నా కెరీర్ ప్రారంభంలోనే ఇండస్ట్రీ, ప్రేక్షకుల నుంచి నాకు ఇంత మంచి గుర్తింపు లభిస్తున్నది నా తల్లిదండ్రుల వల్లేనని(బోనీకపూర్, శ్రీదేవి) నాకు తెలుసు. వీరి వారసత్వాన్ని కొనసాగించడానికి నా వంతుగా చాలా కష్టపడుతున్నాను'' అంటున్నారు హీరోయిన్ జాన్వీకపూర్. ఢిల్లీలో ఇటీవల జరిగిన ఓ సమావేశంలో పాల్గొన్న జాన్వీకపూర్ మాట్లాడుతూ- ''ఆడియన్స్ అటెన్షన్‌ను అందురూ కోరుకుంటారు. ఓ నటిగా, సెలబ్రిటీగా నేనూ కోరుకుంటాను. కానీ, వారు నా వర్క్ గురించి మాట్లాడుకుంటున్నప్పుడు నాకు చాలా ఆనందంగా ఉంటుంది. జిమ్‌కు నేను ఎలాంటి దుస్తులు ధరించి వెళ్లాలనే విషయంపై కొందరు చర్చించుకోవడం సరికాదు. అయినా పబ్లిక్ లైఫ్‌లో ఉన్నప్పుడు మన గురించి పలురకాల అభిప్రాయాలు వినిపిస్తుంటాయి. వాటి గురించి అతిగా ఆలోచించుకోవాల్సిన అవసరం లేదు. మన పని మనం చేసుకుంటూ ముందుకు వెళ్లడమే'' అన్నారు. అలాగే ఎన్టీఆర్ సినిమాలో హీరోయిన్‌గా నటించనున్న విషయం గురించి జాన్వీ మాట్లాడుతూ- ''ఎన్టీఆర్‌గారితో స్క్రీన్ షేర్ చేసుకోవాలన్న నా కల నిజమైంది. సెట్స్‌లోకి ఎప్పుడెప్పుడు వెళ్దామా? అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను'' అన్నారు.

ఉగాదికి థ్రిల్

హీరోయిన్ కాజల్ అగర్వాల్ ఈ ఉగాదికి ప్రేక్షకులకు థ్రిల్‌ని పంచేందుకు సిద్ధమయ్యారు. కళ్యాణ్ దర్శకత్వంలో కాజల్ అగర్వాల్, రాధికా శరత్ కుమార్, యోగిబాబు ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'ఘోస్టి'. ఈ నెల 17న విడుదలైన ఈ చిత్రాన్ని 'కోస్టి' పేరుతో గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ నెల 22న తెలుగులో విడుదల చేస్తోంది. ''హారర్ కామెడీగా రూపొందిన చిత్రం 'కోస్టి'. ఇందులో తండ్రి, కుమార్తె మధ్య అనుబంధంతో పాటు థ్రిల్ అంశాలు కూడా ఉన్నాయి. ఆడియన్స్ ఉలిక్కిపడే సన్నివేశాలు చాలా ఉన్నాయి. ఇన్‌స్పెక్టర్ ఆరతి పాత్రలో కాజల్ బాగా నటించారు. గ్యాంగ్‌స్టర్ దాస్‌గా దర్శకుడు కేఎస్ రవికుమార్ చేశారు. సామ్ సీఎస్ సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. ఉగాదికి తెలుగు ప్రేక్షకులకు మంచి వినోదం అందించే చిత్రమిది'' అని యూనిట్ పేర్కొంది.

మాఫియా నేపథ్యంలో...



ఇమ్మోర్టల్, పూజ, కట్ల డాండీ

కట్ల ఇమ్మోర్టల్, కట్ల డాండి హీరోలుగా, పూజ నాగేశ్వర్ హీరోయిన్‌గా కొత్త సినిమాకి శ్రీకారం చుట్టారు. సంపత్ కుమార్ దర్శకత్వంలో ఎస్ఆర్‌కే ప్రొడక్షన్స్‌పై శ్రీనివాస రెడ్డి కర్రి నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నటి కవిత కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు సుమన్ క్లాప్ కొట్టగా, స్వామి నాయుడు గౌరవ దర్శకత్వం వహించారు. ''మాఫియా నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం ఇది'' అన్నారు సంపత్ కుమార్. ఈ చిత్రానికి కెమెరా, సంగీతం, స్క్రీన్‌ప్లే: కె.రాజేంద్ర ప్రసాద్.

విదేశాలకు కాంతార



రిషబ్‌శెట్టి

భారతీయ ప్రేక్షకులను ఆకట్టుకున్న 'కాంతార' చిత్రం ఇప్పుడు విదేశీ ఆడియన్స్‌ని అలరించేందుకు సిద్ధం అవుతోంది. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'కాంతార'. సప్తమి గౌడ హీరోయిన్. హోంబలే ఫిలింస్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రం గత ఏడాది సెప్టెంబరు 30న కన్నడలో విడుదలై సూపర్ హిట్‌గా నిలిచింది. ఆ తర్వాత తెలుగు, తమిళం, హిందీ.. ఇలా ఇతర భాషల్లో కూడా రిలీజ్ చేశారు. సుమారు 20కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం దాదాపు 450 కోట్ల రూపాయల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ విశ్లేషకుల లెక్కలు చెబుతున్నాయి. తాజాగా ఈ మూవీని విదేశాల్లో కూడా రిలీజ్ చేయాలని చిత్రయూనిట్ నిర్ణయించుకుంది. స్పానిష్, ఇటాలియన్ భాషల్లో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు మొదలయ్యాయని, థియేటర్స్‌లోనే విడుదల చేస్తామని చిత్రబృందం వెల్లడించింది.



షై హోప్ సెంచరీ: విండీస్ విజయం

దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో వెస్టిండీస్ 48 పరుగుల తేడాతో గెలిచి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి వన్డే వర్షం కారణంగా రద్దయింది. ఈస్ట్ లండన్‌లో జరిగిన రెండో వన్డేలో కెప్టెన్ షై హోప్ (115 బంతుల్లో 128 నాటౌట్; 5 ఫోర్లు, 7 సిక్స్‌లు) అజేయ సెంచరీ చేశాడు. దాంతో తొలుత విండీస్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 338 పరుగులు చేసింది. అనంతరం దక్షిణాఫ్రికా 41.4 ఓవర్లలో 287 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ బవుమా (118 బంతుల్లో 144 ; 11 ఫోర్లు, 7 సిక్స్‌లు) వీరోచిత సెంచరీ వృథా అయింది.

కివీస్ బౌలర్ల విజృంభణ... ఫాలోఆన్‌లో శ్రీలంక

న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరుగుతున్న రెండో టెస్టులోనూ శ్రీలంక పరాజయం దిశగా పయనిస్తోంది. 416 పరుగులతో వెనుకబడి ఫాలోఆన్ ఆడుతున్న శ్రీలంక మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు కోల్పోయి 113 పరుగులు చేసింది. లంక మరో 303 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 580/4కు జవాబుగా తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన శ్రీలంక 164 పరుగులకు ఆలౌటైంది. హెన్రీ (3/44), బ్రేస్‌వెల్ (3/50) లంకను దెబ్బ తీశారు.




ఆసీస్ పేస్‌కు భారత్ బోల్తా



గిల్ రోహిత్ సూర్య రాహుల్

రెండు రోజులుగా కురిసిన వర్షాలతో మ్యాచ్ జరుగుతుందా లేదా అనే సందేహం... తీరా మ్యాచ్ సమయానికి వరుణుడు కూడా కరుణించడంతో ... నిర్ణీత సమయానికే ఆట ప్రారంభం... ఇక పరుగుల విందు ఖాయమని అభిమానులు ఆశగా ఎదురుచూస్తుండగా... పిచ్‌పై ఉన్న తేమను సద్వినియోగం చేసుకున్న ఆసీస్ పేస్ బౌలర్లు మిచెల్ స్టార్క్, సీన్ అబాట్, నాథన్ ఎలిస్ నిప్పులు చెరిగే బంతులతో భారత బ్యాటర్లను బెంబేలెత్తించారు. స్టార్క్ స్వింగ్ బౌలింగ్‌కు భారత స్టార్ బ్యాటర్లు గిల్, రోహిత్, రాహుల్, సూర్యకుమార్ ఇలా వచ్చి అలా వెళ్లారు. దాంతో టీమిండియా 117 పరుగులకే కుప్పకూలింది. అనంతరం ఆసీస్ ఓపెనర్లు మిచెల్ మార్ష్, ట్రావిస్ హెడ్ భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. భారత బ్యాటర్లు చేతులెత్తేసిన పిచ్‌పై ఆసీస్ ఓపెనర్లు అదరగొట్టి 11 ఓవర్లలోనే తమ జట్టుకు విజయాన్ని అందించారు.



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్టార్క్ (5/53)

- రెండో వన్డేలో టీమిండియా పరాజయం
- 10 వికెట్లతో ఆస్ట్రేలియా ఘనవిజయం
- 5 వికెట్లతో మెరిసిన స్టార్క్
- అబాట్‌కు 3, ఎలిస్‌కు 2 వికెట్లు
- 117 పరుగులకే కుప్పకూలిన భారత్
- 11 ఓవర్లలోనే ఆసీస్ లక్ష్య ఛేదన
- బుధవారం చెన్నైలో మూడో వన్డే

234 రెండో వన్డేలో ఆసీస్ విజయం పూర్తయిన సమయానికి మిగిలి ఉన్న బంతులు. మిగిలి ఉన్న బంతుల పరంగా వన్డేల్లో భారత్‌కిదే అతిపెద్ద ఓటమి.

2 స్వదేశంలో భారత్ ఓ వన్డేలో 10 వికెట్ల తేడాతో ఓడిపోవడం ఇది రెండోసారి మాత్రమే. 2020లో ముంబైలో ఆసీస్ చేతిలోనే భారత్ తొలిసారి 10 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది.

2 స్వదేశంలో భారత జట్టు మొత్తం 10 వికెట్లను పేసర్లకే కోల్పోవడం ఇది రెండోసారి. 2009లో గువాహటిలో జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ పేస్ బౌలర్లు (బొలింగర్ 5, మిచెల్ జాన్సన్ 3, వాట్సన్ 2 వికెట్లు) ఈ ఘనత సాధించారు.


సాక్షి, విశాఖపట్నం: సిరీస్‌లో నిలవాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. డాక్టర్ వైఎస్ఆర్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో ఆదివారం జరిగిన రెండో వన్డేలో ఆస్ట్రేలియా 10 వికెట్ల తేడాతో భారత్‌పై ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచిన ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 26 ఓవర్లలో కేవలం 117 పరుగులకే ఆలౌటైంది. ఆసీస్ పేసర్లు మిచెల్ స్టార్క్ (5/53), సీన్ అబాట్ (3/23), నాథన్ ఎలిస్ (2/13) తమ స్వింగ్ బౌలింగ్‌తో భారత్‌ను దెబ్బ కొట్టారు. భారత ఇన్నింగ్స్‌లో కోహ్లి (35 బంతుల్లో 31; 4 ఫోర్లు) టాప్ స్కోరర్‌కాగా... రోహిత్ శర్మ (15 బంతుల్లో 13; 2 ఫోర్లు), రవీంద్ర జడేజా (39 బంతుల్లో 16; 1 ఫోర్), అక్షర్ పటేల్ (29 బంతుల్లో 29 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) మాత్రమే రెండంకెల స్కోరును దాటారు. అనంతరం ఆస్ట్రేలియా ఆడుతూ పాడుతూ లక్ష్యాన్ని ఛేదించింది. 11 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 121 పరుగులు సాధించింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (30 బంతుల్లో 51 నాటౌట్; 10 ఫోర్లు), మిచెల్ మార్ష్ (36 బంతుల్లో 66 నాటౌట్; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) అలరించారు. స్టార్క్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ప్రస్తుతం రెండు జట్లు 1–1తో సమంగా ఉండగా... సిరీస్‌లోని చివరిదైన మూడో వన్డే ఈనెల 22న చెన్నైలో జరుగుతుంది.

సూర్యకుమార్ మళ్లీ విఫలం...

బ్యాటింగ్‌కు స్వర్గధామంగా ఉన్న విశాఖ పిచ్‌పై భారత బ్యాటర్లు తడబడ్డారు. పిచ్‌పై ఉన్న తేమను ఆసీస్ పేసర్ స్టార్క్ సద్వినియోగం చేసుకున్నాడు. స్వింగ్‌తోపాటు కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేయడంతో భారత బ్యాటర్లు ఇబ్బంది పడ్డారు. స్టార్క్ బౌలింగ్‌లో గిల్, రోహిత్ వికెట్లకు దూరంగా వెళ్తున్న బంతులను ఆడి అవుటయ్యారు. సూర్యకుమార్ యాదవ్ వరుసగా రెండో వన్డేలోనూ స్టార్క్ బౌలింగ్‌లో తొలి బంతికే ఎల్బీడబ్ల్యూగా అవుటయ్యాడు. ఆ తర్వాత రాహుల్, హార్దిక్, కోహ్లి, జడేజా కూడా ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయారు. అబాట్ వేసిన ఇన్నింగ్స్ పదో ఓవర్లో హార్దిక్ పాండ్యా (1) షాట్ ఆడగా... స్టీవ్ స్మిత్ స్లిప్‌లో తన కుడి వైపునకు గాల్లో అమాంతం డైవ్ చేస్తూ తీసుకున్న క్యాచ్ హైలైట్‌గా నిలిచింది.

ధనాధన్ ఆట...

స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్‌కు ఓపెనర్లు హెడ్, మార్ష్ శుభారంభం ఇచ్చారు. వీరిద్దరు భారత బౌలర్లపై ఎదురుదాడి చేశారు. ముఖ్యంగా మార్ష్ చెలరేగిపోయాడు. షమీ వేసిన ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో మార్ష్ 2 సిక్స్‌లు, 1 ఫోర్ కొట్టగా... సిరాజ్ వేసిన ఇన్నింగ్స్ ఆరో ఓవర్లో హెడ్ వరుసగా నాలుగు ఫోర్లు బాదాడు. అనంతరం హార్దిక్ వేసిన ఇన్నింగ్స్ ఎనిమిదో ఓవర్లో మార్ష్ 3 సిక్స్‌లతో అలరించాడు. దాంతో ఆసీస్ 8 ఓవర్లలో 90 పరుగులు సాధించింది. ఆ తర్వాతా ఇదే జోరు కొనసాగించి ఆసీస్ 11 ఓవర్లలో లక్ష్యాన్ని అందుకుంది.



మెరుపు ఇన్నింగ్స్ ఆడిన మిచెల్ మార్ష్, హెడ్

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) స్మిత్ (బి) స్టార్క్ 13; శుబ్‌మన్ గిల్ (సి) లబుషేన్ (బి) స్టార్క్ 0; విరాట్ కోహ్లి (ఎల్బీడబ్ల్యూ) (బి) ఎలిస్ 31; సూర్యకుమార్ యాదవ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) స్టార్క్ 0; కేఎల్ రాహుల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) స్టార్క్ 9; హార్దిక్ పాండ్యా (సి) స్మిత్ (బి) అబాట్ 1; రవీంద్ర జడేజా (సి) క్యారీ (బి) ఎలిస్ 16; అక్షర్ పటేల్ (నాటౌట్) 29; కుల్దీప్ యాదవ్ (సి) హెడ్ (బి) అబాట్ 4; షమీ (సి) క్యారీ (బి) అబాట్ 0; సిరాజ్ (బి) స్టార్క్ 0; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం** (26 ఓవర్లలో ఆలౌట్) 117. **వికెట్ల పతనం:** 1–3, 2–32, 3–32, 4–48, 5–49, 6–71, 7–91, 8–103, 9–103, 10–117. **బౌలింగ్:** మిచెల్ స్టార్క్ 8–1–53–5, కామెరాన్ గ్రీన్ 5–0–20–0, సీన్ అబాట్ 6–0–23–3, నాథన్ ఎలిస్ 5–0–13–2, ఆడమ్ జంపా 2–0–6–0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: ట్రావిస్ హెడ్ (నాటౌట్) 51; మిచెల్ మార్ష్ (నాటౌట్) 66; ఎక్స్‌ట్రాలు 4, **మొత్తం** (11 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 121. **బౌలింగ్:** షమీ 3–0–29–0, సిరాజ్ 3–0–37–0, అక్షర్ పటేల్ 3–0–25–0, హార్దిక్ పాండ్యా 1–0–18–0, కుల్దీప్ యాదవ్ 1–0–12–0.

బోపన్న కొత్త చరిత్ర...

- ఏటీపీ మాస్టర్స్ టైటిల్ నెగ్గిన పెద్ద వయస్కుడిగా రికార్డు
- ఎబ్డెన్‌తో కలిసి ఇండియన్ వెల్స్ ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ హస్తగతం
- ఫైనల్లో టాప్ సీడ్ జోడీపై గెలుపు
- రూ. 3 కోట్ల 60 లక్షల ప్రైజ్‌మనీ సొంతం



విన్నర్స్ ట్రోఫీతో బోపన్న–ఎబ్డెన్ జోడీ

కాలిఫోర్నియా: నాలుగు పదుల వయసు దాటినా తనలో సత్తా తగ్గలేదని భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న మరోసారి నిరూపించుకున్నాడు. ఇండియన్ వెల్స్ ఓపెన్ ఏటీపీ మాస్టర్స్ సిరీస్–1000 టోర్నీలో తన భాగస్వామి మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)తో కలిసి బోపన్న పురుషుల డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6–3, 2–6, 10–8తో 'సూపర్ టైబ్రేక్'లో టాప్ సీడ్ వెస్లీ కూల్‌హాఫ్ (నెదర్లాండ్స్)–నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్) జోడీని ఓడించింది. ఈ గెలుపుతో 43 ఏళ్ల బోపన్న ఏటీపీ మాస్టర్స్ సిరీస్ టైటిల్ నెగ్గిన పెద్ద వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. డానియల్ నెస్టర్ (కెనడా) పేరిట ఉన్న రికార్డును బోపన్న బద్దలు కొట్టాడు. 2015లో నెస్టర్ 42 ఏళ్ల వయసులో సిన్సినాటి మాస్టర్స్ సిరీస్ డబుల్స్ టైటిల్‌ను సాధించాడు.

గంటా 24 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో బోపన్న ద్వయం తొమ్మిది ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి జోడీ సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. విజేతగా నిలిచిన బోపన్న–ఎబ్డెన్ జోడీకి 4,36,730 డాలర్ల (రూ. 3 కోట్ల 60 లక్షలు) ప్రైజ్‌మనీ, 1000 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ వెస్లీ కూల్‌హాఫ్–నీల్ స్కుప్‌స్కీ జంటకు 2,31,660 డాలర్ల (రూ. 1 కోటీ 91 లక్షలు) ప్రైజ్‌మనీ, 600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

5 బోపన్న కెరీర్‌లో ఇది ఐదో మాస్టర్స్ సిరీస్ టైటిల్. గతంలో అతను మోంటెకార్లో (2017లో), మాడ్రిడ్ (2015లో), పారిస్ ఓపెన్ (2012, 2011లో) మాస్టర్స్ సిరీస్ టైటిల్స్ సాధించాడు. మరో ఐదు మాస్టర్స్ సిరీస్ టోర్నీలలో రన్నరప్‌గా నిలిచాడు.

24 బోపన్న కెరీర్‌లో ఇది 24వ డబుల్స్ టైటిల్. ఈ ఏడాది రెండోది. ఈ సీజన్‌లో ఎబ్డెన్‌తోనే కలిసి బోపన్న దోహా ఓపెన్‌లో విజేతగా నిలిచాడు.

> ఈ విజయం ఎంతో ప్రత్యేకం. ఇండియన్ వెల్స్ టోర్నీకి టెన్నిస్ స్వర్గధామం అని పేరు ఉంది. ఎన్నో ఏళ్లుగా నేను ఈ టోర్నీలో ఆడుతున్నాను. విజేతలెందరినో చూశాను. ఈసారి నేను చాంపియన్‌గా నిలిచినందుకు ఆనందంగా ఉంది. –రోహన్ బోపన్న

ప్రిక్వార్టర్ ఫైనల్లో నిఖత్



న్యూఢిల్లీ: ప్రపంచ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు తమ ఆధిపత్యాన్ని చాటుకుంటున్నారు. ఆదివారం బరిలోకి దిగిన ఇద్దరు భారత బాక్సర్లు నిఖత్ జరీన్ (50 కేజీలు), మనీషా మౌన్ (57 కేజీలు) తమ ప్రత్యర్థులపై ఏకపక్ష విజయాలు నమోదు చేసి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన తెలంగాణకు చెందిన నిఖత్ జరీన్ రెండో రౌండ్ బౌట్‌లో 5–0తో ఆఫ్రికా చాంపియన్ బూఆలమ్ రుమేసా (అల్జీరియా)ను ఓడించగా... మనీషా 5–0తో రహీమి టీనా (ఆస్ట్రేలియా)పై గెలిచింది.

అక్షదీప్ సింగ్‌కు స్వర్ణం



నోమి (జపాన్): ఆసియా 20 కిలోమీటర్ల రేస్ వాకింగ్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్ అక్షదీప్ సింగ్ 1 గంట 20 నిమిషాల 57 సెకన్లలో గమ్యానికి చేరి స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఓపెన్ కేటగిరీలో పోటీపడిన భారత అథ్లెట్లు వికాష్ సింగ్, పరమ్‌జీత్ ఈ ఏడాది ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు, పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందారు. ప్రపంచ చాంపియన్‌షిప్, పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రమాణ సమయం 1 గంట 20 నిమిషాల 10 సెకన్లను వికాష్ (1గం:20ని :05 సెకన్లు), పరమ్‌జీత్ (1గం: 20:08 సెకన్లు) అందుకున్నారు. నిబంధనల ప్రకారం ఓపెన్ కేటగిరీలో పోటీపడిన వారి సమయాన్ని పతకాల కోసం పరిగణనలోకి తీసుకోరు.

విద్య, ఉద్యోగ సమాచారం

వ్యవసాయ పరిశోధన కేంద్రాల్లో 195 ఎస్ఎంఎస్, ఎస్టీవో పోస్టులు

న్యూఢిల్లీలోని అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ఏఎస్ఆర్‌బీ).. దేశవ్యాప్తంగా ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాలు, వివిధ వ్యవసాయ, పశు, మత్స్య పరిశోధనా కేంద్రాల్లో సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్ట్(ఎస్ఎంఎస్), సీనియర్ టెక్నికల్ ఆఫీసర్(ఎస్టీవో)పోస్టుల భర్తీతోపాటు జాతీయ అర్హత పరీక్ష(నెట్)–2023 నిర్వహణకు సంబంధించి ప్రకటనను విడుదలచేసింది. » మొత్తం పోస్టుల సంఖ్య: 195
» పోస్టుల వివరాలు: సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్ట్(ఎస్ఎంఎస్)–163, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్(ఎస్టీవో)–32.
» అర్హత: సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమానం ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 10.04.2023 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. నెట్‌కు సంబంధించి 01.01.2023 నాటికి అభ్యర్థి 21 ఏళ్ల నిండి ఉండాలి. దీనికి గరిష్ఠ వయోపరిమితి లేదు.
» వేతనం:నెలకు ఎస్ఎంఎస్, ఎస్టీవో పోస్టులకు రూ.56,100 నుంచి రూ.1,77,500 ఉంటుంది.
» నెట్, ఎస్ఎంఎస్, ఎస్టీవో–2023 ఉత్తీర్ణత మార్కులు: యూఆర్ అభ్యర్థులకు 75.0(50%), ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ 67.5(45%), ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు 60.0(40%).
» ఎంపిక విధానం: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది: 22.03.2023.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 10.04.2023.
» ఆన్‌లైన్ పరీక్ష తేది: 26.04.2023 నుంచి 30.04.2023 వరకు
» వెబ్‌సైట్: www.asrb.org.in

ఐఐఎస్సీ, బెంగళూరులో బీఎస్సీ(రీసెర్చ్) కోర్సులో ప్రవేశాలు

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ).. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎస్సీ(రీసెర్చ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
» రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు: బయాలజీ, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ ఇన్విరాన్‌మెంటల్ సైన్స్, మెటీరియల్స్, మ్యాథ్స్, ఫిజిక్స్.
» అర్హత: 60శాతం మార్కులతో 2022లో 10+2/ఇంటర్మీడియట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా) తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పరీక్షకు హాజరయ్యేవారు కూడా అర్హులే.
» ఎంపిక విధానం: కేవీపీవై–2021/జేఈఈ మెయిన్–2023/జేఈఈ అడ్వాన్స్‌డ్–2023/నీట్(యూజీ)–2023/ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 2023 స్కోరు ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.05.2023.
» వెబ్‌సైట్: www.iisc.ac.in

నిట్ వరంగల్‌లో జూనియర్ రీసెర్చ్ ఫెలోలు

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్), డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజనీరింగ్.. తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» అర్హత: బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్(కెమికల్ ఇంజనీరింగ్/మెకానికల్ ఇంజనీరింగ్/మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. »ప్రాజెక్ట్ కాల వ్యవధి:3 ఏళ్లు
» వేతనం: నెలకు రూ.31,000 నుంచి రూ.35,000 చెల్లిస్తారు.
» దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్: pvsuresh@nitw.ac.in
» దరఖాస్తులకు చివరితేది: 27.03.2023.
» వెబ్‌సైట్: www.nitw.ac.in

నిట్ వరంగల్‌లో పోస్ట్ డాక్టోరల్ ఫెలోలు

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజనీరింగ్.. తాత్కాలిక ప్రాతిపదికన పోస్ట్ డాక్టోరల్ ఫెలోల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» అర్హత: పీహెచ్‌డీ(అయానిక్ లిక్విడ్ సింథసిస్ అండ్ క్యారెక్టరైజేషన్/ఎనర్జీ స్టోరేజ్ డివైజెస్).
» ప్రాజెక్ట్ వ్యవధి: 2 ఏళ్లు.
» వేతనం: నెలకు రూ.70,000 చెల్లిస్తారు.
» దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్: manohar@nitw.ac.in
» దరఖాస్తులకు చివరితేది: 20.03.2023.
» వెబ్‌సైట్: www.nitw.ac.in

ఎన్ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్‌లో రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టులు

హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్.. తాత్కాలిక ప్రాతిపదికన రీసెర్చ్ అసిస్టెంట్–ఎ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 03
» అర్హత: పీజీ(సోషల్ సైన్సెస్)తో పాటు రూరల్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ ఏరియాలో రెండేళ్ల అనుభవం ఉండాలి.
» వేతనం: నెలకు రూ.22,000 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 25.03.2023.
» వెబ్‌సైట్: www.nirdpr.in

కేంద్ర ప్రభుత్వ కొలువుల స్వాగతం

» 5,369 పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నోటిఫికేషన్
» గ్రూప్–సి, గ్రూప్–డి, మల్టీ టాస్కింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» డిగ్రీ ఇంటర్, పదో తరగతి అర్హతతో దరఖాస్తుకు అవకాశం
» రాత పరీక్ష, స్కిల్ టెస్టులలో మెరిట్ ఆధారంగా నియామకాలు

కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో.. ఉద్యోగ అవకాశం స్వాగతం పలుకుతోంది! జాతీయ స్థాయిలో.. అతి పెద్ద నియామక సంస్థగా పేరొందిన.. స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. 5,369 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్–సి, గ్రూప్–డి, మల్టీ టాస్కింగ్ పోస్టులకు నియామక ప్రక్రియ చేపట్టనుంది. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ జాబ్ నోటిఫికేషన్, ఉద్యోగాల వివరాలు, అర్హతలు, ఎంపిక విధానం వివరాలు..

స్టాఫ్ సెలక్షన్ కమిషన్.. ప్రతి ఏటా సీహెచ్ఎస్ఎల్, సీజీఎల్ వంటి పరీక్షలను నిర్వహిస్తున్న సంస్థ. అందుకే ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్ల కోసం ఉద్యోగార్థులు ఎదురు చూస్తుంటారు. ఇలాంటి వారికి మరో చక్కటి అవకాశం.. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఫేజ్ – 11 – 2023 సెలక్షన్ పోస్ట్స్ నియామక నోటిఫికేషన్.

మొత్తం పోస్టులు 5,369

ఎస్ఎస్‌సీ తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం 5,369 పోస్టుల భర్తీ చేపట్టనుంది. రీజియన్ల వారీగా ఈ పోస్టుల భర్తీ చేపట్టనుంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన సదరన్ రీజియన్‌లో 270 ఖాళీలు అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది 2,065 పోస్టులకే ఫేజ్–10– సెలక్షన్ పోస్టుల భర్తీ చేపట్టిన ఎస్ఎస్‌సీ.. ఈ ఏడాది మాత్రం ఫేజ్–11 ద్వారా 5,369 పోస్టులను భర్తీ చేయనుంది.

అడ్మిన్ టు టెక్నికల్

ఎస్ఎస్‌సీ ఆయా విభాగాల్లో అడ్మినిస్ట్రేషన్ మొదలు టెక్నికల్, నర్సింగ్, రీసెర్చ్, లీగల్, మెడికల్ అనుబంధ పోస్టులను భర్తీ చేయనుంది. డిగ్రీ అర్హతతో.. లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్, ఫెర్టిలైజర్ ఇన్‌స్పెక్టర్, చార్జ్‌మెన్(ఐటీ), సీనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్, రీసెర్చ్ అసోసియేట్ తదితర పోస్టులకు ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది.

అర్హతలు

- ఆయా పోస్టులను అనుసరించి మార్చి 27, 2023 నాటికి బ్యాచిలర్ డిగ్రీ, ఇంటర్మీడియెట్, పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి.
- ఇంటర్మీడియెట్ అర్హతతో.. టైపిస్ట్, లైబ్రేరియన్, టెక్నీషియన్, టెక్నికల్ అసిస్టెంట్, సీనియర్ డ్రాఫ్ట్స్‌మెన్ తదితర పోస్టులను భర్తీ చేయనుంది.
- పదో తరగతి అర్హతగా.. ఆయా శాఖల్లో అటెండెంట్ పోస్టులను భర్తీ చేయనుంది.
- వయసు: ఆయా పోస్టులను అనుసరించి 2023 జనవరి 1 నాటికి 18–25 ఏళ్లు, 18–27 ఏళ్లు, 18–30 ఏళ్ల మధ్యలో ఉండాలి.

తొలి దశలో రాత పరీక్ష

- పోస్టుల నియామక ప్రక్రియలో భాగంగా తొలి దశలో రాత పరీక్ష నిర్వహిస్తారు.

ఈ రాత పరీక్ష నాలుగు విభాగాల్లో 200 మార్కులకు ఉంటుంది. వివరాలు..

విభాగం ఎ– జనరల్ ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలు–50 మార్కులకు; విభాగం బి– జనరల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలు–50 మార్కులకు ;విభాగం సి–క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 25 ప్రశ్నలు–50 మార్కులకు; విభాగం డి ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలు–50 మార్కులకు ఉంటుంది.

పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ అర్హతగా పేర్కొన్న అన్ని పోస్టులకు ఈ విభాగాల్లో ఇదే విధానంలో పరీక్ష ఉంటుంది. ఆయా అర్హతలకు అనుగుణంగా ప్రశ్నల క్లిష్టత స్థాయి ఉంటుంది. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం ఒక గంట. ప్రతి తప్పు సమాధానానికి 1/2 మార్కు నెగెటివ్ మార్కింగ్ నిబంధనను అమలు చేస్తున్నారు.

రెండో దశ స్కిల్ టెస్ట్

- రాత పరీక్షతోపాటు కొన్ని పోస్టులకు రెండో దశలో స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ స్కిల్ టెస్ట్‌లో భాగంగా టైపింగ్, డేటాఎంట్రీ, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ విభాగాల్లో అభ్యర్థుల నైపుణ్యాన్ని పరిశీలిస్తారు.
- రాత పరీక్షలో పొందిన మెరిట్ ఆధారంగా..ఒక్కో పోస్ట్‌కు 20మందిని స్కిల్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు.

అర్హతను బట్టి.. క్లిష్టత స్థాయి

ఎస్ఎస్‌సీ నియామక రాత పరీక్షలో పేర్కొన్న విభాగాలు, అంశాలు అన్ని పోస్టులలోనూ ఉమ్మడిగా ఉన్నప్పటికీ.. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న పోస్ట్‌కు పేర్కొన్న అర్హత స్థాయిని బట్టి ప్రశ్నల క్లిష్టత స్థాయి ఉంటుంది. పదో తరగతి అర్హత పోస్టులకు, ఇంటర్ అర్హత పోస్టులకు, డిగ్రీ అర్హత పోస్టులకు వేర్వేరు ప్రశ్నలు ఎదురవుతాయి.

ఆకర్షణీయ వేతనాలు

ఎస్ఎస్‌సీ ఫేజ్–11 సెలక్షన్ పోస్ట్ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి నియామకాలు ఖరారు చేసుకుంటే.. ఆకర్షణీయ వేతనంతో కెరీర్ ప్రారంభించే అవకాశం ఉంటుంది. తాజా నోటిఫికేషన్‌లో.. ఆయా పోస్టులను అనుసరించి పే లెవల్–1 నుంచి పే లెవల్–7 వరకు వేతన శ్రేణిని పేర్కొన్నారు. పే లెవల్–1 ఉద్యోగాలకు రూ.18,000– రూ.56,900; పే లెవల్–2 ఉద్యోగాలకు రూ.19,900 – రూ.63,200; పే లెవల్–3 ఉద్యోగాలకు రూ.21,700–రూ.69,100; పే లెవల్–4 ఉద్యోగాలకు రూ.25,500 –రూ.81,100; పే లెవల్–5 ఉద్యోగాలకు రూ. 29,200 – రూ.92,300; పే లెవల్–6 ఉద్యోగాలకు రూ.35,400–రూ.1,12,400; పే లెవల్–7 ఉద్యోగాలకు రూ.44,900–రూ.1,42,400గా వేతన శ్రేణులుగా ఉన్నాయి.

విజయం సాధించేలా..!

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే పోస్టులకు లక్షల సంఖ్యలో పోటీ ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు అందుబాటులో ఉన్న సమయంలో నిర్దిష్ట వ్యూహంతో పటిష్ఠ ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి. ముందుగా సిలబస్‌ను పరిశీలించాలి. దాని ఆధారంగా ప్రిపరేషన్‌కు ఉపక్రమించాలి.

జనరల్ ఇంటెలిజెన్స్

ఈ విభాగంలో రాణించాలంటే.. గుర్తులు, ప్రాబ్లమ్ సాల్వింగ్, రిలేషన్ షిప్, క్లాసిఫికేషన్, నంబర్ సిరీస్, సిమాటిక్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వెన్ డయాగ్రమ్స్, డ్రాయింగ్ ఇన్ఫరెన్సెస్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

జనరల్ అవేర్‌నెస్

జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి ముఖ్యాంశాలపై అవగాహన పెంచుకోవాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

అర్థమెటిక్‌తోపాటు ప్యూర్ మ్యాథ్స్ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. నంబర్ సిస్టమ్స్, డెసిమల్స్, ఫ్రాక్షన్స్, పర్సంటేజెస్, రేషియోస్, ఆల్జీబ్రా, ట్రిగ్నోమెట్రీ, లీనియర్ ఈక్వేషన్స్, టాంజెంట్స్ వంటి ప్యూర్ మ్యాథ్స్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగానికి సంబంధించి వ్యాకరణంపై పట్టు సాధించాలి. పార్ట్స్ ఆఫ్ స్పీచ్ మొదలు ప్యాసేజ్ కాంప్రహెన్షన్ వరకూ.. అన్ని రకాల గ్రామర్ అంశాలను అభ్యసనం చేయాలి. ముఖ్యంగా యాక్టివ్ అండ్ పాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, సినానిమ్స్, యాంటానిమ్స్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్‌లపై పట్టు సాధించాలి.



పునశ్చరణ, నమూనా పరీక్షలు

ప్రిపరేషన్ క్రమంలో అభ్యర్థులు నిరంతరం రివిజన్ కొనసాగించేలా ప్లాన్ చేసుకోవాలి. అదే విధంగా ఒక టాపిక్ చదవడం పూర్తయ్యాక నమూనా పరీక్షలు, మాక్ టెస్ట్‌లకు హాజరవ్వాలి. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విషయంలో అర్థమెటిక్‌పై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. ఇందుకోసం పదో తరగతి స్థాయిలోని గణిత పుస్తకాలతో తమ ప్రిపరేషన్ ప్రారంభించాలి. వాటి ద్వారా ముందుగా కాన్సెప్ట్‌లపై అవగాహన ఏర్పరచుకుని అప్లికేషన్ దృక్పథంతో ప్రాక్టీస్ చేయాలి.

ప్రీవియస్ పేపర్ల ఆధారంగా

సీహెచ్ఎస్ఎల్, సీజీఎల్ గత ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం ద్వారా పరీక్షల్లో ఎస్ఎస్‌సీ అడిగే ప్రశ్నల తీరుపై అవగాహన వస్తుంది. పోస్టులకు దరఖాస్తు సమయంలోనే స్కిల్ టెస్ట్ విషయంలో స్పష్టత ఏర్పరచుకుని వాటికి సంబంధించి కూడా సన్నద్ధత పొందేలా అడుగులు వేయాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: మార్చి 27, 2023
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: ఏప్రిల్ 3–5
- పరీక్ష: జూన్ లేదా జూలైలో
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, చీరాల, కడప, నెల్లూరు, కాకినాడ, రాజమండ్రి, తిరుపతి, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్
- వెబ్‌సైట్: https://ssc.nic.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
355	114
57,990	17,100

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు		
నాస్‌డాక్	11,631	▽ 87
డోజోన్స్	31,862	▽ 385
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,335	▽ 75
డాక్స్	14,768	▽ 199
షాంఘై	3,251	▲ 24
నికాయ్	27,334	▲ 323

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

అమ్మ ఆకాంక్షలకు చట్టరూపం



మహిళలకు జీవనకాలం పెరిగింది. సంరక్షణ బాధ్యతలు దీర్ఘకాలం పాటు నిర్వహించాల్సి వస్తోంది. ఒంటరి మహిళలు లేదా వితంతువులకూ బాధ్యతలు ఉంటాయి. ఉన్నట్టుండి అమ్మకు ఏదైనా జరగరానిది జరిగితే, ఆమె ఆకాంక్షల మేరకు పిల్లలకు ఆస్తుల బదిలీ ఎలా..? పిల్లల సంరక్షణ ఎలా..? తాను జీవించి ఉండగానే తీవ్ర అనారోగ్యం బారిన పడితే ఆమె సంరక్షణ ఎవరు చూడాలి..? ఆమె తరఫున ఎవరు నిర్ణయాలు తీసుకోవాలి..? ఇక్కడే ఎస్టేట్ ప్లానింగ్ కీలకంగా పనిచేస్తుంది. ముఖ్యంగా మహిళలు కోరుకున్నట్టు, వారి ఇష్టం మేరకు, ఆకాంక్షల మేరకు ఆస్తుల బదిలీ సహా ఎన్నో అంశాలకు చట్టబద్ధమైన రక్షణతో ఎస్టేట్ ప్లానింగ్ హామీ ఇస్తుంది. ఈ ఎస్టేట్ ప్లానింగ్ అంటే ఏమిటి? ఎలా పనిచేస్తుందన్నది? ఈ కథనం ద్వారా తెలుసుకుందాం.

•••

ఎస్టేట్ ప్లానింగ్ డాక్యుమెంట్‌లో ఆస్తులు, అప్పులు ఇలా సమగ్ర వివరాలు ఉంటాయి. స్టాక్స్ లేదా మ్యూచువల్ ఫండ్స్, రియల్ ఎస్టేట్, పీపీఎఫ్, లైఫ్ ఇన్సూరెన్స్ ఇలా సమగ్ర ఆస్తులు, బాధ్యతలు (చెల్లించాల్సిన రుణాలు) అన్నీ వస్తాయి. వారసుల మధ్య వివాదాలను ఇది నివారిస్తుంది. మహిళ కోరినట్టుగా ఆస్తుల పంపిణీ, పన్ను చెల్లింపులతోపాటు, అప్పులను కూడా తీరుస్తుంది. పిల్లలకు అంతగా సామర్థ్యాలు లేవని భావించినప్పుడు, అవసరమైన సందర్భాల్లో ఆర్థిక, వైద్య అవసరాలను చూసేందుకు నమ్మకమైన ఒక వ్యక్తిని కూడా నియమించుకోవచ్చు. ఎస్టేట్ ప్లానింగ్ మహిళలను ఆర్థికంగానే కాకుండా బాధ్యతల పరంగా స్వేచ్ఛను ప్రసాదిస్తుంది. తమకు ప్రియమైన వారు ఇబ్బంది పడకుండా దీర్ఘకాలం పాటు సంరక్షణ బాధ్యతలను కోరిన విధంగా నిర్వహిస్తుంది. మహిళలకు తమ పిల్లల సంరక్షణకు సంబంధించి ప్రత్యేకమైన లక్ష్యాలతోపాటు.. ఆందోళన కూడా ఉంటుంది. పిల్లల ఎదుగుదలలో వారు ఎంతో కీలక పాత్ర పోషిస్తారు. పిల్లల భవిష్యత్తుకు సంబంధించి వారి మనసులో ఎన్నో ఆలోచనలు ఉంటాయి. పిల్లల భవిష్యత్తు ప్రాధాన్యతలను నిర్ణయించే అమ్మలూ ఉన్నారు. ఒకవేళ తాము అకాల మరణానికి గురైతే పిల్లలు ఆర్థికంగా భద్రంగా ఉండేలా ఎస్టేట్ ప్లానింగ్ భరోసానిస్తుంది. ఒంటరి మహిళ లేదా వితంతు మహిళ విల్లులో గార్డియన్ పేరు రాస్తే సరిపోతుంది. అదే ఎస్టేట్ ప్లాన్ అయితే అర్హత లేని వ్యక్తి సంరక్షకుడిగా మారకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.

- ఎస్టేట్ ప్లానింగ్‌తో కుటుంబానికి పూర్తి రక్షణ
- ఆస్తులు, అప్పుల బాధ్యతలకు స్పష్టమైన రూపం
- విల్లు కంటే విస్తృతమైనది
- ఒంటరి, వితంతు మహిళలకు అనుకూలం
- వివాదాలు, పన్నులు, వ్యయాలను నివారించొచ్చు

మహిళలకు ప్రయోజనం

ఒంటరి మహిళలకు ఎస్టేట్ ప్లానింగ్ ఎంతో సాయంగా ఉంటుంది. ఎందుకంటే వారి సంరక్షణ బాధ్యతలతోపాటు, వారి తదనంతరం అన్ని అప్పులు తీర్చేసి, మిగిలిన ఆస్తులను వారు కోరిన మేరకు వారికి ఎంతో ఇష్టమైన వారికి సాఫీగా పంపిణీ అవుతాయి. రెండు రకాల ప్రయోజనాలకు ఇది భరోసా ఇస్తుంది. అందుకే ఇక్కడ మహిళలను ప్రధానాంశంగా తీసుకోవడం జరిగింది. అంతేకాదు, ఎస్టేట్ ప్లానింగ్ రూపొందించడం వల్ల మహిళలకు అన్ని అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. అన్ని ఆస్తులు, అప్పులు, అవసరాలపై స్పష్టత వస్తుంది. ఒక విధంగా అన్ని వైపులా ఆమెకు, ఆమె కుటుంబానికి రక్షణనిస్తుంది.

ఆకాంక్షలు నెరవేరేందుకు..

మహిళలు తమ పేరిట ఉన్న ఆస్తులను కాపాడుకునేందుకు, వాటి సక్రమ బదిలీకి, సరైన వారసులకు తాము కోరుకున్నట్టుగా బదిలీ చేసుకునేందుకు ఎస్టేట్ ప్లాన్ వీలు కల్పిస్తుంది. వారసులు తేల్చుకోలేకపోతే ఆస్తులపై ప్రయోజనం ఎవరు పొందాలో కూడా ఓ పట్టాన తేలదు. దీంతో కోర్టు కేసులు, ఎన్నో ఏళ్ల కాల హరణం, విపరీతమైన ఖర్చులకు దారితీస్తుంది. మన దేశంలో వారసత్వ చట్టాలు పురుషులకే మొగ్గు చూపిస్తున్నాయి. మరణించిన మహిళ ఆస్తులు ఆమె భర్త తరఫు వారికే వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో ఎస్టేట్ ప్లానింగ్ ఎంతో అవసరం. ఇది లేకపోతే ఆమె ఆకాంక్షలకు భిన్నంగా ఆస్తుల పంపకాలు జరగొచ్చు. అందుకని వివాహిత మహిళలు అయినా, వితంతువులు అయినా, పెళ్లి కాని మహిళలు అయినా అందరికీ ఎస్టేట్ ప్లానింగ్ అవసరం. అప్పుడే వారు కోరుకున్నట్టుగా, కోరుకున్న వారికి ఆస్తులు బదిలీ అవుతాయి.

వీలునామా - ఎస్టేట్ ప్లానింగ్

ఎస్టేట్ ప్లానింగ్ అంటే వీలునామా అనుకునేరు. వీలునామా, ఎస్టేట్ ప్లానింగ్ వేర్వేరు. అలాగే, ఎస్టేట్ ప్లానింగ్ అంటే ధనవంతులకు, వీలునామా (విల్లు) సామాన్యులకు అనుకునే వారూ ఉన్నారు. కానీ, ఇవి ఫలానా వారికే అని ఏమీ లేదు. వీటి మధ్య వ్యత్యాసాలు ఉన్నాయి. ఎస్టేట్ అంటే.. ఒక వ్యక్తికి సంబంధించి అన్ని ఆస్తులు, అప్పులు. ఆస్తులు అంటే బ్యాంకు ఖాతాలు, మ్యూచువల్ ఫండ్స్, బాండ్లు, షేర్లు, బీమా పాలసీలు, పేటెంట్లు, ట్రేడ్‌మార్క్‌లు, కాపీ రైట్లు, రియల్ ఎస్టేట్, ఆర్ట్‌లు, కళాఖండాలు, వాహనాలు, ఆభరణాలు ఇలా విలువైనవన్నీ వస్తాయి. బాధ్యతలు అంటే వ్యక్తిగత రుణాలు, మార్ట్‌గేజ్ రుణాలు, క్రెడిట్ కార్డులు, పన్నులు వస్తాయి. ఉదాహరణకు.. ఏ అనే వ్యక్తికి కొన్ని పెట్టుబడులు, రూ.కోటి విలువైన ప్రాపర్టీ ఉంది. అలాగే, బీ అనే వ్యక్తి పేరిట ఆర్థిక పెట్టుబడులు, పలు చోట్ల ప్రాపర్టీలు, వ్యాపారాల్లో వాటాలు మొత్తం మీద రూ.500 కోట్ల విలువ చేసేవి ఉన్నాయి. ఇక్కడ ఏ, బీ ఇద్దరికీ ఎస్టేట్ ప్లానింగ్ ఉపయోగపడుతుంది.

•••

ఎస్టేట్ ప్లానింగ్ అనేది రాసిన వ్యక్తి మరణం తర్వాత వారి పేరిట ఉన్న సంపదను బదిలీ చేయడానికే పరిమితం కాదు. జీవించిన ఉన్న సమయంలోనూ వాటిని రక్షించడం, కాపాడుకోవడం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాలను నిర్వహించలేని పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలో కూడా ఎస్టేట్ ప్లానింగ్‌లో ఉంటుంది. విల్లు అనేది సంపదను ఎవరికి, ఎలా పంచాలో సూచించే చట్టబద్ధమైన పత్రం. మరణానంతరం కోరుకున్న విధంగా ఆస్తులను బదిలీ చేసేందుకు ఈ పత్రం ఉపయోగపడుతుంది. విల్లులోని అంశాలను అమలు చేసే బాధ్యతను ఎవరు నిర్వహించాలో కూడా సూచించొచ్చు. విల్లుతో పోలిస్తే ఎస్టేట్ ప్లానింగ్ మరింత విస్తృతంగా ఉంటుంది. విల్లు ఒక్కటే సాధనం అయితే, ఎస్టేట్ ప్లానింగ్ ఒకటికి మించిన సాధనాలతో ఉంటుంది.

ఉద్దేశాలు




ఊహించని రిస్క్‌లు ఎదురైతే సంపదకు రక్షణ కవచంలా ఎస్టేట్ ప్లానింగ్ సాయపడుతుంది. మైనర్లు, ప్రత్యేక అవసరాల పిల్లలు ఉంటే, ఆర్థిక విషయాల గురించి ఏ మాత్రం అవగాహన లేని కుటుంబ సభ్యులు ఉంటే వారికి సంబంధించిన నిర్ణయాలకు ఎస్టేట్ ప్లానింగ్ హామీ ఇస్తుంది. మహిళ నిర్ణయాలు తీసుకోలేని స్థితికి వెళితే, ఆ బాధ్యతలు నిర్వహించే యంత్రాంగం ఏర్పాటు, కుటుంబ వివాదాలను పరిష్కరించే సమాచార వాహకం ఏర్పాటు ఇలా ఎన్నో అంశాలకు ఎస్టేట్ ప్లానింగ్ వేదిక కాగలదు. తీవ్ర అనారోగ్యం బారిన పడినప్పుడు, ఆసుపత్రుల్లో విషమ పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆమె తరఫున ఎవరు నిర్ణయం తీసుకోవాలో ఎస్టేట్ ప్లానింగ్ స్పష్టం చేస్తుంది. ఎస్టేట్ ప్లానింగ్‌తో ఉన్న ప్రయోజనం వారసత్వ పన్ను తప్పించుకోవచ్చు. అయితే, ప్రస్తుతం మన దేశంలో వారసత్వ పన్ను లేదు. కానీ, అమెరికా, బ్రిటన్ తదితర దేశాల్లో ఉంది. తాము ప్రేమించే వారు విదేశాల్లోనూ ఉండి, తమ తర్వాత వారికి కూడా ఆస్తుల బదలాయింపు కోరుకుంటే అప్పుడు ఎస్టేట్ ప్లానింగ్ మెరుగైనది. విదేశాల్లో ఆస్తులు ఉన్నవారికి కూడా ఎస్టేట్ ప్లానింగ్ అవసరం. చివరి వీలునామా, ప్రైవేటు ఫ్యామిలీ ట్రస్ట్, పవర్ ఆఫ్ అటార్నీ, గిఫ్ట్ డీడ్స్, అడ్వాన్స్‌డ్ మెడికల్ డైరెక్టివ్, లైఫ్ ఇన్సూరెన్స్, ఫ్యామిలీ చార్టర్‌లు ఎస్టేట్ ప్లానింగ్‌లో ఉంటాయి. పరిధి చాలా విస్తృతం కనుక నిపుణుల సాయంతో దీన్ని రూపొందించుకోవడం అవసరం.

పన్నుల భారం



ఆస్తులపై పన్నుల భారాన్ని ఎస్టేట్ ప్లానింగ్ తప్పిస్తుంది. అంతేకాదు, ఒకరి మరణానంతరం ఎస్టేట్ ప్లానింగ్‌లో పేర్కొన్న మాదిరి ఆస్తులను పింపిణీ చేసుకున్నప్పుడు వాటిపై వ్యయాలు కూడా తగ్గుతాయి. ఉదాహరణకు ఓ ట్రస్ట్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఆస్తులపై పన్ను తగ్గుతుంది. విచారణ లేకుండానే (చట్టపరమైన ప్రక్రియ) లబ్ధిదారులు ఆస్తులు పొందగలరు. ఎస్టేట్ ప్లానింగ్‌లో సూచనల మేరకు ఆస్తులను వేగంగా బదిలీ చేయవచ్చు.




ప్రయోజనాలు.. పరిమితులు.. వ్యత్యాసాలు

తమ ఆస్తులు తమ తదనంతరం ఎవరికి చెందాలో విల్లులో రాసుకోవచ్చు. విల్లు లేకుండా మరణిస్తే.. అనుభవించే హక్కులు మారొచ్చు. ఉదాహరణకు హిందూ పురుషుడు విల్లు లేకుండా మరణిస్తే అతడి పేరిట ఉన్న సంపదను అతడి తల్లి, భార్య, పిల్లలు ఇలా మూడు సమాన వాటాలుగా పొందొచ్చని చట్టం చెబుతోంది. కానీ, విల్లు రాస్తే సంబంధిత వ్యక్తి కోరుకున్న విధంగా ఆస్తుల బదిలీకి అవకాశం ఏర్పడుతుంది. విల్లు వ్యక్తి మరణానంతరమే అమల్లోకి వస్తుంది. అంతేకాదు, ఈ విల్లును వారసులు సవాల్ చేయవచ్చు. ఎస్టేట్ ప్లానింగ్ సమగ్ర రూపంతో ఉంటుంది. మరణానంతరమే కాకుండా జీవించిన కాలంలోనూ లక్ష్యాలకు రూపం ఇస్తుంది. ఎస్టేట్ ప్లానింగ్ మీ సంపదకు, మీ వారసులు లేదా మీకు ఇష్టమైన వారి ఆర్థిక భద్రతకు ఎక్కువ రక్షణనిస్తుంది. కేవలం చట్టబద్ధమైన డాక్యుమెంట్లకే పరిమితం కాకుండా, అన్ని రకాల బాధ్యతలు, సంరక్షణ, సంపద బదిలీ యంత్రాంగం ఏర్పాటు ఇందులో ఉంటాయి. కనుక విల్లుతో పోలిస్తే ఎస్టేట్ ప్లానింగ్ అదనపు ఖర్చు భరించాల్సిందే. ఎస్టేట్ ప్లానింగ్ మహిళల కోసమనే కాదు. పురుషులకూ, ఇంటి బాధ్యతలు చూసే, ఆస్తులు, బాధ్యతలు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే డాక్యుమెంట్ అవుతుంది.

పీఎన్‌బీ మెట్‌లైఫ్ సస్టెయినబుల్ ఈక్విటీ ఫండ్

పీఎన్‌బీ మెట్‌లైఫ్ 'సస్టెయినబుల్ ఈక్విటీ ఫండ్'ను విడుదల చేసింది. ఇది పీఎన్ బీ మెట్‌లైఫ్ గోల్ ఎన్సూరింగ్ మల్టిప్లయర్ ప్లాన్‌లో భాగం. ఈఎస్‌జీ సూత్రాల మేరకు నడుస్తున్న కంపెనీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. పీఎన్‌బీ మెట్‌లైఫ్ గోల్ ఎన్సూరింగ్ మల్టిప్లయర్ ప్లాన్ (యులిప్)లో చేరే వారు ఈ పథకాన్ని పెట్టుబడుల కోసం ఎంపిక చేసుకోవచ్చు. పాలసీదారులకు దీర్ఘకాలంలో మంచి విలువ సమకూర్చాలన్న తమ అంకిత భావానికి సస్టెయినబుల్ ఈక్విటీ ఫండ్ నిదర్శనమని పీఎన్‌బీ మెట్‌లైఫ్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

మిరే అసెట్ నుంచి నిఫ్టీ ఈటీఎఫ్..



మిరే అసెట్ మ్యుచువల్ ఫండ్ కొత్తగా నిఫ్టీ 100 'లో వోలటైలిటీ' 30 ఈటీఎఫ్ పేరిట న్యూ ఫండ్ ఆఫర్‌ను ప్రకటించింది. ఇది మార్చి 21తో ముగుస్తుంది. ఇందులో కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. సాధారణ లావాదేవీల నిర్వహణకు మార్చి 27 నుంచి ఇది అందుబాటులో ఉంటుంది. భారీ మార్కెట్ క్యాప్ సెగ్మెంట్‌లో తక్కువ ఒడిదుడుకులకు లోనయ్యే స్టాక్స్ ప్రాతిపదికగా ఈ ఫండ్ పెట్టుబడులు ఉంటాయి. ఇటు యాక్టివ్, అటు ప్యాసివ్ పెట్టుబడి ధోరణుల కలబోతగా ఉండే ఈ తరహా స్మార్ట్ బీటా ఈటీఎఫ్‌లు ఇటీవలి కాలంలో ప్రాచుర్యంలోకి వస్తున్నాయి. ఇతర సూచీలు, విస్తృత మార్కెట్‌తో పోలిస్తే వీటి క్షీణత స్థాయి తక్కువగా ఉంటుందని సంస్థ తెలిపింది. తమ పోర్ట్‌ఫోలియోలో ఒడిదుడుకులు, క్షీణత రిస్కును తగ్గించుకుని, దీర్ఘకాలంలో తక్కువ రిస్కులతో మెరుగైన రాబడులు అందుకోవాలని కోరుకునే ఇన్వెస్టర్లకు ఇది అనువైనదని వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-3-2023	
విశాఖ	450-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	438-00
విజయవాడ	438-00
రిటైల్ ధర (డజను)	66.00
19-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.95

బ్లూస్టార్ | యూఎల్‌జేకే రీసెర్చ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,444 టార్గెట్: రూ. 1,825

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో ఇంజినీరింగ్ దిగ్గజం బ్లూస్టార్ లిమిటెడ్ ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో వార్షికంగా అమ్మకాలు 19 శాతం ఎగసి రూ. 1,788 కోట్లను అధిగమించాయి. నిర్వహణ లాభం(ఇబిటా) మరింత అధికంగా 22 శాతం జంప్‌చేసి రూ. 105 కోట్లకు చేరింది. త్రైమాసికవారీగా(క్యూ2) చూసినా ఇది 16 శాతం వృద్ధి. మార్జిన్లు 0.43 శాతం బలపడ్డాయి. వెరసి క్యూ3లో మార్జిన్లు 5.86 శాతాన్ని తాకాయి. వెరసి నికర లాభం త్రైమాసికవారీగా 39 శాతం దూసుకెళ్లి రూ. 58 కోట్లను అధిగమించింది. విభాగాలవారీగా సైతం కంపెనీ అమ్మకాలు జోరు చూపాయి. ఎలక్ట్రోమెకానికల్ ప్రాజెక్ట్స్(ఈఎంపీ), వాణిజ్య ఎయిర్‌కండిషనింగ్ సిస్టమ్స్ మెరుగైన పనితీరు ప్రదర్శించింది. వార్షికంగా ఆదాయం 21 శాతం పుంజుకుని రూ. 1,000 కోట్లకు చేరింది. యూనిటరీ ప్రాడక్టుల విభాగం టర్నోవర్ 15 శాతం బలపడి రూ. 702 కోట్లను తాకింది. అయితే ప్రొఫెషనల్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇండస్ట్రియల్ సిస్టమ్స్ మరింత అధికంగా 29 శాతం పురోగమించి రూ. 86 కోట్లను దాటింది. కంపెనీ భారీ విస్తరణ ప్రణాళికలు అమలు చేస్తోంది. ముడివ్యయాల భారం తగ్గే అవకాశముంది. ఈ ఏడాది వేసవి సీజన్ ముందుగానే ప్రారంభంకావడం కంపెనీ అమ్మకాలు పుంజుకునేందుకు దోహదం చేయనుంది. రానున్న త్రైమాసికాలలోనూ ఇదే స్థాయి వృద్ధి కొనసాగించే వీలుంది. వచ్చే ఏడాది(2023–24) రూ. 36.5 షేరువారీ ఆర్జన(ఈపీఎస్) సాధించగలదని అంచనా.



ఓఎన్‌జీసీ | మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 153 టార్గెట్: రూ. 200

ఎందుకంటే: ప్రభుత్వ రంగ ఇంధన దిగ్గజం ఓఎన్‌జీసీ ఈ ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నిర్వహణ లాభం(ఇబిటా) వార్షికంగా 28 శాతం జంప్‌చేసి రూ. 20,410 కోట్లను తాకింది. త్రైమాసికవారీగా సైతం 9 శాతం ఇది అధికం. విండ్‌ఫాల్ ట్యాక్స్ ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకున్న తదుపరి ముడిచమురు బ్యారల్‌కు 76.7 డాలర్ల ధరను అందుకుంది. ఈ కాలంలో అంచనాలకు అనుగుణంగా 4.7 మిలియన్ మెట్రిక్ టన్నులు(ఎంఎంటీ) చమురు విక్రయాలు, 4.2 బిలియన్ క్యూబిక్ మీటర్లు(బీసీఎం) గ్యాస్ అమ్మకాలు సాధించింది. కేజీ బేసిన్ నుంచి మే లేదా జూన్‌లో తొలిసారిగా చమురు ఉత్పత్తిని సాధించనుంది. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం (2023–24)లో 1.9 ఎంఎంటీ ముడిచమురు, 2.8 బీసీఎం గ్యాస్‌ను ఉత్పత్తి చేయగలదని అంచనా. ఆపై ఏడాది(2024–25) 2.2 ఎంఎంటీ ముడిచమురు, 3.8 బీసీఎం గ్యాస్‌ను వెలికి తీసే వీలున్నట్లు కంపెనీ అంచనా వేసింది. ఈ బాటలో గరిష్ఠంగా రోజుకి 45,000 బ్యారళ్ల చమురును, 12 ఎంఎంఎస్‌సీఎండీ గ్యాస్‌ను ఉత్పత్తి చేయగలమని భావిస్తోంది. చమురు ధరల్లో క్షీణత కారణంగా 2022 జూలైలో నమోదైన రూ. 23,250 గరిష్ఠం నుంచి విండ్‌ఫాల్ పన్ను ఈ ఫిబ్రవరికల్లా ఎంటీకి రూ. 5,050కు దిగివచ్చింది. అయితే సమీప భవిష్యత్‌లో విండ్‌ఫాల్ పన్ను విధింపు కొనసాగే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. కంపెనీ వృద్ధికి ఇతర ఇంధన పీఎస్‌యూలు హెచ్‌పీసీఎల్, ఎంఆర్‌పీఎల్, పీఎల్ఎన్‌జీలలో పెట్టుబడులు సైతం సహకరించే వీలుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

యూబీఎస్ చేతికి క్రెడిట్ సుసీ


డీల్ విలువ 2 బిలియన్ డాలర్లు



జ్యూరిక్: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న క్రెడిట్ సుసీను కొనుగోలు చేసేందుకు స్విట్జర్లాండ్ బ్యాంకింగ్ దిగ్గజం యూబీఎస్ గ్రూప్ అంగీకరించినట్లు తెలుస్తోంది. స్విస్ ప్రభుత్వ దన్నుతో 2 బిలియన్ డాలర్ల(రూ. 16,500 కోట్లు)కు ఒప్పందం కుదిరినట్లు ఆంగ్ల మీడియా పేర్కొంది. షేర్ల జారీ ద్వారా కుదిరిన డీల్ ప్రకారం క్రెడిట్ సుసీ విలువ 8 బిలియన్ డాలర్లుగా తెలియజేసింది. క్రెడిట్ సుసీ షేరు శుక్రవారం ముగింపు ధరతో పోలిస్తే నాలుగో వంతు ధరలో యూబీఎస్ కొనుగోలు చేయనుంది. గత వారం నాలుగు యూఎస్ బ్యాంకులు వైఫల్యం చెందిన నేపథ్యంలో క్రెడిట్ సుసీ షేరు, బాండ్లకు షాక్ తగిలింది. స్విస్ కేంద్ర బ్యాంకు లిక్విడిటీ మద్దతునిచ్చినప్పటికీ మార్కెట్లో క్రెడిట్ సుసీ షేరు పతనమైంది. తాజాగా క్రెడిట్ సుసీను టేకోవర్ చేసేందుకు స్విస్ ప్రభుత్వం నుంచి రిస్కులకుగాను 6 బిలియన్ డాలర్ల గ్యారంటీని యూబీఎస్ కోరినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

నాకు నెలకు లక్ష కావాలి..?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



నేను మరో 10–15 ఏళ్లలో ఇల్లు కొనుగోలు చేయాలని అనుకుంటున్నాను. రూ.2.5–3 కోట్ల బడ్జెట్‌లో ఇల్లు కొనాలన్నది నా ఆలోచన. గృహ రుణం తీసుకునే విషయంలో నా వంతు డౌన్ పేమెంట్‌ను సమకూర్చుకోవాలి కదా. వచ్చే 10–15 ఏళ్లలో గృహ రుణం డౌన్ పేమెంట్‌ను సమకూర్చుకునేందుకు ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి? టాటా స్మాల్ క్యాప్ లేదా, మిరే అస్సెట్ మిడ్‌క్యాప్ ఫండ్ లేదా పీజీఐఎం ఇండియా మిడ్‌క్యాప్ ఫండ్ పథకాలు నా డౌన్ పేమెంట్‌కు అనుకూలమైనా..? – ఆదిత్య బి

10–15 ఏళ్లలో ఇల్లు కొనుగోలు చేద్దామన్న నిర్ణయం సరైన దారిలోనే ఉంది. మీ పెట్టుబడులు వృద్ధి చెందడానికి సరిపడా సమయం మీ చేతుల్లో ఉంది. ఈ కాలంలో ఈక్విటీ పథకాల నుంచి సహేతుక రాబడులు వస్తాయని ఆశించొచ్చు. తద్వారా గృహ కొనుగోలుకు కావాల్సిన డౌన్ పేమెంట్‌ను సమకూర్చుకోవచ్చు. మీరు దృష్టిలో ఉంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. కొనుగోలు చేద్దామనుకుంటున్న ఇంటి బడ్జెట్ రూ.2.5–3 కోట్లు అని చెప్పారు కదా. ఇది నేటి ధరల ఆధారంగా అంచనా వేశారా? అయితే ద్రవ్యోల్బణ ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోక తప్పదు. అప్పుడు 10–15 ఏళ్ల తర్వాత ఇల్లు కొనుగోలుకు అసలు ఎంత అవుతుందన్న వాస్తవ అంచనాకు రావడానికి ఉంటుంది. ఆ తర్వాత నెలవారీ సిప్ మొత్తాన్ని రెండు ఫ్లెక్సీక్యాప్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. మీరు ఒకటి నుంచి రెండు వరకు మిడ్, స్మాల్‌క్యాప్ పథకాలను కూడా ఎంపిక చేసుకోవచ్చు. కాకపోతే మిడ్, స్మాల్‌క్యాప్ అన్నవి మొత్తం పోర్ట్‌ఫోలియోలో 25–30 శాతం మించి ఉండకూడదు. మీ పోర్ట్‌ఫోలియోలో ఏ పథకాలు ఉండాలన్నది మీ రిస్క్ తీసుకునే సామర్థ్యం, ఈక్విటీ పెట్టుబడుల్లో మీకున్న అనుభవం కీలకంగా మారతాయి. ఇల్లు కొనుగోలు చేయడం అన్నది ఆర్థికంగా అతిపెద్ద నిర్ణయం. కనుక చాలా జాగ్రత్తగా దీన్ని పరిగణనలోకి తీసుకోవాలి. చాలా కేసుల్లో నివాసం ఉండేట్టు అయితే రుణంపై ఇల్లు కొనుగోలు చేయడం న్యాయమే అవుతుంది. గృహ రుణంపై పన్ను ప్రయోజనాలు ఉన్నాయి. పైగా ఇది దీర్ఘకాలం పాటు కొనసాగే రుణ బాధ్యత. అలాగే, గృహ రుణానికి మీరు చెల్లించే ఈఎంఐ అన్నది నెలవారీ నికరంగా చేతికి అందుకునే మొత్తంలో మూడింట ఒక వంతు మించకుండా చూసుకోండి. పెట్టుబడి కోణంలో అయితే రుణంపై ఇల్లు కొనుగోలు చేయడం మంచి నిర్ణయం కాబోదు. ఎందుకంటే రియల్ ఎస్టేట్‌లో లిక్విడిటీ తక్కువ. కొనుగోలు, విక్రయం వేగంగా సాధ్యపడదు. డబ్బులు కావాలంటే వెంటనే అడిగిన రేటుకు విక్రయించాల్సి వస్తుంది. అధిక విలువ కలిగిన ఇంటిని అమ్మడం అంత సులభమైన విషయం కాదు.

నా వయసు 59 ఏళ్లు. వచ్చే నెలలో పదవీ విరమణ తీసుకోబుతున్నాను. రిటైర్మెంట్ తర్వాత నా వద్ద రూ.కోటి నిధి ఉంటుంది. నెలవారీ ఖర్చులు రూ.లక్ష వరకు ఉంటాయి. కనుక నా వద్ద ఉండే రూ.కోటిని నెలనెలా రూ.లక్ష వచ్చేలా ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలో సూచించగలరు. – భానుప్రకాశ్

మీరు రూ.కోటి పెట్టుబడిపై ప్రతి నెలా రూ.లక్ష ఆదాయం కోరుకుంటున్నారు. అంటే వార్షిక రాబడి 12 శాతం ఉండాలి. ఈ స్థాయి రాబడి అన్నది ఈక్విటీలలో, అదీ దీర్ఘకాలంలోనే (ఏడేళ్లకు మించి) సాధ్యపడతాయి. ఏటా ఇదే స్థాయిలో ఈక్విటీలు కూడా రాబడులు ఇస్తాయని గ్యారంటీ ఉండదు. అలాగే, ఒక ఏడాదిలో వచ్చిన రాబడులన్నింటినీ వినియోగించుకోకూడదు. మీ పెట్టుబడి నిధి ద్రవ్యోల్బణ ప్రభావం (5–6 శాతం) మేర ఏటా వృద్ధి చెందుతూ ఉండాలి. అప్పుడే కావాల్సినంత మొత్తం సమకూర్చుకోగలరు. ఉదాహరణకు మీ రూ.కోటి నిధి.. ఐదు, ఏడేళ్ల తర్వాత కూడా అక్కడే ఉంటే.. ద్రవ్యోల్బణం ప్రభావం వల్ల అప్పటికి నెలవారీగా రూ.లక్ష ఆదాయం సరిపోదు. పెరిగే ధరలకు అనుగుణంగా మీకు మరింత మొత్తం ఆదాయం వచ్చేంత నిధి ఉండాలి. కనుక మీ పెట్టుబడిపై వచ్చే రాబడిలో కొంత మొత్తాన్ని అక్కడే వృద్ధి చెందేందుకు వీలుగా ఉంచేయాలి. మీ విషయంలో మీరు ఆశించే రాబడి రేటు ఎక్కువగా ఉంది. దాన్ని తగ్గించుకోండి. మీరు కోరుకున్నట్టు ప్రతి నెలా రూ.లక్ష చొప్పున ఉపసంహరించుకుంటూ వెళితే.. మీ వద్దనున్న పొదుపు నిధి కూడా తగ్గిపోతుంది. ద్రవ్యోల్బణం అధిగమించి నిధి వృద్ధి చెందాలంటే.. పెట్టుబడి నుంచి రాబడి 6 శాతానికి మించి ఉపసంహరించుకోకూడదు. అంటే



రూ.కోటి నిధిపై ఏటా రూ.6 లక్షల వరకే ఉపసంహరించుకోవాలి. పెట్టుబడి నిధిలో మూడింట ఒక వంతును ఈక్విటీలకు కేటాయించుకోవాలి. మిగిలిన రెండు భాగాలకు ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలకు (డెట్) కేటాయించుకోవాలి. ప్రభుత్వ హామీ ఉన్న సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్), పోస్ట్ ఆఫీస్ నెలవారీ ఆదాయ పథకం (పీవోఎంఐఎస్), ప్రధాన మంత్రి వయవందన యోజన (పీఎం వీవీవై) పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. వీటిల్లో పీఎం వీవీవై, ఎస్‌సీఎస్ఎస్ 8 శాతం రాబడిని ఆఫర్ చేస్తున్నాయి. ఇందులో పీఎం వీవీవై ఈ ఏడాది మార్చితో ముగియనుంది. ఈ పథకాలకు కేటాయించుకోగా మిగిలే మొత్తాన్ని అధిక నాణ్యత కలిగిన షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి.


యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని హైకోర్టు జడ్జి ఎస్.వి.శ్రావణ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. - యాదగిరిగుట్ట

యాదాద్రిలో మరోసారి లీకేజీలు


వర్షం ధాటికి కొట్టుకుపోయిన గిరిప్రదక్షిణ రోడ్డు. (ఇన్‌సెట్)లో ఆలయ ప్రాకార మండపాల్లో కారుతున్న వర్షం నీరు

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ ప్రాకార మండపాల్లో మరో సారి వర్షం నీళ్ల లీకేజీలు బయటపడ్డాయి. శనివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ఆలయ ప్రథమ ప్రాకారంలో, అష్టభుజి ప్రాకార మండపాల్లో వర్షం నీళ్లు లీకేజీ అయ్యాయి. భారీ వర్షానికి కొండకు దిగువనున్న శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలోకి, వాహన పూజలు నిర్వహించే ప్రాంతంలోకి భారీగా నీళ్లు చేరాయి. దీంతో ఆదివారం శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు చేసేందుకు వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఓ వైపు మండపంలో నిలిచిన నీళ్లను సిబ్బంది తీసేశారు. మండపాన్ని శుభ్రం చేసిన తర్వాత భక్తులు వ్రతాలు నిర్వహించారు. ఇక వాహన పూజల షెడ్డు పూర్తిగా జలమయమైంది. భక్తులు వ్రత మండపంలోకి, వాహన పూజల వద్దకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం కారణంగా గిరి ప్రదక్షిణ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. వర్షం ధాటికి రోడ్డుపై మట్టి అంతా కొట్టుకుపోయి కొయ్యలు ఏర్పడి, రాళ్లు తేలాయి.



జీతం కాదు మానసిక ప్రశాంతతే ముఖ్యం

మానవ సమాజానికి కరోనా ప్రత్యక్ష, పరోక్ష రూపాల్లో నేర్పిన పాఠాలు అన్నీ ఇన్నీ కాదు. దాదాపు మూడేళ్ల క్రితం ప్రాణాంతక కోవిడ్ వైరస్ వ్యాప్తిలోకి వచ్చి ప్రపంచ వ్యాప్తంగా దాదాపుగా అన్ని వర్గాల ప్రజలు ఏదో ఒక రూపంలో తీవ్రంగా ప్రభావితమైన తీరు తెలిసిందే. మళ్లీ కరోనా కేసుల పెరుగుదల, దేశవ్యాప్తంగా ఫ్లూ కేసులు, వివిధ రకాల ఇన్‌ఫ్లూయెంజా వైరస్‌ల వ్యాప్తి నేపథ్యంలో ఒత్తిళ్లకు దూరంగా జీవనం, మానసిక ప్రశాంతత వంటివి అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. జీతం కంటే మానసిక ప్రశాంతతకే ఓటు వేస్తున్న ఉద్యోగుల సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా గణనీయంగా పెరుగుతోంది. వివిధ దేశాల్లో అధిక శాతం ఉద్యోగులు పని ప్రదేశాల్లో మానసిక ఆరోగ్యం అనేది చాలా కీలకమని అంగీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత్ సహా పది దేశాల్లోని ఉద్యోగులపై చేసిన ఓ తాజా అధ్యయనంలో అనేక ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి.

- సాక్షి, హైదరాబాద్

అధిక జీతాలొచ్చే ఉద్యోగాలు వదులుకునేందుకూ సిద్ధం

88% మంది భారతీయులది ఇదే అభిప్రాయం

ఇతర దేశాల్లో ఉద్యోగులదీ ఇదే మాట
తాజా అధ్యయనంలో వెల్లడి
కరోనాతో మార్పు వచ్చిందంటున్న నిపుణులు

అన్నిట్లోనూ మార్పు దిశగా అడుగులు



మనుషులకు సవాళ్లు ఎదురైనప్పుడే వాటిని ఎలా అధిగమించాలనే దానిపై దృష్టి పెడతారు. జీవితం దుర్లభంగా మారుతోందనగానే దానిని ఎదుర్కొని అనుకూలంగా మార్చుకునేందుకు ఏమి చేయాలనే ఆలోచనలు వస్తాయి. పరిస్థితులకు తగ్గట్టుగా తమను తాము మార్చుకోవడం, జీవిత ప్రాధామ్యాల్లోనూ మార్పులు, చేర్పులు చేసుకోవడం జరుగుతుంది. ఏది చేస్తే మనసుకు, శరీరానికి స్వాంతన దొరుకుతుందనే దానికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారు. మానసిక ప్రశాంతతకే అత్యధిక ప్రాధాన్యతనివ్వాలనే ట్రెండ్ ఎప్పటికీ ఉంటుందా? అంటే ఇప్పుడే చెప్పలేం. కొంత కాలం మాత్రం తప్పకుండా ఉంటుంది. అందువల్లే చాలామంది ఆరోగ్యం మీద ఫోకస్ పెడుతున్నారు. పని పద్ధతులు, పని సమయాలు, తీసుకునే ఆహారం, ధరించే దుస్తులు.. ఇలా అన్నిటిలోనూ మార్పు దిశగా అడుగులు వేస్తున్నారు. మనుషులపై కరోనా పరిస్థితులు తెచ్చిన ప్రభావం మాత్రం రాబోయే 4, 5 ఏళ్ల పాటు కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

– సి.వీరేందర్, సీనియర్ సైకాలజిస్ట్

భారత్‌లో ఇలా..

- పనిచేసే ప్రదేశాల్లో మానసిక ఆరోగ్య పరిరక్షణే ప్రధానమన్న అధిక శాతం ఉద్యోగులు
- ఒత్తిళ్లకు దూరంగా ప్రశాంతతతో జీవించేందుకు.. అధిక జీతాలొచ్చే ఉద్యోగాలు సైతం వదులుకునేందుకు సిద్ధమని 88% మంది చెప్పారు.
- 71 శాతం మంది పని భారం వల్ల తలెత్తే ఒత్తిళ్ల వ్యక్తిగత జీవితంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని తెలిపారు.
- వ్యక్తిగత సంబంధాలనూ ప్రభావితం చేస్తున్నాయన్న 62% మంది.
- కుటుంబ సభ్యులతో మెరుగైన సంబంధాలు, సంతోషకరమైన జీవితమే ముఖ్యమన్న 46% మంది.
- పని ఒత్తిళ్లతో సాయంత్రానికల్లా నిస్త్రాణంగా మారుతున్నామని 26% మంది చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా చూస్తే...

- ఇతర దేశాల ఉద్యోగులు సైతం మన దేశంలో మాదిరి అభిప్రాయాలనే వ్యక్తం చేశారు.
- అధిక జీతమొచ్చే ఉద్యోగం కంటే మంచి మానసిక ఆరోగ్యానికి అనువైన ఉద్యోగానికే 81% మంది మొగ్గు చూపారు.
- తమ పనితీరుపై మానసిక ఒత్తిళ్ల ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని 78% మంది చెప్పారు.
- తాము చేస్తున్న ఉద్యోగం మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తోందని 60% మంది పేర్కొన్నారు.

మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది



ప్రస్తుతం ఉద్యోగులతో పాటు అందరూ మానసిక ఆరోగ్యానికి బాగా ప్రాధాన్యత ఇస్తున్నారు. మన జీవితాల్లో కరోనా పరిస్థితులు తెచ్చిన అనిశ్చితి అంతా ఇంతా కాదు. మహమ్మారి ఉధృతంగా ఉన్నప్పటి తీవ్రమైన భయం ఇప్పటికీ కొనసాగుతోంది. దాదాపు అన్నివర్గాల వారు డబ్బు ఆదా చేయడం కంటే మానసిక ప్రశాంతతే ముఖ్యమనే భావనకు వచ్చారు. మానసిక ఒత్తిళ్లకు దూరంగా ఉండేలా జీవనశైలిని మార్చుకోవాలనే శ్రద్ధ పెరిగింది. గతంలో ఇలాంటి పరిస్థితి అంతగా ఉండేది కాదు. కానీ కరోనాతో చాలా మార్పు వచ్చింది. ప్రతిఒక్కరూ మానసిక ప్రశాంతత కోరుకోవడం ఎక్కువైంది.

– డాక్టర్ బి.అపర్ణా రెడ్డి, హెచ్ఆర్ నిపుణురాలు

26న పీటీఓ ఎస్సై టెక్నికల్ రాత పరీక్ష



సాక్షి, హైదరాబాద్: పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ (పీటీఓ)లో ఎస్సై పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులకు రాత పరీక్ష (టెక్నికల్ పేపర్)ను ఈనెల 26న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ ఎల్పీఆర్బీ) చైర్మన్ వీవీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులంతా www.tslprb.in వెబ్‌సైట్‌లో ఈనెల 21 ఉదయం 8 గంటల నుంచి ఈనెల 24న అర్ధరాత్రి 12 గంటల వరకు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. పీటీఓ ఎస్సై అభ్యర్థులకు రాత పరీక్షలో భాగంగా టెక్నికల్ పేపర్ కాకుండా నిర్వహించనున్న మిగిలిన రెండు పేపర్లకు సంబంధించి హాల్‌టికెట్ల జారీ తేదీలను త్వరలోనే తెలియజేస్తామని ఆయన వెల్లడించారు.

భద్రాద్రికి చేరిన పవిత్ర జలాలు


పవిత్ర జలాలతో కూడిన కలశాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: దేశంలోని వివిధ పుణ్య నదులు, సరస్సులు, పుష్కరిణుల నుంచి సేకరించిన పవిత్ర జలాలు భద్రా చలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి ఆదివారం చేరుకున్నాయి. ఈ నెల 31న జరిగే పుష్కర పట్టాభిషేక మహోత్సవంలో వినియోగించే ఈ పుణ్య జలాల కోసం అర్చకులు దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించడం తెలిసిందే. ఇలా సేకరించిన జలాలను మంగళ వాయిద్యాలు, మంత్రోచ్చరణలు, మహిళా భక్తుల కోలాటాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

బియ్యంపై శ్రీరామ నామం


భద్రాచలం ఆలయ అధికారులకు బియ్యం గింజలను అందజేస్తున్న వందన, కుటుంబ సభ్యులు

భద్రాచలం: బియ్యపు గింజలపై 'శ్రీరామ' నామాన్ని రాసి హైదరాబాద్ చందానగర్‌కు చెందిన చలువాది మల్లి విష్ణు వందన వినూత్నంగా భక్తిని చాటుకున్నారు. 1,01,116 బియ్యపు గింజలపై శ్రీరామ నామాన్ని ప్రత్యేకమైన పెన్నుతో 'సూక్ష్మ కళ'తో లిఖించి ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో కుటుంబసభ్యులతో కలిసి అందజేశారు. ఈనెల 30న జరిగే సీతారాముల కల్యాణ తలంబ్రాలలో ఈ బియ్యాన్ని కలపాలని ఆలయ అధికారులను కోరారు. అనంతరం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ ఇంట్లో ఖాళీగా ఉండే సమయంలో రాసినట్లు చెప్పారు. ఇలా రాసిన మరో 36 వేల బియ్యపు గింజలను ఆంధ్రప్రదేశ్‌లోని ఆళ్లగడ్డ, విజయనగరం, తెలంగాణలోని నేరేడుచర్ల, హైదరాబాద్, కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట ప్రాంతాల్లోని దేవాలయాల్లో త్వరలో అందజేస్తామని వెల్లడించారు.

పొదుపు... అదుపు

కరెంటు వినియోగంలో పొదుపుతోనే చార్జీలు అదుపు

- రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు స్పష్టీకరణ
- అనవసరంగా విద్యుత్‌ను వాడొద్దంటూ వినియోగదారులకు సూచనలు



సాక్షి, హైదరాబాద్: భవిష్యత్తులో చార్జీలు పెరగకుండా.. విద్యుత్ బిల్లులు భారం కాకుండా ఉండాలంటే.. కరెంటు వినియోగంలో పొదుపు ఒక్కటే మార్గమని అంటున్నారు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ) చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు. రాష్ట్రంలో పీక్ విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగే వేళల్లో నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగించేందుకు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు గరిష్టంగా యూనిట్‌కు రూ.12 ధరతో బహిరంగ మార్కెట్ నుంచి విద్యుత్ కొనుగోళ్లు జరుపుతున్నాయి. దీంతో డిస్కంల విద్యుత్ కొనుగోళ్ల వ్యయం భారీగా పెరిగిపోతోంది. ఈ వ్యయభారాన్ని చివరకు వినియోగదారులపై బిల్లులను మరింతగా పెంచి బదిలీ చేయకతప్పదని ఆయన స్పష్టం చేశారు. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేదలకు ఈ బిల్లులు మోయలేని భారంగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, విద్యుత్ పొదుపు చర్యలను పాటించి సలువుగా విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. అవసరం లేకున్నా విద్యుత్‌ను వృథాగా వినియోగిస్తుండడంతోనే బిల్లులు అధికంగా వస్తున్నాయని, విద్యుత్ పొదుపుపై రాష్ట్రంలో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు ఈఆర్సీ తరఫున వినియోగదారులకు సూచనలు, సలహాలతో ఆదివారం ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు.



Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.